చదువు
రూ॥ 180/-
పేజీలు: 210



ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★

రష్యా చమురుపై ఇయు ఆంక్షలు భారత్‌పై నిష్ఫలమా?

ఉక్రేన్ జైలుపై రష్యా దాడి

గాజాలో యుద్ధం ఆపి ఆహారం ఇవ్వండి

లోపలి పేజీల్లో

సంపుటి 08, సంచిక: 239 | బుధవారం | 30-07-2025 | ఖమ్మం   Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar   పేజీలు: 12+8 | వెల రూ. 5.00

ఆపరేషన్ సింధూర్‌ను ఆపమని

# ప్రపంచంలో ఏ నాయకుడూ అడగలేదు

లోక్‌సభలో పహల్గామ్, ఆపరేషన్ సింధూర్‌పై చర్చకు ప్రధాని సమాధానం

## యుద్ధం ఆపానన్న ట్రంప్ ప్రకటనల ఊసెత్తని మోదీ

నిఘా వైఫల్యంపై సమాధానం దాటవేత



**న్యూఢిల్లీ:** భారత్‌-పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ తానే చేశానని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పదే పదే ప్రకటనను ఎందుకు ఖండించలేదని పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు అడిగిన ప్రశ్నకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నేరుగా స్పందించలేదు. ఆపరేషన్ సింధూర్‌ను ఆపమని ప్రపంచంలో ఏ నాయకుడూ మనదేశాన్ని అడగలేదని ఆయన పేర్కొన్నారు. లోక్‌సభలో మంగళవారంనాడు చేసిన సుదీర్ఘ ప్రసంగంలో ఎక్కడా ట్రంప్ పేరెత్తకపోవడమే కాకుండా పహల్గామ్ ఉగ్రదాడిలో నిఘా వైఫల్యం, ఏ ఒక్కదేశం భారతదేశానికి అనుకూలంగా పాకిస్థాన్ పాత్రను ఖండించకపోవడం వంటి విపక్ష సభ్యులు వేసిన ప్రశ్నలకు మోదీ సమాధానాలు దాటవేశారు. పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడి, ఆపరేషన్ సింధూర్‌పై రెండు రోజులు జరిగిన చర్చపై ప్రధానమంత్రి సమాధానం ఇస్తూ, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా మనదేశాన్ని మనం రక్షించుకోవడానికి చర్యలు తీసుకోకుండా ప్రపంచంలో ఏ దేశమూ మనల్ని అడ్డుకోలేదని చెప్పారు. ఏ నాయకుడూ భారత్‌ను ప్రశ్నించలేదనీ, ఆపరేషన్ సిందూర్‌కు యావత్ ప్రపంచం నుండి మద్దతు లభించినప్పటికీ, దేశంలో కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు మాత్రం దేశ సైనికుల శౌర్యపరాక్రమాల తరువాయి 2లో

సాయుధ దళాల

# చేతులు కట్టేశారు

వారికి మద్దతివ్వడంలో కేంద్ర ప్రభుత్వానికి రాజకీయ సంకల్పం లేదు

## మోదీకి ధైర్యముంటే ట్రంప్ అబద్ధాలకోరు అని చెప్పాలి

లోక్‌సభలో విపక్షనేత రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ :** భారత సాయుధ దళాలకు మద్దతు ఇవ్వడంలో ప్రభుత్వానికి రాజకీయ సంకల్పం లేదని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ విమర్శించారు. పాకిస్థాన్‌లోని సైనిక , వైమానిక రక్షణ మౌలిక సదుపాయాలపై దాడి చేయకూడదని రాజకీయ నాయకత్వం సాయుధ దళాల చేతులను కట్టేయడం వల్లే విమానాలు కోల్పోయాయని ఆయన అన్నారు. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన సున్నితమైన వివరాలను పాకిస్థాన్‌కు కేంద్రం వెల్లడించిందని ఆరోపించారు. నాడు పాకిస్థాన్‌తో యుద్ధం సమయంలో నాటి అమెరికా అధ్యక్షుడు నిక్సన్ బెదిరింపులకు ప్రధాని ఇందిరాగాంధీ లొంగలేదని గుర్తు చేశారు. ఆమె ధైర్యంలో 50 శాతం ఉన్నా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అబద్ధాల కోరు అని, కాల్పుల విరమణ నీవు జరిపించలేదని ఇప్పటికైనా సభలో ప్రధాని మోదీ ధైర్యంగా చెప్పాలని డిమాండ్ చేశారు. లోక్‌సభలో మంగళవారం పహల్గామ్, ఆపరేషన్ సిందూర్‌పై జరిగిన ప్రత్యేక చర్చలో ఆయన పాల్గొన్నారు. రాజ్‌నాథ్ సింగ్ ఆపరేషన్ సిందూర్ తెల్లవారుజామున 1:05 గంటలకు ప్రారంభమైందని, 1:35 గంటలకు భారతదేశం సైనికేతర లక్ష్యాలపై దాడి పూర్తి చేసిందని, వెంటనే పాకిస్థాన్‌కు తరువాయి 2లో



# హైదరాబాద్ పర్యావరణహితం

- మహానగరాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యం
- పాతికేళ్ల అవసరాలకు తగినట్టు ప్రణాళికలు
- ఫోర్త్ సిటీలో ఉన్న కాలుష్యకారక పరిశ్రమలను ఒఆర్ఆర్ బయటికి తరలించాలి
- మెట్రో పనులు వేగవంతం చేయాలి
- నగరానికి ఐకానిక్‌గా మూసీ అభివృద్ధి ఉండాలి
- ఎంఎయుడి సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ నగరాన్ని పర్యావరణహితంగా మార్చాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. విపరీతమైన కాలుష్యంతో ఢిల్లీ, ముంబయి, చెన్నై వంటి నగరాల్లో ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అటువంటి పరిస్థితి హైదరాబాద్ నగరంలో తలెత్తకూడదన్నారు. కోర్ సిటీలో ఉన్న కాలుష్యకారక పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు తరలించాలని సిఎం ఆదేశించారు. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖపై సిఎం రేవంత్‌రెడ్డి మంగళవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ నగరాన్ని కాలుష్యరహితంగా మార్చేందుకు అవసరమైన సంస్కరణలు, రానున్న 25 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళికలు రూపొందించాలని సిఎం అధికారులకు సూచించారు. ఇందుకు కోసం ఢిల్లీ, ముంబయి, చెన్నై వంటి నగరాల్లో సమస్యలను అధ్యయనం చేయాలన్నారు. నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, అండర్ గ్రౌండ్ కేబులింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని, ఇందుకు సమగ్ర డిపిఆర్‌లు తయారు చేయాలని సిఎం సంబంధిత అధికారులను ఆదేశించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలని, నిర్మాణ రంగ వ్యర్థాలను సిటీలో ఎక్కడపడితే అక్కడ డంప్ చేయకుండా చూడాలని సిఎం ఆదేశించారు. ఉద్దేశపూర్వకంగా అలా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్ నగరంలో మంచి నీటి సరఫరా, మురుగు నీటి సరఫరా వ్యవస్థను పూర్తిగా సంస్కరించాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందేలా హైదరాబాద్ నగర మంచినీటి సరఫరా, సీవరేజీ బోర్డు తరువాయి 2లో

## పహల్గామ్ ఉగ్రవాదులను మట్టుబెట్టాం

లోక్‌సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటన



**న్యూఢిల్లీ :** పహల్గామ్ మారణహోమం జరిపిన ముగ్గురు ఉగ్రవాదులను ఆర్మీ, సిఆర్‌పిఎఫ్, జమ్మూ కశ్మీర్ పోలీసులు సంయుక్తంగా శ్రీనగర్‌కు సమీపంలో జరిపిన ఆపరేషన్‌లో మట్టుబెట్టినట్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షా మంగళవారం లోక్‌సభలో ప్రకటన చేశారు. ఆపరేషన్ సిందూర్‌పై జరిగిన ప్రత్యేక చర్చ సందర్భంలో ఆయన 'ఆపరేషన్ మహాదేవ్' వివరాలను వెల్లడించారు. హతమైన ఉగ్రవాదులను సులేమాన్ అలియాస్ ఫైజల్, ఆఫ్ఘాని, జిబ్రాన్‌లుగా గుర్తించినట్లు వెల్లడించారు. సులేమాన్ లష్కర్-ఎ-తైబాకు చెందిన ఎ కేటగిరీ కమాండర్ కాగా, ఆఫ్ఘాని కూడా ఎ కేటగిరీ ఎల్ ఇ టి తరువాయి 2లో

## భద్రతా లోపాలకు అమిత్ షాదే బాధ్యత

రాజ్యసభలో ప్రతిపక్షనేత మల్లిఖార్జున్ ఖర్గే విమర్శ



**న్యూఢిల్లీ :** పహల్గామ్ ఉగ్రదాడికి దారితీసిన భద్రతా వైఫల్యానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని, కచ్చితంగా జవాబుదారీతనాన్ని నిర్ధారించాలని రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడు మల్లిఖార్జున్ ఖర్గే డిమాండ్ చేశారు. హోం మంత్రి తప్పిదాన్ని దాచేందుకు, ఆయనను కాపాడేందుకు జమ్మూ కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా పెహల్గామ్ దాడిని ఆపడంలో వైఫల్యం బాధ్యతను తనపై వేసుకున్నారని తెలిపారు. పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌పై జరిగిన ప్రత్యేక చర్చలో తరువాయి 2లో

ట్రంప్ ప్రకటనపై ఎందుకు

## మోదీ స్పందించలేదు?

లోక్‌సభ చర్చలో సిపిఐ ఎంపి సుబ్బరాయన్



**న్యూఢిల్లీ :** తానే భారతదేశం, పాకిస్థాన్‌ల మధ్య యుద్ధం ఆపినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 25 సార్లు చెప్పినా, ప్రధాని నరేంద్ర మోదీ ఒక్కసారి కూడా ఎందుకు స్పందించలేదని సిపిఐ లోక్‌సభ సభ్యుడు కె.సుబ్బరాయన్ ప్రశ్నించారు. అమెరికా అంటే ఎందుకు భయపడుతున్నారని అన్నారు. లోక్‌సభలో పహల్గామ్, ఆపరేషన్ సిందూర్‌పై జరిగిన ప్రత్యేక చర్చలో ఆయన పాల్గొంటూ గడచిన పదకొండు సంవత్సరాల అనుభవంలో ఈ ప్రభుత్వం తమ ఘనత అని చెప్పుకునేందుకు ఏమి లేదని నిరూపించుకుందని ఎద్దేవా చేశారు. ఆర్టికల్ 371 తొలగించిన తరువాత కశ్మీర్ ఉగ్రవాద చర్యల నుంచి విముక్తి తరువాయి 2లో



నాగార్జునసాగర్

# క్రస్ట్ గేట్లు ఓపెన్

26 గేట్లు ఎత్తడంతో దిగువకు పరుగెడుతున్న కృష్ణమ్మ

18 ఏళ్ల తర్వాత జూలైలోనే పరవళ్ళు

కృష్ణ జలాలకు పుష్పాభిషేకం చేసిన మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, లక్ష్మణ్ కుమార్

ప్రజాపక్షం/నల్లగొండ

నాగార్జున సాగర్ క్రస్ట్ గేట్లు 18 ఏళ్ల తర్వాత తొలిసారిగా జులైలో ఎత్తి నీటిని దిగువకు వదిలారు. మంగళవారం రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లతో కలిసి నాగార్జునసాగర్ ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదిలారు.ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ దివంగత ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ చేతుల మీదుగా శంకుస్థాపన చేయబడిన నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఒక ఆధునిక దేవాలయం అని ప్రాజెక్టులను ఆధునికరిస్తాము పూడిక తరువాయి 12లో

అసెంబ్లీ ఎన్నికల నాటికి

# బలోపేతమవుదాం






స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ సత్తా చాటాలి

కార్యకర్తలకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని పిలుపు

యాదాద్రి జిల్లా సిపిఐ నాలుగో మహాసభలు ప్రారంభం

ప్రజాపక్షం/యాదాద్రి భువనగిరి

పార్లమెంటు, శాసనసభ ఎన్నికలకు మరో మూడేళ్ల సమయముందని, అప్పటిలోగా రాష్ట్రవ్యాప్తంగా సిపిఐ బలాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. అందుకు ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించి, ప్రజలను ఉద్యమాల్లో మమేకం చేయాలని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. కమ్యూనిస్టులు ఏకం కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండలో మంగళవారం జరిగిన సిపిఐ జిల్లా నాలుగవ మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత సిపిఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్ రెడ్డి అరుణపతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రతినిధుల సభలో కూనంనేని ప్రసంగిస్తూ, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి నాయకత్వం వహించిన ఉద్యమాల జిల్లా ఉమ్మడి నల్లగొండను ఎర్రగొండగా మార్చేందుకు, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ సత్తా చాటాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మతం సెంటిమెంటుతో ప్రజల మధ్యన విద్వేషాలను రెచ్చగొడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశ సంపదను కొల్లగొడుతున్నదని విమర్శించారు. కాంగ్రెస్‌తో రాజకీయ పొత్తు ఉన్నప్పటికీ ప్రజల సమస్యలపై పాలకులను తరువాయి 12లో

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు

# దొడ్డ పద్మ మృతి

ప్రజాపక్షం/సూర్యాపేట /హైదరాబాద్



తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే దొడ్డ నర్సయ్య సతీమణి దొడ్డ పద్మ (99) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఐదురోజుల క్రితం సూర్యాపేట జిల్లా చిలుకూరులోని ఆమె నివాసంలో కిందపడటంతో కుటుంబ సభ్యులు ఆమెను హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. ఆసుపత్రిలో ఆమె చికిత్స పొందుతూ మరణించారు. ఆమెకు ఒక కుమార్తె ఉన్నారు. దొడ్డ పద్మ అంత్యక్రియలు స్వగ్రామమైన చిలుకూరులో బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గన్నవరం సమీపంలోని బుద్దవరం గ్రామానికి చెందిన కాట్రగడ్డ రంగయ్య-అన్నపూర్ణమ్మలకు నాలుగో సంతానంగా దొడ్డ పద్మ జన్మించారు. వారి కుటుంబం కృష్ణాజిల్లా తిరువూరు తాలుకా ఖమ్మంపాడు మండలం అట్లప్రగడ గ్రామానికి వలస వచ్చింది. ఆమె తెలంగాణ సాయుధ పోరాటానికి ఆకర్షితులయ్యారు. ఉద్యమంలోనే దొడ్డ నర్సయ్యకు పద్మ పరిచయం కావడంతో పార్టీ పెద్దల సమక్షంలో ఒక్కటయ్యారు. 1985 నుండి1995 వరకు ఉమ్మడి నల్లగొండ జిల్లా మహిళ సమాఖ్య జిల్లా అధ్యక్షురాలుగా, రాష్ట్ర కమిటీ తరువాయి 2లో




మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడితే

## చట్ట ప్రకారం చర్యలు

03

# హన్మకొండను వరంగల్‌లో కలపండి




ఉమ్మడి జిల్లాను ఆరు ముక్కలు చేయడంపై నిరసన

ఉద్యమానికి సిద్ధమంటున్న పార్టీలు, ప్రజాసంఘాలు

ప్రజాపక్షం/హనుమకొండ

రాష్ట్రంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన జిల్లాల విభజనపై నేటికీ అసంతృప్తి వ్యక్తం అవుతూనే ఉంది. ముఖ్యంగా చారిత్రక నేపథ్యం కలిగిన వరంగల్ జిల్లాను అశాస్త్రీయంగా ఆరు ముక్కలు చేయడంపై మొదటి నుండి ఉమ్మడి జిల్లా ప్రజలు వ్యతిరేకిస్తూనే వస్తున్నారు. తాజాగా మరోసారి మేధావులు, ప్రజాసంఘాల నాయకులు, వివిధ రాజకీయ పార్టీలు సమావేశాలు, చర్చా గోష్టిలతో జిల్లాల విభజన అంశాన్ని తెరమీదకు తెచ్చాయి. విస్తీర్ణం, జనాభాలో చిన్న జిల్లా అయిన ఉమ్మడి వరంగల్‌ను విభజించిన తీరుపైనే వీరు ప్రశ్నలు సంధిస్తున్నారు. ఇతర ఉమ్మడి జిల్లాల పరిధి పెద్దగా ఉన్నప్పటికీ ఎక్కడా కూడా మూడు, నాలుగు జిల్లాల కంటే ఎక్కువగా కొత్త జిల్లాలను ఏర్పాటు చేయకపోవడం, ఒక్క వరంగల్‌ను మాత్రమే ఆరు ముక్కలు చేయడంపై ఇక్కడి పార్టీల, ప్రజాసంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరీ ముఖ్యంగా రాష్ట్రంలో హైదరాబాద్ తరువాత అతి పెద్ద నగరంగా ఉన్న గ్రేటర్ వరంగల్‌ను రెండు జిల్లాలుగా చేయడంపై ప్రజలు కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇలా తెలంగాణలో ఏ నగరాన్ని రెండు జిల్లాలుగా విభజించలేదు. నల్లగొండ, కరీంనగర్. ఖమ్మం, ఆదిలాబాద్, మహబూబ్ నగర్ తదితర ఉమ్మడి జిల్లాల్లో కూడా కొత్త జిల్లాలను విభజించారు. కానీ, ఆయా నగరాలను మాత్రం ఎక్కడా రెండు ముక్కలు చేయలేదు. గ్రేటర్ వరంగల్‌ను రెండు జిల్లాలుగా విభజించడం వల్ల పరిపాలనా సమస్యలు ఉత్పన్నమవుతున్నాయంటున్నారు. పోలీస్, ఎడ్యుకేషన్, రెవెన్యూ ఎండోమెంట్, మున్సిపాలిటీ, మెడికల్ తదితర విభాగాలన్నీ వేరు వేరు జిల్లాల్లో ఉండడం వల్ల రాబోయే రోజుల్లో తరువాయి 12లో

సామూహికంగా ఓట్ల తొలగింపు ఉంటే...

# 'మా జోక్యం తథ్యం'

బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఓటరు జాబితా 'ఎస్ఐఆర్'పై సుప్రీంకోర్టు

పిటిషన్లను ఆగస్టు 12, 13 తేదీలలో విచారిస్తామని ధర్మాసనం వెల్లడి




**న్యూఢిల్లీ :** ఎన్నికల సంఘం (ఇసి) ఒక రాజ్యాంగ సంస్థ అని , అది చట్టప్రకారం పనిచేస్తుందని భావించబడుతుందని మంగళవారం సుప్రీంకోర్టు పేర్కొంది. బిహార్ రాష్ట్రంలోని ఓటర్ల జాబితాలో ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్)లో ఒకవేళ సామూహికంగా ఓట్లు తొలగింపు ఉంటే అత్యున్నత న్యాయస్థానం తప్పక జోక్యం చేసుకుంటుందని స్పష్టంచేసింది. బిహార్‌లో ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ ప్రక్రియను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ల జాబితాను పరిశీలించడానికి న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జోయ్‌మాల్యా బాగ్చి ధర్మాసనం ఒక కాలక్రమాన్ని (టైమ్‌లైన్) ఖరారుచేసింది. దీనిపై ఆగస్టు 12, ఆగస్టు 13తేదీలలో విచారణ చేపడతామని తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## న్యూయార్క్‌లో కాల్పులు:ఐదుగురు మృతి

**న్యూయార్క్:** న్యూయార్క్ నగరంలో అత్యంత జనసాంద్రతగల మన్హాటన్ డౌన్‌టౌన్‌లో ప్రముఖ భవనాలు, సంపన్నుల నివాసాలు, కొన్ని కార్యాలయాలు ఉండే ఆకాశహార్మ్యాల భవంతుల్లోకి చొరబడిన ఒక గన్‌మెన్ నలుగురిని కాల్చి చంపాడు. ఈ ఘటనలో ఒక పోలీసు అధికారి కూడా మరణించారు. తర్వాత గన్‌మెన్ తనను తాను కాల్చుకుని మరణించాడు. కాల్పులు దాడికి పాల్పడిన యువకుణ్ణి లాస్‌వేగాస్‌కు చెందిన షేన్ తమురా (27)గా పోలీసులు గుర్తించారు. మన్‌హట్టన్‌లోని పార్క్ ఎవెన్యూ ఆఫీసులోకి గన్‌మెన్ చాలా హుందాగా నడుచుకుంటూ వెళ్ళాడు. లాబీలో ఉన్నవారిపై ఇష్టానుసారంగా కాల్పులు జరిపి ఆ తర్వాత 33వ ఫ్లోర్‌లోకి ప్రవేశించాడు. ఈ కాల్పుల్లో న్యూయార్క్ సిటీ పోలీసు అధికారి దిదారుల్ ఇస్లామ్ (36) మరణించారు. గన్‌మెన్ కాల్పులు జరిపిన సమయంలో పార్క్ ఎవెన్యూ వద్ద ఇస్లామ్ భద్రతా విధులు నిర్వహిస్తున్నారు. కాగా దిదారుల్ ఇస్లాం ఇప్పుడు ఒక హీరోగా మారారు. కాల్పులు జరుపుతున్న దుండగుడి బారి నుండి అక్కడివారిని కాపాడేందుకు దిదారుల్ ఇస్లాం వీరోచితంగా పోరాడాడు. తనకు చేతనైనంతవరకూ అందరినీ కాపాడే ప్రయత్నం చేసి మృతులసంఖ్యను గణనీయగా తగ్గించాడు.

# ఉక్రేన్ జైలుపై రష్యా దాడి



## 22 మంది మృతి

**కీవ్:** ఉక్రేన్‌పై రష్యా మంగళవారం తెల్లవారకముందే దాడులు చేసింది. 73 నగరాలు, పట్టణాలు, గ్రామాలపై జరిగిన క్షిపణి దాడుల్లో 22 మంది మరణించగా, 80 మంది గాయపడ్డారని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ప్రకటించారు. ఒకవైపు చాలారోజులుగా శాంతి చర్చల యత్నాల్లో యుద్ధ ముగింపు చర్యలు కొనసాగుతుండగా, ఉద్దేశపూర్వకంగా రష్యా ఈ దాడులు చేసిందని జెలెన్స్కీ విమర్శించారు. శక్తిమంతమైన గ్లైడ్ బాంబులతో గగనతల దాడులు చేసింది. ఆగ్నేయ ఉక్రేన్‌లోని యుద్ధప్రాంతంలో ఉన్న ఒక జైలుపై రష్యా గగన తల దాడులు చేసింది. ఈ దాడుల్లో జైలులో ఉన్న 17 మంది మరణించారు. మరో 42 మంది ఖైదీలు,సిబ్బంది తీవ్రంగా గాయపడ్డారు. సెంట్రల్ ఉక్రేన్ రీజియన్ డ్నిప్రోలో మూడు అంతస్తుల భవనం క్షిపణి దాడిలో ధ్వంసమైంది. ఈ సమీపంలో ఉన్న వైద్యకేంద్రం, ప్రసూతి ఆసుపత్రి కూడా ధ్వంసమయ్యాయి. జపోరిఝియా ప్రాంతంపై కూడా రాత్రికి రాత్రి జరిగిన దాడుల్లో ఆ పరిసర ప్రాంతాల్లోని ఇళ్ళు ధ్వంసమయ్యాయని రీజినల్ లీడర్ ఇవాన్ ఫెడోరోవ్ చెప్పారు. ఉక్రేన్‌కు తూర్పువైపు ఉన్న నాలుగు ప్రాంతాలలో జపోరిఝియా కూడా ఒకటి. 2022 లో ప్రారంభమైన యుద్ధంలో ఈ ప్రాంతాన్ని తాము ఆక్రమించామని రష్యా చెబుతున్నప్పటికీ చాలా వరకూ ఎక్కువ భూభాగం ఉక్రేన్ స్వాధీనంలోనే ఉంది. యుద్ధం మొదలైనప్పటినుండీ రష్యా ఎక్కువగా జపోరిఝియా ప్రాంతంపైనే యుద్ధ దాడులు చేస్తున్నది. బిలెంకే పెనిటెన్షియరీ భవనంపై బాంబుదాడులు చేయడంతో జైలులో ఉన్న డైనింగ్ హాలు, ఇతర ప్రాంతాలు ధ్వంసమయ్యాయి. జైలులో ఉన్నవారు మరణించారు. ఈ విధంగా జైలుపై దాడి చేయడం అమానుషం, మానవ హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందని ఉక్రేన్ మానవహక్కుల కమిషనర్ హెచ్చరించారు.

**ట్రంప్–పుతిన్ ముఖాముఖీ ప్రస్తుత ఎజెండాలో లేదు:పెస్కోవ్**

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, తమ అధ్యక్షుడు పుతిన్ మధ్య ముఖాముఖీ చర్చల ప్రక్రియ ప్రస్తుత క్రియాశీల ఎజెండాలో లేదని రష్యా ప్రధాన కార్యాలయం క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ అన్నారు. ఆయనకు మాతో మాట్లాడే ఆసక్తి లేదని కూడా పెస్కోవ్ విమర్శించారు. ట్రంప్ కొత్తగా విధించిన 12 రోజుల గడువు గురించి తమకు తెలుసునని, అన్నీ తాము గమనిస్తున్నామని మంగళ వారంనాడు పెస్కోవ్ టాస్ వార్తాసంస్థతో చెప్పారు. వీలైనంతవరకూ ట్రంప్ వ్యాఖ్యలకు దూరంగా ఉండాలనుకుంటున్నామన్నారు. అదేవిధంగా, అమెరికాతో సాధారణ సంబంధాల పునరుద్ధరణకు రష్యా సిద్ధంగా ఉందని పెస్కోవ్ చెప్పారు. ఈ సంబంధాలు సాధారణస్థాయికి తిరిగిరావాలంటే రెండు వైపుల నుండి చొరవ చూపించాల్సిన అవసరం ఉందని అన్నారు. ''అందుకు మేం కట్టుబడే ఉన్నాం, ముమ్మర ప్రయత్నం చేస్తాం, కానీ రెండు వైపుల నుండి తగిన కృషి జరగాల్సి ఉంటుంది'' అన్నారు. యాభై రోజుల్లో ఉక్రేన్‌తో కాల్పుల విరమణ ఒప్పందం చేసుకోవాలని, లేకపోతే రష్యాపై తీవ్రమైన ఆంక్షలతోపాటు దాని వాణిజ్య భాగస్వామ్య దేశాలపై 100 శాతం సుంకాలు విధిస్తామని ట్రంప్ రెండు వారాలక్రితం బెదిరించారు. ఇప్పుడు ఈ గడువును పది నుండి పన్నెండు రోజులకు తగ్గించారు.

## రెండు వారాల గడువుపై హర్షం ప్రకటించిన జెలెన్స్కీ



యాభైరోజుల్లో ఉక్రేన్‌తో శాంతి ఒప్పందం చేసుకోవాలని రెండు వారాలక్రితం షరతు విధించిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తాజాగా సోమవారం రాత్రి బ్రిటన్‌లోని స్కాట్‌లాండ్ లగ్జరీ రిసార్టులో బసచేసిన సందర్భంగా, రెండు వారాల్లోపు ఉక్రేన్‌తో శాంతి ఒప్పందం చేసుకోవాలని గడువు విధించారు. ఆగస్టు 9వ తేదీ లోపు పుతిన్ ఒప్పందం చేసుకోకపోతే, రష్యాపై తీవ్ర ఆంక్షలు విధిస్తామని, ఆ దేశంతో వ్యాపారం చే సే దేశాలపై కూడా భారీ ఎత్తున సుంకాల భారా లు వేస్తామని హెచ్చరిక చేశారు. ఈ కొత్త షరతు పై అధికారికంగా ఒక ప్రకటన చేస్తానని కూడా ఆయన అన్నారు. ట్రంప్ చేసిన ఈ తాజా ప్రకటనపై జెలెన్స్కీ హర్షం వ్యక్తం చేశారు. నిజానికి పుతిన్ ప్ర పంచదేశాల సమయాన్ని వృథా చేస్తున్నారని, స మస్య పరిష్కరించకుండా తమ దేశంపై దాడు లు కొనసాగిస్తూ, తాత్కారం చేస్తున్నారని, యుద్ధా న్ని పొడిగించి సమస్య తీవ్రత పెంచుతున్నారనీ జెలెన్స్కీ విమర్శించారు.

# గాజాలో యుద్ధం ఆపి ఆహారం ఇవ్వండి

పాలస్తినా మనుగడకు స్వయం ప్రతిపత్తి పరిష్కారం

పాలస్తినాపై ఐక్యరాజ్యసమితి సదస్సు డిమాండ్

ఇదంతా ఓ పబ్లిక్ స్టంట్: ట్రంప్ ఎద్దేవా





**టర్న్‌బెర్రీ:**రెండు దేశాలుగా ఇజ్రాయెల్–పాలస్తినా శాంతియుతంగా మనగడ సాగించేందుకు ప్రపంచ దేశాలు కృషి చేయాలని, పాలస్తినాకు స్వయంప్రతిపత్తి ఒక్కటే పశ్చిమాసియాలో సంక్షోభానికి పరిష్కారమని ఐక్యరాజ్య సమతి సదస్సు పిలుపు ఇచ్చింది. గాజాలో తక్షణం యుద్ధం ఆపి, ప్రజలకు ప్రాణ రక్షణ కల్పించాలని, కరువు పరిస్థితుల నుండి పాలస్తినా ప్రజలను బయటపడేసేందుకు ఆహార సరఫరాలను భారీ ఎత్తున పెంచాలని సదస్సు పిలుపు ఇచ్చింది. రెండు దేశాలుగా దాయాదులు మనుగడ సాగించడంతప్ప పశ్చిమ ఆసియాలో ఇజ్రాయెల్–పాలస్తినాలకు మరో మార్గం లేదని ఫ్రాన్స్,బ్రిటన్ సహా పలు దేశాల ప్రతినిధులు ఎతుగెత్తి చాటారు. ఫ్రాన్స్–సౌదీ అరేబియా దేశాల ప్రోద్బలంతో ఐక్యరాజ్యసమితి విజయవంతంగాఈ సదస్సు నిర్వహించింది.

పాలస్తినా అథారిటీ ప్రధానమంత్రి మహ్మద్ ముస్తాఫా,సౌదీఅరేబియా విదేశాంగమంత్రి ఫైజల్ బిన్ ఫర్హాన్ అల్‌సౌద్, ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్, ఫ్రాన్స్ విదేశాంగమంత్రి జీన్ నోయల్ బారోట్ తదితర ప్రముఖులు సదస్సు నిర్వహణలో ప్రముఖపాత్ర వహించారు. ఇక పాలస్తినాలో పరిస్థితులను క్షీణదశకు వెళ్ళకుండా చూస్తామని ఆంటోనీ గుటెర్రెస్ అన్నారు. సెప్టెంబరునెలలో పాలస్తినాను ఒక స్వయంప్రతిపత్తిగల స్వతంత్ర దేశంగా గుర్తిస్తామని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ఈ సదస్సుకు కొద్దిరోజులు ముందుగా ప్రకటించారు. తాము కూడా ఫ్రాన్స్ అడుగుజాడల్లోనే నడుస్తామని పాలస్తినాకు గుర్తింపు ఇస్తామని లగ్జెంబర్గ్ దేశం కూడా ప్రకటించింది. ఐతే ఈ ప్రకటనలను అమెరికా–ఇజ్రాయెల్ తీవ్రంగా వ్యతిరేకించాయి. అలాంటి ప్రకటన చేస్తే ఒక ఉగ్రవాద దేశాన్ని పెంచిపోషించినట్లే కాగలదని నేతన్యాహూ విమర్శించారు. పాలస్తినా స్వతంత్ర్యరాజ్యాన్ని గుర్తించే విషయంపై ఐక్యరాజ్యసమితి ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన సదస్సును ''ఒక పబ్లిక్ స్టంట్'' (ప్రపంచదేశాల దృష్టిని ఆకర్షించే ప్రయత్నం)గా డోనాల్డ్ ట్రంప్ ఎగతాళి చేశారు. ఈ సదస్సును అమెరికా–ఇజ్రాయెల్ దేశాలు రెండూ బహిష్కరించాయి.

**గాజాలో అమెరికా ఫుడ్ సెంటర్లు:ట్రంప్**

పాలస్తినాను ధ్వంసం చేసేందుకు అన్నిరకాల మా ర్గాలను అనుసరిస్తున్న ట్రంప్‌మరోవైపు ప్రపంచం ఒత్తిడిని తట్టుకోలేక గాజాలో అమెరికా ఫుడ్ సెంట ర్లు నిర్వహిస్తుందని ప్రకటించారు. యుద్ధంతో అలతాకుతలమవుతున్న గాజాలో ప్రజల ఆకలి బా ధలు తీర్చేందుకు ఫుడ్ సెంటర్లు నిర్వహిస్తామని స్కాట్‌లాండ్ పర్యటన సందర్భంగా చెప్పారు. ప్ర జలు ఎవ్వరైనా ఈ ఫుడ్ సెంటర్లకు వెళ్ళి కడుపునిండుగా తినవచ్చునన్నారు. ఈ ఫుడ్ సెంటర్లలో తినడానికి ఎలాంటి సరిహద్దు ఆంక్షలూ లేవని చె ప్పారు. ఇప్పటికే గాజాలోకి కొన్ని దేశాలు గగనతలమార్గంలో, భూమార్గంలో ఆహార సరఫరాలను పెంచాయి. ఒక ప్రముఖ అంతర్జాతీయ సంస్థ సర్వే ప్రకారం, గాజాలో మంగళవారంనాటికి తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. ఎంతగా ఆహారసరఫరాలు పెంచినాగానీ, లక్షమంది స్త్రీలు, పిల్లలకు తక్షణం పోషకాహారం సరఫరా చేయాల్సిన అవస రం ఉందని పేర్కొంది. ఇప్పటికే గాజాలో 88 మం ది పిల్లలు సహా 147 మంది పస్తులతో మరణించా రు. ఇరవైనాలుగు గంటల్లో ఇజ్రాయెల్ చేసిన దా డుల్లో 92 మంది మరణించారు. ఆహార కేంద్రాలవ ద్ద జరిగిన కాల్పుల్లో 41 మంది మరణించారు. మే నెల నుండీ ఇప్పటివరకూ ఆహార కేంద్రాలవద్ద ప్ర జలపై ఇజ్రాయెల్ జరిపిన కాల్పుల్లో 1,157 మంది మరణించారు.

## ఉత్తర చైనాలో వరదలు:34 మంది మృతి



**బీజింగ్:** ఉత్తర చైనా ప్రాంతాన్ని వరదలు ముంచెత్తుతున్నాయి. ఈ వరదల్లో ఇప్పటివరకూ 34 మం ది మరణించారు. మరో 88,000 మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ప్రకృతి వైపరీత్యాల నియంత్రణ సహాయసిబ్బంది పెద్దసంఖ్యలో రంగంలోకి దిగారు.రోడ్లు ధ్వంసమయ్యాయి. నివాసిత ప్రాంతాలు కాలువల్లా మారాయి. విద్యుత్ సరఫరా స్తంభించింది. దీంతో ఆ ప్రాంత ప్రజలను మరోచోటకు తరలించారు. ఉత్తర పర్వతజిల్లాలలో ఎక్కువగా మరణాలు సంభవించాయి. మియున్‌లో 28 మంది మరణించారు. యాన్ క్వింగ్‌లో ఇద్దరు మరణించారు. చైనా అధ్యక్షుడు జీ జిన్ పింగ్ వరద సహాయ పరిస్థితులను సమీక్షించారు. ప్రజల ప్రాణాలకు పూర్తి భద్రత కల్పించాలని, వారికి అన్ని సదుపాయాలు సమకూర్చాలని సహాయ సిబ్బందిని ఆదేశించారు. చైనా కమ్యూనిస్టుపార్టీ సెంట్రల్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా, సెంట్రల్ మిలిటరీ కమిషన్ ఛైర్మన్ హోదాలో జిన్ సింగ్ సహాయబృందాలకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. దీంతో చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ బృందాలు రంగంలోకి దిగాయి. ఇటీవలికాలంలో చైనాలోని అనేక ప్రాంతాలు వరద బారిన పడి తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నాయి. బీజింగ్, హెబాయ్, జిలిన్, షాన్‌డాంగ్ తదితర రాష్ట్రాలలో ఇటీవలికాలంలో భారీ వర్షాలు, వరదలవల్ల తీవ్ర ఆస్తినష్టం, ప్రాణనష్టాలు సంభవించాయని చైనా అధికార పత్రిక తెలియజేసింది.

## మోదీ స్పందించలేదు?

(మొదటి పేజీ తరువాయి)

పొందిందని చెప్పారని, పహల్గామ్ దాడిలో 26 మంది దుర్మరణంతో అది తప్పు అని నిరూపితమైందని అన్నారు. దీనికి ఎవరు కారణం అని ప్రశ్నించారు. ఇందుకు నిఘా వైఫల్యం కారణమని, సత్యమేవ జయతే అనేది నిజమైతే కేంద్ర హోం మంత్రి తన పదవికి రాజీనామా చేయాలని, కానీ ఆయన ఆ పని చేయరని సుబ్బరాయన్ అన్నారు. సభలో ఆయన మాట్లాడిన తీరు ప్రజాస్వామ్యాన్ని బెదిరిస్తున్నట్లుగా ఉందని, జరిగిన దానికి వివరణ ఇవ్వకుండా వితండవాదంతో మాట్లాడిన ధోరణి స్పష్టమైందని మండిపడ్డారు. తమపై ఎవరి ఒత్తిడి లేదని, తమను బైటి వారు ఎవరు నడిపించలేదని విదేశాంగ మంత్రి, రక్షణ మంత్రి అన్నారని, మరి డొనాల్డ్ ట్రంప్ 25 సార్లు తానే యుద్ధం ఆపానని ఎలా అంటున్నారని నిలదీశారు. దీనిపై ప్రధాని ఎందుకు స్పందించడం లేదన్నారు. వీరంతా అమెరికాకు బానిసలుగా మారరాని ఆరోపించారు. పాకిస్థాన్ ఉగ్రస్థావరాలపై దాడులు జరిగిన సమయంలో ప్రతిపక్షాలు కొన్ని ప్రశ్నలు లేవనెత్తితే, ప్రతిపక్షాలను దేశద్రోహులని అన్నారని చెప్పారు. అసలు దేశం కోసం పోరాడని వారు, వలసపాలకులకు లొంగిపోయిన వారు తమ దేశభక్తిని ప్రశ్నించడం విడ్డూరంగా ఉందన్నారు. వలసపాలనకు వ్యతిరేంగా దేశస్వాతంత్ర్యం కోసం కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీ, ద్రవిడ పార్టీలు పోరాడాయని, అలాంటి తమ దేశ భక్తిని ప్రశ్నిస్తారా? అని సుబ్బరాయన్ అన్నారు. స్వాతంత్రోద్యమానికి నేతృత్వం వహించిన గాంధీ, నెహ్రూలపై గురించి మాట్లాడుతున్నారని, నెహ్రూ దేశం కోసం 9 ఏళ్ళు జైలు శిక్ష అనుభవించారని, ఆయన భారతదేశానికి అంతర్జాతీయ ఖ్యాతి తీసుకువచ్చారని అన్నారు. అలాంటి వ్యక్తులను నిందించడం సమంజసం కాదన్నారు. 1962 భారత్ – పాక్ యుద్ధ సమయంలో కూడా చైనా దురాక్రమణను ఖండిస్తూ సిపిఐ తీర్మానం చేసిందని, అది తమ పార్టీ దేశభక్తి వారసత్వానికి నిదర్శనమన్నారు. తమది నిజమైన దేశభక్తి వారసత్వమని బిజెపి లాంటి కల్పిత జాతీయ వాదం కాదన్నారు.

## దొడ్డ పద్మ మృతి (మొదటి పేజీ తరువాయి)

సభ్యురాలుగా, చాలాకాలం సిపిఐ జిల్లా సమితి సభ్యులుగా పనిచేశారు. నల్లగొండ జిల్లా పరిషత్ ఏర్పడినప్పుడు కోఆప్షన్ సభ్యురాలుగా ఆమె ఎన్నికయ్యారు.

**సంతాపం :** దొడ్డ పద్మ మరణ వార్త తెలిసిన వెంటనే సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి ఆసుపత్రికి వెళ్లి ఆమె భౌతికకాయానికి సందర్శించి నివా ళ్లు అర్పించారు. దొడ్డ పద్మ మరణం పట్ల సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అలాగే సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ, తెలంగాణ అమరవీరుల సార్మక ట్రస్ట్ కోశాధికారి ఉజ్జిని రత్నాకర్ రావులు వేర్వేరు ప్రకటనల్లో దొడ్డ పద్మ కుటుంబ స భ్యులకు సానుభూతిని తెలిపారు. పద్మ మృతి పట్ల సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్న చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు సంతాపం వ్యక్తం చేశారు.

## ఉగ్రవాదులను మట్టుబెట్టాం

(మొదటి పేజీ తరువాయి)

ఉగ్రవాది అని, జిబ్రాన్ కూడా వాంటెడ్ ఉగ్రవాది అని తెలిపారు. పహల్గామ్‌లోని బైసారన్ లోయలో భారత పౌరుల హత్యలో పాలుపంచుకున్న ఈ ముగ్గురిని హతమార్చినట్లు చెప్పారు. పాహల్గామ్ దాడికి ముందు వారికి ఆశ్రయం కల్పించిన, ఆహారం అందించిన వారి ద్వారా హతులైన ఉగ్రవాదుల గుర్తింపును నిర్ధారించినట్లు అమిత్ షా తెలిపారు. ఉగ్రవాదుల నుండి స్వాధీనం చేసుకున్న ఆయుధాలను ఒక ఎం–9 , రెండు ఎ.కె.–47 రైఫిళ్లను సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీలో పరిశీలన కోసం సోమవారం రాత్రి ప్రత్యేక విమానంలో చండీగఢ్‌కు తరలించారని, పెహల్గామ్‌లో లభించిన ఖాళీ తూటాలు, ఉగ్రవాదుల నుండి స్వాధీనం చేసుకున్న తుపాకులను పరీక్షించిన తర్వాత లభించిన ఖాళీ తూటాలను ఫోరెన్సిక్ ల్యాబ్ సరిపోల్చిందని అమిత్ షా చెప్పారు. హతమైన ఇద్దరు ఉగ్రవాదుల పాకిస్థానీ ఓటర్ ఐడీలు, పాకిస్థాన్‌లో తయారైన చాక్లెట్లు, ఆయుధాలను భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయని ఆయన తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత దళాలు పాకిస్థాన్ లోపల 100 కి.మీ. దూరంలో ఉన్న లక్ష్యాలపై దాడి చేశాయని, పాకిస్థాన్‌లో ప్రభుత్వ ప్రాయోజిత ఉగ్రవాదాన్ని భారతదేశం బహిర్గతం చేయగలదని అమిత్ షా తెలిపారు.

# చేతులు కట్టేశారు

(మొదటి పేజీ తరువాయి)

ఫోన్ చేసి ఉద్రిక్తతలను పెంచడానికి తాము కోరుకోవడం లేదని తెలియజేసిందని రాహుల్ గాంధీ అన్నారు. ఇవి తన మాటలు కాదని, ఇవి భారతదేశ రక్షణ మంత్రి మాటలు అని చెప్పారు. పరిమితులు విధించడం ద్వారా సాయుధ దళాల మనోధైర్యాన్ని, సామర్థ్యాన్ని ప్రభుత్వం దెబ్బతీసిందని విమర్శించారు. భారత సా యుధ దళాలను ఉపయోగించాలనుకుంటే, 100 శాతం రాజకీయ సంక ల్పం ఉండాలని, ఆపరేషన్‌పై వారికి పూర్తి స్వేచ్ఛను ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఆపరేషన్ ప్రారంభించిన కేవలం 30 ని మిషాల తర్వాత కాల్పుల విరమణ కోరాలని భారత డైరెక్టర్ జనరల్ ఆఫ్ మి లిటరీ ఆపరేషన్స్ (డిజిఎంఓ)కు ప్రభుత్వం సూచించిందని ఆరోపించారు. ఆపరేషన్ సమయంలో రాజకీయ పరిమితుల కారణంగా భారత విమానాల నష్టం జరిగిందని, సైనిక లోపాల వల్ల కాదని రాహుల్‌గాంధీ సైన్యాధికారుల ప్రకటనను ఉటంకించారు. పాకిస్థాన్‌లోని సైనిక , వైమానిక రక్షణ మౌలిక సదుపాయాలపై దాడి చేయకూడదని రాజకీయ నాయకత్వం సాయుధ దళాల చేతులను కట్టేయడం వల్లే విమానాలు కోల్పోయాయని ఆయన అన్నారు.

**ప్రశంసలే కాదు బాధ్యత కూడా వహించాలి : ప్రియాంక**

'నాయకత్వం అంటే కేవలం ప్రశంసలు అందుకోవడం మాత్రమే కాదు, బాధ్యత వహించడం కూడా అవసరం... మన దేశ చరిత్రలో మొదటిసారిగా, యుద్ధం అకస్మాత్తుగా ఆపేసారు. ఈ నిర్ణయాన్ని అమెరికా అధ్యక్షుడు ప్రకటించారు. ఇది మన ప్రధాని బాధ్యతారాహిత్యాన్ని ప్రతిబింబిస్తుంది' కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ అన్నారు. ముంబై ఉగ్రదాడి సమయంలోనే పలువురు ఉగ్రవాదులను నాటి ప్రభుత్వం హతమార్చిందని, ఒక ఉగ్రవాదిని పట్టుకొని చట్టబద్ధంగా ఉరితీసిందని గుర్తుచేశారు. ఆ ఉగ్రదాడి జరిగినప్పుడు నాటి మహారాష్ట్ర కాంగ్రెస్ ముఖ్యమంత్రి, కేంద్ర హోం మంత్రి తమ పదవులకు రాజీనామా చేశారని, మరి పెహల్గామ్ ఉగ్రదాడిలో భద్రతా వైఫల్యానికి బాధ్యత వహిస్తూ ఎవరూ రాజీనామా చేయలేదన్నారు. భారత్, పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడం ప్రధాని నిర్లక్ష్యం ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు.లోక్‌సభలో జరిగిన ప్రత్యేక చర్చలో పాల్గొంటూ కేంద్ర హోం మంత్రి తన ప్రసంగంలో జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ, తన తల్లి కన్నీళ్ల గురించి మాట్లాడారే తప్ప 'శత్రువుకు ఎక్కడికీ పారిపోవడానికి మార్గం లేని సమయంలో యుద్ధం ఎందుకు నిలిపివేయబడింది' అనే ప్రశ్నకు సమాధానం ఇవ్వలేదని అన్నారు.

**కాల్పుల విరమణకు తృతీయపక్షాన్ని ఎందుకు అంగీకరించారు? : అఖిలేష్ యాదవ్**

'ఆపరేషన్ సిందూర్ సమయంలో, ఏ దేశం కూడా మనకు మద్దతు ఇవ్వలేదు. ఇది భారతదేశ విదేశాంగ దౌత్యానికి ఒక చీకటి దశ' అని సమాజ్ వాదీ పార్టీ ఎంపి అఖిలేశ్ యాదవ్ లోక్‌సభ చర్చలో పాల్గొంటూ అన్నారు. 'మన పొరుగు దేశాలు మనపై దాడి చేస్తున్నాయి లేదా మనకు మద్దతు ఇవ్వడం లేదు. చైనా మరింత దూకుడుగా ఉంది. పాకిస్థాన్ నుండి వచ్చే ఉగ్రవాదం వలె ఇది కూడా పెద్ద ముప్పు' అని ఆయన అన్నారు. చైనా భారతదేశ భూభాగాన్ని మాత్రమే కాకుండా, దాని మార్కెట్‌ను కూడా ఆధిపత్యం చేస్తుందని ఆయన హెచ్చరించారు.మనకు పాకిస్థాన్ నుండి ముప్పు లేదని, పెద్ద ముప్పు చైనా నుండే, అది మన భూమిని, మన ఆర్థిక వ్యవస్థను రెండింటినీ ఆక్రమిస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విధానాలు అనుకోకుండా చైనా వాణిజ్య ప్రయోజనాలకు సహాయం చేస్తున్నాయని, భారతదేశ సార్వభౌమత్వాన్ని బలహీనపరుస్తున్నాయని ఆయన ఆరోపించారు. మూడవ పక్షం ద్వారా కాల్పుల విరమణకు ప్రభుత్వం ఎందుకు అంగీకరించింది? వారు ఏ ఒత్తిడిలో ఉన్నారు?' అని ప్రశ్నించారు.

**దేశ ప్రజలను ఓడించిన విశ్వగురువు : కనిమొళి**

ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ప్రపంచ దేశాలకు పంపిన బలగాలో ప్రతిపక్ష ఎంపీల ఎంపిక ఓ విధంగా హర్షణీయమే అయినప్పటికీ అలాంటి అవకాశం రాకుండా ఉంటే మరింత సంతోషంగా ఉండేదని కనిమొళి అన్నారు. 'అసలు దాడులు ఎందుకు జరిగాయి? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 'ఈ బృందాలు ఎందుకు వెళ్లాలి? శాంతికి విఘాతం కలిగింది కాబట్టే ఇలాంటి పరిస్థితి వచ్చింది. ఇది అత్యంత బాధాకరం. మీరు దేశ ప్రజలను ఓడించారు... నిరాశపరిచారు. అందుకే మేము వెళ్లాల్సి వచ్చింది' అని కనిమొళి అన్నారు. 'ఎప్పుడు దాడి జరిగినా మళ్లీ ఇలా జరగదంటారు. వీటి నుంచి విశ్వగురువు నేర్చుకున్నదేమిటి? రా, ఐబీ హెచ్చరించినప్పుడు ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదు? అని కనిమొళి ప్రశ్నించారు.

**పాక్‌కు భారత్ సిందూరం: బెనివాల్**

'ఆపరేషన్‌కు సిందూర్ అనేది పాకిస్థాన్‌కు భారత్ సిందూరం దిద్దినట్లు ఉందని, రాష్ట్రీయ లోక్‌తాంత్రిక్ పార్టీ అధ్యక్షుడు హనుమాన్ బేనీవాల్ వ్యంగ్యంగా అన్నారు. 'ఇక అప్పగింతలే తరువాయి, మీరెళ్లి పాకిస్థాన్‌ను తీసుకురండి' అంటూ ఆపరేషన్ సిందూర్‌పై చర్చలో నవ్వులు పూయించాయి. తనకు ఇచ్చిన సమయం ముగిసినట్టు గంట మోగడంపై అసహనానికి గురయ్యారు.

# పర్యావరణహితం

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఓఆర్ఆర్ పరిధిలోని వారసత్వ కట్టడాల సంరక్షణ, వాటిని పర్యాటక ప్రదేశాలుగా తీర్చిదిద్దేందుకుగానూ కులీకుతుబ్ షాహీ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ మార్గదర్శకాలను సవరించి దానిని మరింత బలోపేతం చేయాలన్నారు. పాతబస్తీలో మెట్రో పనుల పరిస్థితిపైనా సిఎం ఆరా తీశారు. అవసరమైన నిధులు ఇప్పటికే విడుదల చేసినందున అక్కడ మెట్రో పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. మెట్రో ఇతర ఫేజ్‌ల అనుమతులు, తదితర విషయాల్లో ఏమాత్రం జాప్యాన్ని సహించబోమని హెచ్చరించారు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖతో సమన్వయం చేసుకుంటూ త్వరగా పనులు పూర్తయ్యే విధంగా చూడాలని అధికారులకు సూచించారు. ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీర్ పేట ఓఆర్ఆర్ వరకు ఎలివేటేడ్ కారిడార్ పనులు వేగవంతం చేయాలని సిఎం ఆదేశించారు.

**వేగవంతంగా మూసీ రివర్ ఫ్రంట్ పనులు**

మూసీ రివర్ ఫ్రంట్‌కు సంబంధించి హిమాయత్‌సాగర్ నుంచి గాంధీ సరో వర్ వరకు పనులు వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధి కారులను ఆదేశించారు. ఓఆర్ఆర్ నుంచి మూసీ వైపు వచ్చే క్రమంలో కొత్వాల్‌గూడ జంక్షన్‌లో మూసీ రివర్ ఫ్రంట్‌లకు ప్రతీకగా ఇండియా గేట్, గేట్ వే ఆఫ్ ఇండియా, చార్మినార్ లాంటి ఓ ల్యాండ్ మార్క్‌ను నిర్మించాలని, మూసీపై బ్రిడ్జి కమ్ బ్యారేజీలకు ప్రణాళికలు రూపొందించాలని సిఎం సూచించారు. అనుమతులు, నిబంధనల విషయంలో తగు జాగ్రత్తలు వహించాలని అధికారులకు తెలిపారు. నెహ్రూ జూ పార్క్, మీరాలం ట్యాంక్ అభివృద్ధి పనుల్లో పురోగతిపైనా సిఎం సమీక్షించారు. మీరాలం ట్యాంక్ ఎదుట ఏర్పాటు చేసిన ఎస్‌టిపిలు వాటి సామర్థ్యానికి అనుగుణంగా పని చేసేలా చూడాలని సిఎం ఆదేశించారు. జూ పార్క్, మీరాలం ట్యాంక్ సమీపంలో పర్యాటకులు బస చేసేందుకు వీలుగా అధునాతన వసతులతో హోటల్ నిర్మించాలని, పార్క్, మీరాలం ట్యాంక్‌తోపాటు నగరాన్ని వీక్షించేలా హోటల్ ఉండాలని సిఎం అభిప్రాయపడ్డారు. సమీక్షలో సిఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, సిఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి (హెచ్‌ఎండిఎ ఏరియా) కార్యదర్శులు ఇలంబర్తి, టి.కె.శ్రీదేవి, హెచ్‌ఎండిఎ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఎఫ్‌సిడిఎ కమిషనర్ కె.శశాంక, వాటర్ బోర్డు ఎండి అశోక్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్, మెట్రో రైలు ఎండి ఎన్.వి.ఎస్.రెడ్డి, ఎంఆర్‌డిసిఎల్ ఎండి ఇ.వి. నరసింహారెడ్డి, జెఎంఎడి గౌతమి తదితరులు పాల్గొన్నారు.

## అడగలేదు (మొదటి పేజీ తరువాయి)

వెనుక నిలబడలేదని ఆరోపించారు. అణ్వస్త్ర ప్రయోగం చేస్తామని పాకిస్థాన్ ఏమార్చేందుకు ప్రయత్నించిందనీ, కానీ అలాంటి అణ్వస్త్ర బెదిరింపులకు తలవంచబోమని భారతదేశం ప్రపంచానికి చాటి చెప్పిందన్నారు. ''భారతదేశంలో అల్లర్లు రెచ్చగొట్టడంకోసమే పహల్గామ్ కుట్ర చేశారు, భారతదేశ ప్రజలు ఐక్యంగా ఉండి ఆ కుట్రలను వమ్ముచేశారు, నేను ఇప్పుడు ఈ పార్లమెంటు సమావేశాన్నిఒక విజయోత్సవంగా చేసుకుని మాట్లాడుతూ ఉంటే, అక్కడ ఉగ్రవాదుల కేంద్రకార్యాలయాలను ఈ విజయోత్సవం ధ్వంసం చేస్తోందన్నారు. ''మన సాయుధ బలగాల శక్తిసామర్థ్యాలపై మనకు పూర్తి విశ్వాసం ఉంది, పాకిస్థాన్‌కు గట్టి గుణపాఠం చెప్పడానికి వారికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చాం, అనుకున్నవిధంగానే మనబలగాలు వారికి సరైన గుణపాఠం చెప్పాయి, దీంతో ఉగ్రవాదుల వెనుక ఉన్న సూత్రధారులు ఇప్పటికీ నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు'' అన్నారు.''మే తొమ్మిదో తేదీన అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ తనను ఫోన్ ద్వారా సంప్రదించేందుకు మూడు నాలుగుసార్లు ప్రయత్నం చేశారు, కానీ నేను ఆ సమయంలో మన సాయుధబలగాలతో వరుస సమావేశాలలో ఊపిరిసలనంతగా నిమగ్నమయ్యాను'' అని లోక్‌సభకు మోదీ తెలియజేశారు. ''నేను తిరిగి ఆయనకు ఫోన్ చేశాను. అప్పుడు జె.డి.వాన్స్, పాకిస్థాన్ నుండి చాలా పెద్ద దాడి జరగబోతోంది అని నాకు చెప్పారు. ఒకవేళ పాకిస్థాన్ గనుక దాడి చేస్తే, మా దేశం కూడా అంతకంటే చాలాపెద్దస్థాయిలో దాడి చేస్తుంది, వారు తూటాలు ప్రయోగిస్తే, మేం ఫిరంగులు ప్రయోగిస్తాం అని సమాధానం చెప్పాను'' అని లోక్‌సభకు మోదీ వివరించారు. ఆపాకిస్థాన్‌పై సైనికచర్యను ఆపమని ఏ దేశం నాయకుడూ భారత్‌ను అడగలేదని ఆయన పునరుద్ఘాటించారు. పాకిస్థాన్ వైమానిక స్థావరాలను భారతదేశం ధ్వంసం చేసిందనీ, ఇప్పటికీ అవన్నీ ఐసియులోనే ఉండిపోయాయని, ఏప్రిల్ 22న పహల్గామ్‌లో దాడికి పాల్పడిన వారి వెనుక ఉన్న సూత్రధారులు ఇప్పటికీ నిద్రలేని రాత్రులు గడుపుతున్నారని అన్నారు. ఐక్యరాజ్యసమితిలో మూడు దేశాలు తప్ప మిగిలిన అన్ని సభ్యదేశాలూ ఆపరేషన్ సింధూర్‌కు మద్దతుగా నిలబడ్డాయన్నారు.''ఎలాంటి దుస్సాహసం చేసినాగానీ ఆపరేషన్ సిందూర్ నుండి సింధు (సింధునదీ జలాల ఒప్పందం) వరకూ భారీమూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నవిషయం పాకిస్థాన్‌కు బాగా తెలుసు. ఇంతకుముందు కూడా ఉగ్రవాద దాడులు జరిగాయి, తమకేం జరగదని ఉగ్రవాదులవెనుక సూత్రధారులు భావించారు, కానీ తమను మట్టుబెట్టడంకోసం భారతదేశం తమ వద్దకు వస్తుందని ఇప్పుడు వారికి తెలిసివచ్చింది'' అన్నారు. సైనికచర్య సందర్భంగా భారత్‌లో అంతర్గతంగా తయారైన డ్రోన్లు, క్షిపణులు పాకిస్థాన్ శక్తిసామర్థ్యాల డొల్లతనాన్ని బహిర్గతం చేశాయన్నారు.''ఆపరేషన్ సింధూర్ సందర్భంగా భారతదేశ స్వయంసమృద్ధి సామర్థ్యం ఏమిటో ప్రపంచానికి తెలిసివచ్చింది, ఏప్రిల్ 22వ తేదీన పహల్గామ్‌లో ఉగ్రవాదులు చేసిన దాడికి ప్రతీకారంగా పాకిస్థాన్ భూభాగం లోలోపలికి దూసుకువెళ్ళి 22 నిమిషాల్లోనే ఉగ్రవాదుల స్థావరాలను ధ్వంసం చేశాం, భారతదేశం తీసుకునే చర్యలను కొంతమేరకు ముందుగానే పసిగట్టిన పాకిస్థాన్ అను బెరింపులు జారీ చేసింది, కానీ మన సైన్యం పాకిస్థాన్‌లో ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసిన తర్వాత ఇక ఏమీ చేయలేకపోయింది'' అని మోదీ చెప్పారు. రాజకీయ స్వప్రయోజనాలకోసం కాంగ్రెస్‌నాయకులు తనను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేశారని, కానీ భారత సైనికులు వారిని నిరుత్సాహ పరచడంతో నిష్ప్రయోజనమైన వారి ప్రకటనలన్నీ ఆగిపోయాయని ఆరోపించారు. ''పాకిస్థాన్ ప్రోపగాండకు కాంగ్రెస్,దాని మిత్రపక్షాలు దురదృష్టవశాత్తూ అధికార ప్రతినిధులుగా మారారు, భారతదేశం స్వయం సమృద్ధి సాధిస్తే, కాంగ్రెస్‌పార్టీ మాత్రం సమస్యలు వెతుక్కోవడానికి ఇప్పుడు పాకిస్థాన్‌పైన ఆధారపడింది, పాకిస్థాన్‌కు కాంగ్రెస్‌పార్టీ క్లీన్‌చిట్ ఇచ్చి వారితో గళం కలుపుతుంటే యావత్ భారతదేశం ఆశ్చర్యంలో చూస్తోంది'' అని మోదీ తీవ్ర ఆరోపణలు చేశారు.

## బాధ్యత (మొదటి పేజీ తరువాయి)

ఆయన పాల్గొంటూ కాంగ్రెస్ నాయకుడు ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. 2015లో ప్రధాని నరేంద్ర మోదీ ముందుగా షెడ్యూల్‌లో లేకుండానే పాకిస్థాన్‌కు పర్యటించడాన్ని ఎద్దేవా చేశారు. పెహల్గామ్ దుర్ఘటన తరువాత ప్రధాని నరేంద్ర మోదీ అఖిలపక్ష సమావేశానికి కాకుండా, బిహార్‌లో ప్రచారాని కి వెళ్ళడాన్ని ఆయన తప్పుబట్టారు. చివరకు ఇంత పెద్ద అంశంపై పార్లమెంటులో చర్చ జరుగుతున్నా ప్రధాని హాజరు కాకపోవడం చరిత్రలో ఇదే మొదటిసారి అని అన్నారు. జాతీయ భద్రత పట్ల మోడీ చిత్తశుద్ధిని ప్ర శ్నించా రు. జవాబుదారీతనం డిమాండ్ చేస్తూ, ఉగ్రదాడులను ఆపడంలో ప్ర భుత్వం తన వైఫల్యాలను అంగీకరించాలని అన్నారు. మోదీ ప్రభుత్వం అ హంకారం ఉన్నదని, పెహల్గామ్ ఉగ్రదాడి తరువాత ప్రత్యేక పార్లమెంటు సమావేశాలు ఏర్పాటు చేయాలని రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడిగా తా ను, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాం ధీ రాసిన లేఖలకు స్పందన లేదని విమర్శించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## పిటిషన్‌దారు అసభ్యకర ఆరోపణలు.. అతని న్యాయవాదికీ 'సుప్రీం' ధిక్కారణ నోటీసులు

**న్యూఢిల్లీ:** తెలంగాణ హైకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తిపై అసభ్యకరమైన ఆరోపణలు చేసినందుకు సుప్రీంకోర్టు మంగళవారం పిటిషనర్‌తోపాటు, అతని న్యాయవాదులకూ కోర్టుధిక్కార నోటీసులు జారీచేసింది. అదే సమయంలో పిటిషనర్ మరియు న్యాయవాదులకు అత్యున్నత న్యాయస్థానం షోకాజ్ నోటీసులు కూడా జారీచేసింది. పిటిషన్ ఉపసంహరణకు అనుమతించాలన్న అభ్యర్థనను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్‌తో కూడిన ధర్మాసనం తోసిపుచ్చింది. పిటిషనర్ ఎన్.పెద్దిరాజు దాఖలుచేసిన బదిలీ పిటిషన్‌ను న్యాయవాది ఆన్‌కోర్టు రితేష్‌పాటిల్ ద్వారా దాఖలు చేశారు. ఈ పిటిషన్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎస్‌సి, ఎస్‌టి (ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీస్) యాక్ట్ కింద ఒక అంశంలో హైకోర్టు నుంచి ఊరట పొందిన విషయానికి సంబంధించినది. ప్రధాన న్యాయమూర్తి బిఆర్.గవాయ్ ధర్మాసనం దీనిపై మాట్లాడుతూ 'ఇక్కడ మేం లాయర్లకు రక్షణ కల్పించేందుకు ప్రయత్నిస్తుంటాం. కానీ ఈ రకపు ప్రవర్తనను క్షమించి వదిలేసేది కాదు' అని తేల్చిచెప్పింది.

# ఢిల్లీ జర్నలిస్ట్‌లకు ప్రత్యేక కోటా

### తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి



**న్యూఢిల్లీ :** ఢిల్లీలో పనిచేసే జర్నలిస్ట్ లకు అక్రిడిటేషన్, ఆరోగ్య కార్డులు, ఇళ్ల స్థలాల విషయంలో ఢిల్లీ కోటాను అమలు చేస్తామని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. పనిచేసే వారికే అక్రిడిటేషన్ ఉండేలా కొత్త నిబంధనలు త్వరలో అమల్లోకి తెస్తామని చెప్పారు. ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్(ఐజెయు)కు అనుబంధంగా పనిచేస్తున్న ఢిల్లీ తెలుగు జర్నలిస్ట్స్ అసోసియేషన్ (డిటిజెఎ) సమావేశం మంగళవారం తెలంగాణ, ఆంధ్రా భవన్‌లోని గురజాడ కాన్ఫరెన్స్ హాలులో జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా ఐజెయు జాతీయ అధ్యక్షులు, తెలంగాణా మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్, ఐజెయు నాయకులు దేవులపల్లి అమర్, నరేందర్ రెడ్డి, సోమసుందర్, మాజిద్ హాజరయ్యారు. ఇళ్ల స్థలాలు సైతం ఢిల్లీలో తెలుగు మీడియా సంస్థల కోసం పనిచేసే జర్నలిస్టులకు తెలంగాణ, ఎపి అనే తేడా లేకుండా అమలు చేయడానికి తమవంతు కృషి చేస్తానని కె.శ్రీనివాస్‌రెడ్డి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. హెల్త్ కార్డులు అందరికి వచ్చేలా చూస్తామని అన్నారు. రెండు రాష్ట్రాల కోసం ఢిల్లీలో పనిచేసే జర్నలిస్టులకు తెలంగాణ, ఎపి రాష్ట్రాల ప్రభుత్వాల నుంచి సహకారం అందించాల్సిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ అన్నారు. జర్నలిస్టులు కేవలం అక్రిడిటేషన్, ఆరోగ్యం, ఇళ్ల స్థలాలు మాత్రమే ఎక్కువగా అడుగుతుంటారని గుర్తు చేశారు. వారికి కావాల్సిన కనీస వసతులను కల్పించేందు కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి తమవంతు సహకారం అందిస్తానని వెల్లడించారు. సిఎం చంద్రబాబు అందరికీ అక్రిడిటేషన్లను ఇవ్వాలని చెప్పారని, అలాగే అమరావతిలో ఇండ్ల స్థలాల విషయంలోనూ ఢిల్లీ జర్నలిస్ట్‌లకు అందేలా చూస్తానని స్పష్టం చేశా రు. జర్నలిస్టుల సంక్షేమం, ఎదురయ్యే ఇబ్బందుల పరిష్కారానికి తమ యూనియన్ చేస్తున్న కృషిని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియుడబ్ల్యుజె) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె. విరాహత్ అలీ, రామ నారాయణ, ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఎపియు డబ్ల్యుజె) అధ్యక్షులు ఐవి సుబ్బారావు వివరించారు.

**డిటిజెఎ అధ్యక్షులుగా టి.శ్రీనివాస్ రావు:** ఢిల్లీ తెలుగు జర్నలిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా టి.శ్రీనివాసరావు(టివి–5 బ్యూరో చీఫ్) ఎన్నికయ్యారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి.గోపిక్రిష్ణ (10టివి బ్యూరో చీఫ్), ప్రధాన కార్యదర్శిగా టి.సూర్యకిరణ్ (ఆంధ్ర జ్యోతి చీఫ్ రిపోర్టర్)లు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా పి. కళా శ్రీనివాస్ (ప్రైమ్ 9 బ్యూరో చీఫ్ ) ఎం.డి.మదార్ (వి6 బ్యూరో చీఫ్), కోశాధికారిగా ఎం.వి.శివరావు (బిగ్ న్యూస్ బ్యూరో చీఫ్), సంయుక్త కార్యదర్శులుగా ఎం.సత్య (ఆంధ్రప్రభ బ్యూరో చీఫ్), విద్యాసాగర్ (ఆంధ్రజ్యోతి కరస్పాండెంట్), ఎస్. నవీన్ కుమార్ (99 బ్యూరో చీఫ్)లు ఏకగ్రీవం

# టిమ్స్ ఆసుపత్రికి కమ్యూనిస్టు దిగ్గజం రావి నారాయణ రెడ్డి పేరు

### సిఎం రేవంత్‌రెడ్డికి తెలంగాణ అమరవీరుల సార్మక ట్రస్ట్ విజ్ఞప్తి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎల్‌బినగర్‌లో నిర్మిస్తున్న టిమ్స్ ఆసుపత్రికి తెలంగాణ రాజకీయ ఉద్యమ వైతాళికుడు, పద్మ భూషణ్, మాజీ ఎంపి, కమ్యూనిస్టు దిగ్గజం రావి నారాయణరెడ్డి ఆసుపత్రిగా నామకరణం చేయాలని తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్టు సభ్యులు, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ట్రస్ట్ కార్యదర్శి కందిమళ్ల ప్రతాపరెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం సిఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. నాటి నిజాంరాజ్యంలో అన్ని ఉద్యమాలలో అగ్రభాగాన నిలిచిన నిజాం రాజ్యంలో వెట్టిచాకిరి, దోపిడీ, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా 'అయ్య నీ బాంచ' నన్నోళ్ళతోనే బందూకులు పట్టించి చారిత్రాత్మక రైతాంగ సాయుధ పోరాటానికి నేతృత్వం వహించి నిజాం రాజును గడగడలాడించిన నిజాం నిరంకుశ పాలనను అంతమొందించిన ప్రజానాయకుడు రావి నారాయణ రెడ్డికి రాష్ట్ర ప్రభుత్వం తగిన గుర్తింపు నివ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వమైనా ఆ మహానేతకు గుర్తింపు లభించే విధంగా ఎల్‌బినగర్ టిమ్స్ ఆసుపత్రికి ఆయన పేరు పెట్టాలని కోరారు. అదేవిధంగా రావినారాయణరెడ్డి నిర్మాణం చేసిన తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్టు ఆయన కోరిక ప్రకారం బంజారాహిల్స్‌లో ప్రభుత్వం కేటాయించిన స్థలంలో ట్రస్టు భవనం, రావి నారాయణరెడ్డి



ఆడిటోరి యం నిర్మాణం జరిగిందని, ఈ సముదాయానికి నాటి కేంద్ర హోం శాఖ మంత్రి శివరాజ్ పాటిల్, ఆడిటోరియాన్ని నాటి ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖరెడ్డి ప్రారంభోత్సవం చేయగా, మాజీ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారన్నారు. అయితే రావి నారాయణరెడ్డి కోరుకున్న తెలంగాణ పోరాటానికి సంబంధించిన ఫోటో ఎగ్జిబిషన్, గ్రంథాలయం, ఇతర నిరంతర కార్యక్రమాలను ఆర్థిక ఇబ్బందులు, అనివార్య కారణాలవల్ల పూర్తిచేయలేకపోయామని, వాటిని పూర్తిచేసేందుకు ప్రభుత్వం తరఫున సహకారం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చాడ వెంకటరెడ్డిలు, కందిమళ్ల ప్రతాపరెడ్డి విజ్ఞప్తి చేశారు.

### మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడితే

# చట్ట ప్రకారం చర్యలు

### జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ వి.రామసుబ్రమణియన్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడినట్లు తేలితే ఎవరైనా సరే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని జాతీయ మానవహక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి) చైర్మన్ జస్టిస్ వి.రామసుబ్రమణియన్ అన్నారు. తెలంగాణలో జరుగుతున్న రెండు రోజుల జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి) శిబిర సమావేశంలో భాగంగా మంగళవారం జూబ్లీహిల్స్‌లోని మర్రి చెన్నా రెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ(ఎంసిహెచ్‌ఆర్‌డి) రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య అధికారులతో కమిషన్ ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించింది. రాష్ట్రంలోని ప్రధాన మానవ హక్కుల సమస్యలపై చర్చించి, వాటిని ఎదుర్కొనడంలో ప్రభుత్వ యంత్రాంగం చేపడుతున్న చర్యలు, సంక్షేమ చర్యల అమలును సమీక్షించింది. ఈ సమావేశానికి జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ వి.రామసుబ్రమణియన్ అధ్యక్షత వహించగా, సభ్యులు జస్టిస్ బిద్యుత్ రంజన్ సారంగి, విజయ భారతి సాయనీ, తెలంగాణ రాష్ట్ర మాన వ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ డాక్టర్ షమీమ్ అక్తర్ పాల్గొన్నారు. కేంద్ర కమిషన్ తరఫున కార్యదర్శి జనరల్ భరత్ లాల్, డైరెక్టర్ జనరల్ (ఇన్వెస్టిగేషన్) ఆర్.పి. మీనా, డిప్యూటి రిజిస్ట్రార్ (లా) ఇంద్రజీత్, డాక్టర్ ముఖేష్, ఎస్‌ఎస్‌పి (ఇన్వెస్టిగేషన్) ఇలక్కియా కరుణాగరణ్ హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ తరఫున ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, అధ్యక్షతన హోం, మహిళా, శిశు సంక్షేమం, విద్య, అటవీ, వ్యవసాయం, ఎస్‌సి అభివృద్ధి, పోలీస్ విభాగాల నుండి సీనియర్ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో మహిళలు, పిల్లలపై జరిగే నేరాలు, పోషకాహార లోపం, మనుషుల ప్రాణుల మధ్య చోటుచేసుకున్న ఘటనలు, ప్రాథమిక విద్యలో లోపాలు, ఎస్‌సి సంక్షేమం, రైతుల సమస్యలు, హక్కుల అంశాలపై చర్చ జరిగింది.

**రాజకీయ పార్టీలకు అతీతంగా ఎన్‌హెచ్‌ఆర్‌సి పనిచేస్తుంది : జస్టిస్ వి.రామసుబ్రమణియన్**

రాజకీయ పార్టీలకు అతీతంగా ఎన్‌హెచ్‌ఆర్‌సి పనిచేస్తుందని జస్టిస్ వి.రామసుబ్రమణియన్ అన్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాలన్నారు. రాష్ట్రానికి చెందిన 106 కేసులను పరిష్కరించామని తెలిపారు. ప్రధాన కార్యదర్శి, డిజిపి, జైళ్ల శాఖ డిజి, అన్ని శాఖల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించామన్నారు.

రైతుల సమస్యలు, మహిళలు, చిన్నారులపై దాడులు, దివ్యాంగుల సమస్యల గురించి అడిగి తెలుసుకున్నామని చెప్పారు. వసతిగృహాల్లో సౌకర్యాలలేమిపై అధికారులను ప్రశ్నించామన్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని, ఆయా సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలను నివేదిక రూపంలో ఇవ్వాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించినట్లు వివరించారు. మీడియా, సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తల్లో వాస్తవాలను బట్టి సుమోటోగా విచారణ చేపడుతున్నామని జస్టిస్ వి. రామసుబ్రమణియన్ తెలిపారు. పోలీస్, జ్యుడిషియల్ కస్టడిలో మృతి చెందిన ఘటనల్లో ప్రత్యేకంగా దర్యాప్తు చేయిస్తున్నామన్నారు. సహజ మరణమా? అధికారులు కారణమా? అనే విషయాలపై దర్యాప్తు చేయిస్తామన్నారు. పోలీసు, జైలు అధికారుల తప్పిదం ఉంటే చర్యలకు సిఫార్సు చేస్తున్నామన్నారు. ఎన్‌హెచ్‌ఆర్‌సిలో 34,865 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. వీటిలో తెలంగాణకు సంబంధించిన కేవలం 780 ఉన్నాయని జస్టిస్ వి.రామసుబ్రమణియన్ తెలిపారు. మనవద్ద మంచి చట్టాలు, పథకాలు ఉన్నాయని, వాటి ఫలితాలు ప్రజలకు నిజంగా అందాలంటే అమలు గట్టిగా ఉండాలని రామసుబ్రమణియన్ అన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు సమావేశంలో జరిగిన చర్చలను సమీక్షించి, కమిషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం హక్కుల ఆధారిత పరిపాలనను బలోపేతం చేయడానికి నిరంతరం కృషి చేస్తుందని హామీనిచ్చారు. వివిధ ప్రభుత్వ విభాగాల ఉన్నతాధికారులు తమ విభాగాల వారిగా వివరాలను కమిషన్‌కు తెలిపారు. లగచర్ల ఘటన, గురుకుల పాఠశాల విద్యార్థుల విషయంపై బిఆర్‌ఎస్ నేతలు ఎన్‌హెచ్‌ఆర్‌సికి ఫిర్యాదు చేశారు. తమ పార్టీకి చెందిన నేతలు కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఎమ్మెల్సీ శ్రవణ్, ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్, పట్నం నరేందర్ రెడ్డి తెలిపారు.




# కేంద్రంపై నెపం నెడుతున్న కాంగ్రెస్

### బిఆర్‌ఎస్ నాయకుల ఆరోపణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వం ఢిల్లీ లో 5,6,7 తేదీల్లో డ్రామాలు చేయబోతున్నదని, చివరికి కేంద్రంపై నెపం నెట్టబోతున్నదని బిఆర్‌ఎస్ నాయకులు ఆరోపించారు. ఆగస్టు 8న కరీంనగర్‌లో సభను నిర్వహిస్తామని,అలాగే బిఆర్‌ఎస్ తరఫున ఢిల్లీలో రాష్ట్రపతిని కలుస్తామని అన్నారు.

బిసి బిల్లులను అసెంబ్లీ, మండలిలో తీర్మానించి రాష్ట్రపతికి పంపించిన తర్వాత, మళ్లీ ఆర్డినెన్స్‌ను ఎలా తీసుకొస్తారని వారు ప్రశ్నించారు. బిసి రిజర్వేషన్లు ఆర్డినెన్స్, జిఒల తో రాబోదన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శాసన మండలిలో ప్రధానప్రతిపక్ష నేత మధు సూధనాచారి, శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ బండాప్రకాష్ ముదిరాజ్, మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, వి.శ్రీనివాస్ గౌడ్, గంగుల కమలాకర్ మాట్లాడుతూ కార్పొరేషన్ చైర్మన్ పదవులలో 50 శాతం బిసిలకు ఇవ్వాలని కాంగ్రెస్‌ను డిమాండ్ చేశారు. బిసిలకు రక్షణ కవచంగా బిఆర్‌ఎస్ నిలుస్తుందన్నారు. బిసిలను బిజెపి మోసం చేస్తోందని మండిపడ్డారు. బిసి రిజర్వేషన్ల విషయంలో జయలలిత తమిళనాడు రాష్ట్ర అఖిలపక్షాన్ని నాలుగుసార్లు ఢిల్లీకి తీసుకెళ్లారని వారు అన్నారు.

### 42 శాతం రిజర్వేషన్ల సాధనకోసం

# 4 నుంచి ధర్నాచౌక్‌లో నిరాహార దీక్ష

### ఎమ్మెల్సీ కవిత



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసిలకు స్థానిక సంస్థలలో రాజకీయ, విద్య, ఉద్యోగ అవకాశాలలో 42 శాతం రిజర్వేషన్ల సాధనకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపైన ఒత్తిడిని పెంచేందుకు ఆగస్టు 4 నుంచి 7వ తేదీ వరకు 72 గంటల పాటు హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌లో నిరాహార దీక్ష చేస్తానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సి కల్వకుంట్ల కవిత ప్రకటించారు. సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో యునైటెడ్ పూలే ఫ్రంట్, బిసి సంఘాల నాయకులతో కలిసి కవిత మంగళవారం మీడి యా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర హైకోర్టు సూచన మేరకు సెప్టెంబర్ నెలాఖరులోపు ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తుందని, గడువులోగా ఎన్నికలు నిర్వహించడం ఎంత ముఖ్యమో, బిసిలకు రిజర్వేషన్ల కోటా పెంచడం కూడా అంతే ముఖ్యమన్నారు. అసెంబ్లీ, కౌన్సిల్ ఆమోదించిన బిసి బిల్లులకు రాష్ట్రపతి ఆమోదం తెలుపకపోతే, రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించిన సవరణ బిల్లుకు గవర్నర్ ఆమోదముద్ర వేయకుం టే, దీనిపైన రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు న్యాయపోరాటం చేయలేదని ప్రశ్నించారు. స్థానిక సంస్థల రిజర్వేషన్ల విషయంలో తమిళనాడు ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాటు న్యాయపోరాటం చేసి, రిజర్వేషన్లు కల్పించిందని కవిత గుర్తు చేశారు. బిసి సిఎం, బిసి పిఎం అని చెబుతున్న బిజెపి తెలంగాణ రాష్ట్రంలో బిసి రిజర్వేషన్ల పెంపునకు ఎందుకు అడ్డుతగులుతోందని నిలదీశారు. ఢిల్లీలో ధర్నా అంటే అదేమైనా సత్రం భోజనమా?, మంత్రి పొన్నం బాధ్యతా రాహిత్యంగా మాట్లాడుతున్నారని కవిత మండిపడ్డారు. ప్రభు త్వపరంగా అధికారికంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తే, అన్ని రాజకీయ పార్టీలను యుపిఎఫ్ కన్వీనర్ బొల్ల శివశంకర్, నాయకులు ఆలకుంట హరి, తెలంగాణ జాగృతి, యుపిఎఫ్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీలు, గిరిజనులు అమాయకులు

### మంత్రి సీతక్క




**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ఆదివాసులు, గిరిజనులు అమాయకులని, ఆదివాసులు గిరిజనులు తమ అస్తిత్వాన్ని కోల్పోయే ప్రమాద ముందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. మంగళవారం తెలంగాణ ఆదివాసీ గిరిజన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల శిక్షణ కార్యక్రమం నిజామాబాద్ పట్టణంలోని హరిత హోటల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్, మాజీ ఎంపి మధుయాష్కీగౌడ్, బెల్లయ్యనాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క మాట్లాడుతూ ఆదివాసులు గిరిజనులు అమాయకులని, వారు తమ అస్తిత్వాన్ని కోల్పోయే ప్రమాదముందన్నారు. వారిపై కొన్ని దుష్టశక్తులు మనువాదాన్ని రుద్దే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోని రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం అని కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరాగాంధీ హయాం నుంచి ఆదివాసుల కోసం దళిత గిరిజనులకు సమాజంలో సమానత్వం కోసం నేటివరకు పనిచేస్తూనే ఉందన్నారు. ఆదివాసుల మేలుకోసం కులగణన సర్వే చేయించిందని తెలంగాణలో చేసిన సర్వేపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతుందన్నారు. కులగణన సర్వే 90శాతం పూర్తయిందన్నారు. గిరిజనులు న్యాయపరమైన హక్కుల కోసం సంఘటితం కావాల్సిన అవసరముందని, అటవీ హక్కుల చట్టాన్ని కాంగ్రెస్ పార్టీ తీసుకొచ్చిందని, గిరిజనులు మొదట విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గత పదేళ్లలో బిఆర్‌ఎస్ తెలంగాణను అప్పులకుప్పగా మార్చిందని గుర్తు చేశారు. రానున్న రోజుల్లో మిగతా హామీల అమలుకోసం కృషి చేస్తామన్నారు. ఈ శిక్షణ శిబిరంలో శిక్షణ పొందిన ఆదివాసీ గిరిజనులకు సరైన మార్గంలో నడిపించి రాహుల్ గాంధీని ప్రధానిని చేసేవరకు కష్టపడి పోరాటం చేయాలన్నారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ మాట్లాడుతూ గిరిజనులు అటవీ భూములు, ఇతర వనరులు హక్కుల పరిరక్ష ణ కోసం కాంగ్రెస్ ఎల్లప్పుడూ పోరాడుతూనే ఉంటుందన్నారు. జల్ జమీన్ జంగిల్( నీరు, అటవీ, భూవనరులు)పై గిరిజన హక్కుల కోసం కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు. సహజ వనరులపై గిరిజనుల హక్కులకోసం రాహుల్‌గాంధీ యాత్ర చేశారన్నారు. ప్రధానిగా రాహుల్‌గాంధీని చూడాలని మనందరి కల, ఈ కల కోసం కాంగ్రెస్ కార్యకర్తలు సైనికులుగా పని చేయాలన్నారు. ప్రజల ఆక్రందన, ఆవేదనను అర్థం చేసుకోవటమే రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర లక్ష్యమన్నారు. గిరిజనుల హక్కులను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. పెట్టుబడిదారుల లబ్ధికోసం మోడీ ప్రభుత్వం గిరిజనుల హక్కులను లాక్కోవటానికి కుట్ర పన్నుతోందన్నారు. కార్యక్రమంలో వివిధ మండలాల గిరిజన నాయకులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన పథకం కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి

### సెప్టెంబర్ 1 నుంచి నిరధిక సమ్మె : ఎఐటియుసి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మధ్యాహ్న బోజన పథకం కార్మికుల అన్ని డిమాండ్లను తక్షణమే నేరవేర్చాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకపోతే ఆగస్టు 6,7 తేదీల్లో జిల్లా కేంద్రాల్లో నిరాహారదీక్షలు చేపడుతామని అప్పటికీ పరిష్కరించకపోతే సెప్టెంబర్ 1నుంచి నిరవధిక సమ్మెను చేపడుతామని రాష్ట్ర అధ్యక్షులు పి.ప్రేంపావని, ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్, ఉప ప్రధాన కార్యదర్శి సత్తెనపల్లి విజయలక్ష్మి, ఉపాధ్యక్షులు చక్రపాణి, ఎన్.రామక్రిష్ణ, ఎం.లక్ష్మ ణ్, బి.ప్రసాద్‌లు హెచ్చరించారు.

రాష్ట్రంలో ఉన్న పెండింగ్ బిల్లులు, అల్పాహారం బిల్లులు, వేతనాలు అన్ని కూడా జులై వరకు మంజూరు చేయాలని, ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రూ.10 వేల వేతనం చెల్లించాలన్నారు. అదేవిధంగా ప్రతి విద్యార్థికి తరగతితో సంబంధం లేకుండా మెను చార్జీలు రూ.25లు చెల్లించాలి లేకపోతే నిత్యావసర వస్తువులు, గ్యాస్, కోడిగుడ్లు ప్రభుత్వమే సరఫరా చేయడంతోపాటు కార్మికులకు పనిభద్రత కల్పించాలి. ప్రభుత్వమే గుర్తింపు కార్డులు, ప్రొసీడింగ్ ఆర్డర్స్, డ్రెస్‌కోడ్ ఇవ్వాలన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ఇయస్‌ఐ, పిఎఫ్, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, గ్రీన్ ఛానల్ లేదా పిఎఫ్‌ఎంఎస్ ద్వారా బడ్జెట్‌ను రిలీజ్ చేసి కార్మికుల ఖాతాల్లో జమచేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే సెప్టెంబర్ 1 నుంచి సమ్మె తప్పదని హెచ్చరించారు.

## ఘనంగా సింగరేణి సిఎండి బలరాం నాయక్ జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/ ఖైరతాబాద్(హైదరాబాద్) :** సింగరేణి సంస్థను బలోపేతం చేస్తూ, పలువురు నిరుపేదలకు అండగా ఉంటూ ఒక డైనమిక్ ఆఫీసర్‌గా గొప్పస్థాయిలో ఉన్న సింగరేణి సిఎండి, చైర్మన్ బలరాం నాయక్ జీవితం అందరికీ ఆదర్శనీయమని గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వెంకటేశ్ చౌహాన్ పేర్కొన్నారు. మంగళవారం గిరిజన శక్తి ఆధ్వర్యాన హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని నిజాం కాలేజీలో బలరాం నాయక్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎస్‌టి హాస్టల్ విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం వెంకటేశ్ చౌహాన్ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, సేవాలాల్ మహారాజ్ స్ఫూర్తితో కష్టపడి ఓ మారుమూల తండాలోని పేద కుటుంబం నుంచి వచ్చి ఆదర్శవంతమైన సమాజంకోసం కృషిచేస్తున్న బలరాం నాయక్ పుట్టినరోజు పండుగ దినమన్నారు.యువ తెలంగాణ పత్రిక చైర్మన్ డా. మెండెం కిరణ్‌కుమార్ బలరాం నాయక్ ఒక ఐకాన్ అని కొనియాడారు.

# 72 గంటల దీక్ష గల్లీలో కాదు..ఢిల్లీలో చేయాలి

### టిపిసిసి ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్

**ప్రజాపక్షం / హైదరాబాద్:** బిసి రిజర్వేషన్లపై బిఆర్‌ఎస్ ఎంఎల్‌సి కవిత 72 గంటల దీక్షను గల్లీలో కాకుండా ఢిల్లీలో చేయాలని టిపిసిసి ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్ అన్నారు. బిసి రిజర్వేషన్లపై గత బిఆర్‌ఎస్ పాలకులు కనీస ప్రయత్నం చేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే బిసి రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీ ఆమోదించిందని చెప్పారు. గాంధీభవన్‌లో మంగళవారం జరిగిన మీడియా ఆయన మాట్లాడుతూ కవిత బిసి పట్ల నిజమైన ప్రేమ గౌరవం ఉంటే ఢిల్లీలో మోదీపై, బిజెపిపై పోరాటం చేయాలని హితవు పలికారు. బిసి రిజర్వేషన్లను చట్ట బద్దంగా, రాజ్యాంగ బద్ధంగా అమలు చేయాలని ప్రభుత్వం డెడికేషన్ కమిషన్ వేసిందన్నారు. బిసి రిజర్వేషన్లపై బిఆర్‌ఎస్ పార్టీ, బిజెపి సరైన అవగాహన లేకుండా వ్యవరిస్తున్నారని విమర్శించారు. కవిత దీక్ష చేస్తామనడం అర్థంలేని పోరాటమని, పదేళ్ల అధికారంలో ఉండి కవిత బిసి రిజర్వేషన్లపై ఏ ఒక్క రోజు నోరు మెదపని కవిత తన రాజకీయ అవసరాలకు బిసి వాదం ఎత్తుకున్నారని ఆయన విమర్శించారు. బిసి బిల్లుపై, కులగణనపై బిఆర్‌ఎస్ పార్టీ వైఖరి ప్రకటించకపోవడం సిగ్గుచేటన్నారు. బిసి రిజర్వేషన్ల పట్ల కాంగ్రెస్ పార్టీ నిజాయితి, నిబద్ధతతో ఉందని, తమిళనాడు తరహాలో తెలంగాణలో బిసి రిజర్వేషన్లను అమలు చేసుకునే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని, ఇందుకు రాష్ట్రంలో సామాజిక విప్లవం తెచ్చిన కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ సామాజిక శక్తులు అండగా నిలవాలని ఆయన కోరారు.

IN THE COURT OF THE V SENIOR CIVIL JUDGE :: CITY CIVIL COURT :: AT HYDERABAD

O.S.No. 607 of 2025

Between:

Dhadvai Yadamma & others ... Plaintiffs

AND

Mandal Revenue officer & All Concerned ...Defendants

To,

All Concerned ...Defendants

NOTICE

That the above named Plaintiffs herein filed the above Suit against you for Legal Heir certificate and the case is posted to **07-08-2025.** Therefore you are hereby called upon to appear before the Hon'ble court above mentioned on **07-08-2025 at 10.30 AM** either in person or through counsel, otherwise the above matter will be heard and decided as per law.

(By order of the Hon'ble Court)

S.RAGHUVEER, Advocate, H.No.1-9-202/E/1/C/2/1, Ramnagar, HYDERABAD.

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ :: ఎల్‌బినగర్ సర్కిల్-4

NIT No. 16/EEC-4/BNR/GHMC/2025-26, టెండర్ ప్రకటన తేది: 28.07.2025

**పని పేరు:** అభివృద్ధి పని -1 నెం.లు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** 30.07.2025న సా.05.00గం.ల నుండి 06.08.2025న సా.04.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** శ్రీ వి.కార్తీక్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎల్‌బినగర్ సర్కిల్-4, జిహెచ్‌ఎంసి. సెల్: 9701365519. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా https://tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎల్‌బినగర్ సర్కిల్-4, జిహెచ్‌ఎంసి .

DIPR R.O. No. : 5719-PP/CL/ADVT/1/2025-26, Date: 29-07-2025

దేవాదాయ ధర్మాదాయ శాఖ

శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానము

శ్రీనగర్ కాలనీ, హైదరాబాద్ - 500073 . ఫోన్ నెం: 9494252843, 040-23748247

టెండర్ నోటీస్ నెం.2/TEN/SVST/SNC/2025 ఇ-ప్రొక్యూర్‌మెంట్, సీల్డ్ టెండర్ మరియు బహిరంగ వేలం ప్రకటన తేది: 29.07.2025

ఒక సంవత్సరం కాలపరిమితికి ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా అనగా తేది: 10.09.2025 నుండి 09.09.2026 వరకు దేవాలయములో ఈ దిగువ తెలియపరచినవాటి నిమిత్తం లైసెన్స్ హక్కుల కొరకై టెండర్ దారుల నుండిఇ-ప్రొక్యూర్‌మెంట్, సీల్డ్ టెండర్ మరియు బహిరంగ వేలము ద్వార టెండర్లు కోరనైనది.

| క్ర.సం. | ఇ-ప్రొక్యూర్‌మెంట్ / సీల్డ్ టెండర్/బహిరంగ వేలము వివరములు | ధరావత్తు(E.M.D.) | టెండర్ షెడ్యూల్ ధర |
|---|---|---|---|
| 1 | కళ్యాణమండపం పూల అలంకరణ చేసుకొనే హక్కు | రూ.50,000/- | రూ.2000/- |
| 2 | కొబ్బరి కాయలు మరియు పూజ సామాగ్రి అమ్ముకునే హక్కు | రూ.50,000/- | రూ.1000/- |
| 3 | కళ్యాణమండపము నందు హౌస్ కీపింగ్ చేసుకొనే హక్కు | రూ.10,000/- | రూ.1000/- |
| 4 | దేవస్థానమునకు విద్యుత్ అలంకరణ చేయు హక్కు | రూ.10,000/- | రూ.1000/- |
| 5 | దేవస్థానమునకు పర్వదినముల యందు పూల అలంకరణ | రూ. 10,000/- | రూ.2000/- |
| 6 | దేవస్థానము రోజు వారి పూల దండలు సప్లయి చేయు హక్కు | రూ. 10,000/- | రూ.1000/- |
| 7 | సెక్యూరిటీ సర్వీసెస్ లైసెన్సు హక్కు | రూ. 10,000/- | రూ.1000/- |
| 8 | క్యూ లైన్ మరియు తడికెల పందిర్లు ఏర్పాటు చేయు హక్కు | రూ. 10,000/- | రూ.1000/- |
| 9 | దేవస్థానమునకు పాలు, పెరుగు సరఫరా చేయు హక్కు | రూ.2,000/- | రూ.500/- |
| 10 | దేవస్థానమునకు కూరగాయలు సరఫరా చేయు హక్కు | రూ.2,000/- | రూ.500/- |
| 11 | దేవస్థానమున గోశాలకు పశువుల దాన సరఫరా చేయు హక్కు | రూ.2,000/- | రూ.500/- |
| 12 | దేవస్థాన కళ్యాణమండపమునకు విద్యుత్ అలంకరణ చేయు హక్కు | రూ.10,000/- | రూ.1,000/- |

గమనిక:
1. ఆసక్తి గల వారు ఇ-ప్రొక్యూర్‌మెంట్ పూర్తి వివరముల కొరకు www.tender.telangana.gov.in వెబ్ సైట్ నందు చూడగలరు.
2. తేదీ: 30.07.2025 నుండి 07.08.2025 సా 4:00 గంటల వరకు టెండర్ షెడ్యూల్ జారీ చేయబడును.
3. తేదీ: 08.08.2025 రోజు ఉ.11.00 గం.ల వరకు కొటేషన్స్ (సీల్డ్ టెండర్స్) స్వీకరించబడును.
4. తేదీ: 08.08.2025 రోజున టెక్నికల్ బిడ్ ఉ.11.30 ని.లకు ప్రైస్ బిడ్ 12.30 ని.లకు తెరువబడును.
6. ప్రైస్ బిడ్ విప్పిన తరువాత టెండరు దారుల సమక్షములో క్ర.సం.1 నుండి 12 వరకు సీల్డ్ కొటేషన్స్ తెరువబడును, తదుపరి బహిరంగ వేలము నిర్వహించబడును.
7. ఇ-ప్రొక్యూర్‌మెంట్ లేదా సీల్డ్ టెండర్‌లో పాల్గొన్న వారిని మాత్రమే బహిరంగ వేలములో పాల్గొనుటకు అనుమతించబడును.

**నోట్:** ఏ కారణములు తెలుపకనే టెండర్లు రద్దు చేయుటకు గాని వాయిదా వేయుటకు గాని కార్యనిర్వహణాధికారి గారికి పూర్తి అధికారము కలదు. ఇతర వివరముల కొరకై దేవస్థాన కార్యాలయము నందు కాని ఫోన్ : 9494252843, 040-23748247 ద్వారా కాని సంప్రదించగలరు.

సి. అర్జున్ యాదవ్, చైర్మన్ మరియు ధర్మకర్తల మండలి | శ్రీ స్వామివారి సేవలో | యం. శ్రీనివాస శర్మ కార్యనిర్వహణాధికారి

DIPR R.O. No. : 5730-PP/CL/ADVT/1/2025-26, Date: 29-07-2025

## బోనమెత్తిన గ్రీన్ గ్రోవ్ బాలలు



**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటీ కేంద్రంలోని గ్రీన్ గ్రోవ్ పాఠశాలలో మంగళవారం బోనాల ఉత్సవాన్ని నిర్వహించారు. పాఠశాలలకు చెందిన అమ్మాయిలు తెలంగాణ సంప్ర దాయం ఉట్టిపడేలా బోనాల పండుగలో పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే బోనాల పండు గను కనుల విందుగా ప్రదర్శించారు. పోతరాజు, దుర్గామాత, ఎల్లమ్మ దేవతల రూపాలను విద్యార్థులు ప్రదర్శించారు. బోనాల పండుగ విశిష్టతను పాఠశాల డైరెక్టర్ జూలకంటి వేణుగోపాల్‌రెడ్డి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఓ పోలా గోవర్ధన్, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వెట్టి నుండి కార్మికులకు విముక్తి

**ప్రజాపక్షం/దేవరకొండ:** మంగళవారం నేరడుగొమ్ము మండలంలోని వైజాగ్ కాలనీ, పిపిపల్లి మండలంలోని పెద్దగుమ్మడం గ్రామాలలో 29 మంది బానిస కార్మికులను గుర్తించి వారికి బానిస కార్మికుల చట్టం 1976 ప్రకారం దేవరకొండ రాజస్వ మండలాధికారి రమణారెడ్డి మొత్తం 29 మంది బానిస కార్మికులను వారి స్వగ్రామాలకు సురక్షితంగా తిరిగి పంపారు. కార్మికుల రక్షణలో భాగంగా రెవెన్యూ సిబ్బంది, పోలీస్ సిబ్బంది దిని ఎస్కార్ట్‌గా కేటాయించారు. వారి సురక్షిత ప్రయాణాన్ని నిర్ధారించారు. ప్రభుత్వం రూపొందించిన నిబంధనలకు అనుగుణంగా, కార్మికుల హక్కులను పరిరక్షిస్తూ ఈ చర్యలు తీసుకోవడం జరిగిందని ఆర్డీవో అన్నారు. బాండెడ్ లేబర్ వ్యవస్థను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరు చొరవ చూపాలని పిలుపునిచ్చారు.



## సూర్యాపేట డిపో నుండి పుణ్యక్షేత్రాలకు బస్సు సౌకర్యం

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ సూర్యాపేట డిపో నుండి పుణ్యక్షేత్రాలకు బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు డిపో మేనేజర్ జి.లక్ష్మి నారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సూర్యాపేట నుండి విశాఖపట్నం యాత్రలో సూపర్ లగ్జర్ 36 సీట్ల బస్సు సౌకర్యం కలదు. ఆగస్టు 1వ తేదీన రాత్రి 11 గంటలకు సూర్యాపేట నుండి విజయవాడ కనకదుర్గమ్మ గుడి, మంగళగిరి పానకాల లక్ష్మి నర్సింహా స్వామి దేవాలయం, ద్వారకాతిరుమల వెంకటేశ్వర స్వామి దేవాలయం, సామర్లకోట కుమారస్వామి, పిఠాపురం12వ శక్తిపీఠం, సింహచల అప్పన్న పేట స్వామి టెంపుల్, అవసవల్లి సూర్యదేవాలయం, శ్రీకూర్మం మహా విష్ణు... కుర్మావతారం, వైజాగ్ సిటి, అన్నవరం సత్యనారాయణస్వామి వ్రతం చేసుకునే అవకాశం కలదు. స్వామి దర్శనం చేసుకుని 4వ తేదీ రాత్రి 8 గంటలకు సూర్యాపేటకు వచ్చే విధంగా ప్రత్యేక యాత్రను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ యాత్రకు పెద్దలకు 3400, పిల్లలకు 1800 లుగా నిర్ణయించడం జరిగిందని తెలిపారు. టికెట్ బుకింగ్ ఇన్‌ఛార్జి డి.రవికుమార్ 99483 03712, ఏకాంబరం 99516 13278, 73828 36177, అసిస్టెంట్ మేనేజర్ 7989225791 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

## కూనంనేనికి ఉద్యమకారుల ఫోరం వినతి



**ప్రజాపక్షం/వలిగొండ :** సిపిఐ రాష్ట్ర కార్యదర్శి శాసనసభ పక్ష నేత ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావుకు ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఉద్యమకారులకు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని అమలు చేయించి ఉద్యమకారుల ఆకాంక్షను నెరవేర్చ దిశగా ప్రయత్నం చేయాలని ఆయను ఈ సందర్భంగా కోరారు. అనంతరం ఉద్యమకారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలని గత అసెంబ్లీలో ప్రస్తావించినందుకు ఆయనకు శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగు అంజన్న, ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షులు శీలం స్వామి, ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు మారగోని శ్రీనివాస్ గౌడ్, ఉద్యమ కళాకారుల జిల్లా అధ్యక్షుడు మల్లం వెంకటేశం గౌడ్, బత్తినీ రవీందర్ గౌడ్, ఐటి పాముల పుష్ప, ఎక్కల దేవి శ్రీనివాస్, కదిరేని స్వామి, కన్నెకంటి శ్రీనివాసచారి, కొండూరు శ్రీరాములు, దండ మల్లికార్జున్, బొడిగె సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటిముందు శుభ్రతే లక్ష్యం




**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** ప్రతి పౌరుడు తన ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచడంలో ముందుండాలని మున్సిపల్ కమిషనర్ హన్మంతరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక 1వ వార్డులో 100 రోజుల ప్రణాళికలో భాగంగా ప్రజలకు నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ప్రభుత్వం పట్టణాలను మెరుగ్గా తీర్చిదిద్దేందుకు ముందుకొస్తే ప్రజలు కూడా సమానంగా స్పందించి సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. కాలనీలో తడి, పోడి చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందించాని కోరారు. మురుగుకాలువల నియమిత నిర్వహణ, దోమల నివారణ చర్యలపై ప్రత్యేకంగా వివరించారు. ప్రజలతో సిబ్బంది నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ వేముల కొండ పద్మ, మున్సిపల్ డిఈ సత్యారావు,సానిటరి ఇన్స్పెక్టర్ సారుగండ్ల శ్రీనివాస్, ఎఇ తిరుమల్లయ్య, ఆర్ఐలు గౌసుద్దీన్, అజీముద్దీన్, వార్డు అధికారి నరేష్, టిఎంసి శ్వేత, శివప్రసాద్, హెల్త్ వర్కర్లు, కాలని మహిళలు పాల్గొన్నారు.

## పారదర్శకంగా పదోన్నతులు చేపట్టాలి

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** ఉపాధ్యాయుల పదోన్నతులను పారదర్శకంగా చేపట్టాలని తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి ధారావత్ మోతిలాల్ నాయక్ అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో పలు ప్రభుత్వ పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ గిరిజన ఉపాధ్యాయసంఘం ఉపాధ్యాయుల శ్రేయస్సు కోసం పనిచేస్తుందని తెలిపారు. త్వరలో జరగబోయే ఉపాధ్యాయ పదోన్నతులను ఎలాంటి పొరపాట్లు జరగకుండా పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు దారావత్ వస్త్రంనాయక్, కుర్ర బగ్గులాల్‌నాయక్, లింగనాయక్, రమేష్, భద్రు నాయక్ పాల్గొన్నారు.

## ఇంటర్ స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తు

**ప్రజాపక్షం/పెద్దఅడిశర్లపల్లి:** పీఏ పల్లి మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల ఇంటర్ కళాశాల నందు స్పాట్ అడ్మిషన్లకు ఆసక్తి గల బాలికలు దరఖాస్తు చేసుకోవాలని ప్రత్యేక అధికారిని టి.ఉమాదేవి తెలిపారు.2025/2026 విద్యా సంవత్సరంలో ఇంటర్ కళాశాలగా అప్ గ్రేడ్ కావడం జరిగిందని తెలిపారు.ఈ సంవత్సరం సీఈసీలో 40 సీట్లు ఎంపీహెచ్డబ్ల్యు కోర్స్ కు 40 సీట్లు చొప్పున మంజూరైనట్లు తెలిపారు.సీసీ కి 40 సీట్లకు గాను 30 సీట్లు ఖాళీగా ఉన్నాయని అదేవిధంగా ఎం పి హెచ్ డబ్ల్యు కోర్సులో 40 సీట్లకు గాను 20 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు.పదవ తరగతి ఉత్తీర్ణులైన గ్రామీణ ప్రాంత బాలికలు స్పాట్ అడ్మిషన్లను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆమె కోరారు. పూర్తి వివరాలకు కేజీబీ ఇంటర్ కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

## నేడు నూతన్‌కల్‌లో ఎమ్మెల్యే పర్యటన

**ప్రజాపక్షం/నూతన్‌కల్:** మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో నేడు తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు పర్యటించనున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగం సుధాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ మధ్యాహ్నం 12 గంటలకు మండల కేంద్రంలోని సాయిరాం ఫంక్షన్‌హాల్‌లో నూతన రేషన్‌కార్డుల పంపిణీ, లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ఉత్తర్వులు పంపిణీ, మండల పరిధిలోని ఎర్రపహడ్‌లో 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించు ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణానికి శంకుస్థాపన, దిర్శనపల్లి గ్రామంలో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధులతో నిర్మించు నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసే కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు.

# సన్నబియ్యం పంపిణీ చరిత్రలో నిలుస్తుంది

### హుజూర్‌నగర్‌లో నూతన రేషన్ కార్డుల పంపిణీ హుజూర్‌నగర్ గడ్డ కాంగ్రెస్ అడ్డా భారీ నీటిపారుదల,ఆహార,పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి




**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** నిరుపేదల సంక్షేమమే తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం ధ్యేయమని రాష్ట్ర భారీనీటిపారుదల,ఆహార,పౌరసరఫరాల శాఖా మాత్యులు నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్‌లోని కౌండిన్య గార్డెన్స్ ఫంక్షన్‌హాల్‌లో నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా ఇన్‌చార్జీ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యావత్ తెలంగాణ చరిత్రలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం గేమ్‌చేంజర్‌గా నిలిచిపోతుందని, గతంలో ఎన్నడూ లేని విధంగా రూ. 10,600కోట్లు కర్చు పెట్టి 89.95 లక్షల కార్డుదారులకు రూ.2.80 కోట్లతో దొడ్డు భియ్యం పంపిణీ చేస్తే ప్రజా ధనం దుర్వినియోగం అవుతుందని పేదవారి కడుపు నింపే విధంగా ప్రజా ప్రభు త్వం రూ. 13 వేల కోట్లతో 97.90 లక్షల కార్డులదారులకు సన్న భియం అందజేయడం జరుగుతుందని తెలియజేశారు. 18 సంవత్సరాల తర్వాత జూలై మాసంలో నాగార్జున సాగర్ ఎడమకాల్వ నుండి నీటిని విడుదల చేయడం చాలా సంతోషానిచ్చిందన్నారు. నెహ్రు శంకుస్థాపన చేసిన నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌ను ఇందిరమ్మ ప్రారంభించిన ప్రాజెక్ట్ నేటికి చెక్కు చెదరకపోవడం కాంగ్రెస్ సుపరిపాలనకు నిదర్శనమని కొనియాడారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని దొండపాడులో రూ. 396 కోట్లతో 10 వేల ఎకరాలకు సాగునీరు అందించే విధంగా రాజీవ్‌గాంధీ లిఫ్ట్ ఇరిగేషన్,దొండపాడు 2కి క్యాబినెట్ ఆమోదం తెలిపినట్లు మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు. హుజూర్‌నగర్ గడ్డ ఎల్లప్పుడూ కాంగ్రెస్ గడ్డగానే నిలుస్తుందని గత పార్లమెంట్ ఎన్నికల్లో యావత్ భారతదేశంలోనే హుజూర్‌నగర్ నగర్ అసెంబ్లీలో వచ్చిన మెజార్టీ రాలేదన్నారు. కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే బలమని,వారి కృషితోనే తెలంగాణలో కాంగ్రెస్ అత్యధిక మెజార్టీతో అధికారంలోకి రావడం జరిగిందన్నారు. కార్యకర్తలకు కాంగ్రెస్ ఎల్లవేళలా వెన్నుదన్నుగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఇన్‌చార్జీ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం 10 ఏళ్ళు పరిపాలించి ఏఒక్కరికీ రేషన్‌కార్డులు,ఇళ్ళు ఇవ్వలేదని ప్రజా ప్రభుత్వం ఆవిర్భవించిన తర్వాతనే అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఉచిత బస్ సౌకర్యం లాంటి సంక్షేమ పథకాలు అందజేస్తున్న ప్రభుత్వానికి ప్రజాల ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్ఎల్‌సి శంకర్ నాయక్,సివిల్‌సప్లయ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ డి.ఎస్ చౌహాన్,ఎస్పీ కె. నరసింహా,కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, అదనపు కలెక్టర్ రాంబాబు, ఆర్డీఓ శ్రీనివాసులు,డీఎస్ఓ మోహన్‌బాబు, తహశీల్దార్లు మందడి నాగార్జున్‌రెడ్డి,సురిగి సైదులు, మంగ,కవిత, సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### 84శాతం మందికి సన్నబియ్యం : మంత్రి ఉత్తమ్

**ప్రజాపక్షం/చిట్యాల:** రాష్ట్రంలోని 84 శాతం మందికి రేషన్‌కార్డుల ద్వారా సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తున్నామని, ఇది దేశంలోనే చారిత్రాత్మక, విప్లవాత్మకమైన చర్య అని రాష్ట్ర పౌరసరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండల కేంద్రంలో నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ సన్నబియ్యంపై 10వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నామని, దేశంలో ఏ రాష్ట్రంలో కూడా సన్నబియ్యం పంపిణీ జరగడం లేదన్నారు. నకిరేకల్ నియోజకవర్గంలోని అయిటిపాముల లిఫ్ట్ ఇరిగేషన్‌తో పాటు నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు సహకారాన్ని అందిస్తానని ఉత్తమ్ హామీ ఇచ్చారు. ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో 62వేల700మందికి కొత్త కార్డులు ఇవ్వడం జరిగిందన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ రేషన్ కార్డుల పంపిణి నిరంతర ప్రక్రియ అని, రేషన్ కార్డులు రానివారు మీ సేవ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అయిటిపాముల ఎత్తిపోతల పథకం కింద పెండింగ్‌లో ఉన్న భూసేకరణ బిల్లులను మంజూరు చేయాలని, అలాగే బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు కింద ఉన్న భూసేకరణ నిధులను విడుదల చేయించాలని మంత్రులకు కోరారు. ఈ సమావేశంలో ఎంఎల్‌సి శంకర్‌నాయక్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి డిఎస్ చౌహాన్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, ఆర్‌డివో వై అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# గంజాయి కేసులో ముగ్గురు అరెస్ట్




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** గంజాయి కేసులో పట్టుపడ్డ ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి సుమారు 30 వేల విలువ గల 1.21 కేజీల గంజాయి రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకోవడం జరిగిందని వన్టౌన్ సిఐ రాజశేఖర్ రెడ్డి వెల్లడించారు. మంగళవారం వన్ టౌన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిందితులు తల్లమల్ల శివ శంకర్, భక్తుల శబరి గిరీష్ లు రాజస్థాన్లోని వివేకనంద గ్లోబల్ యూనివర్సిటీ లో అగ్రికల్చర్ బీఎస్సీ పూర్తి చేశారు అదే సమయంలో ఇద్దరు గంజాయికి అలవాటుపడి. నిందితుడు తల్లమల్ల శివ శంకర్ యాస భాను ప్రకాశ్ రెడ్డి లు ఇంటర్మీడియట్ నుండి స్నేహితులు.నిందితుడు శివశంకర్ తనకి గంజాయి అవసరం ఉన్నప్పుడల్లా అతని స్నేహితులైన శబరి గిరీష్ భాను ప్రకాష్ నుండి తీసుకొని వాడుకునేవాడని తెలిపారు. హైదరాబాద్ లోని ఫహత్ నగర్ నుండి గంజాయి తెచ్చుకునేవాడని గత సంవత్సరం 2024 లో మార్కెట్ పోలీస్టేషన్ వారు చేసిన పట్టుబడి చేసే గంజాయి కేసులో జైలుకు పంపారని అయినా కూడా అతని ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదని నల్లగొండ పట్టణంలో గంజాయి అలవాటు ఉన్నవారు చాలామంది ఉన్నారు అని వారికి గంజాయిని అమ్మి ఎక్కువ మొత్తంలో సొమ్ము చేసుకోవచ్చని దురుద్దేశంతో, వారం రోజుల క్రితం ముగ్గురు నిందితులు కలిసి పాత్‌నగర్ లోని ఒక మహిళ వయసు సుమారు 50 నుండి 20 సంవత్సరాలు నుండి 1.5 కేజీల గంజాయిని కొనుగోలు చేసి నల్లగొండకు తీసుకొని వచ్చారని తెలిపారు. అందులో కొంత భాగాన్ని చిన్న చిన్న పాకెట్లుగా చేసి అవసరం ఉన్న కొంతమంది వ్యక్తులకు పాకెట్ ఎనిమిది వందల రూపాయలు చొప్పున అమ్మి మిగిలి ఉన్న గంజాయిని ముగ్గురు వ్యక్తులు సమంగా పంచుకొని నల్లగొండ పట్టణంలో అమ్మడానికి వెళ్దామని చూస్తుండగా పోలీసు వారు నమ్మదగిన సమాచారం మేరకు వారిని పట్టుబడి చేసినారు. వారి వద్దనుండి 1.21 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులు శివ శంకర్,శబరి గిరీష్ ల నుండి వారు ఉపయోగించిన రెండు స్మార్ట్ ఫోన్లను స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డు

### అదనపు కలెక్టర్ పి.రాంబాబు



**ప్రజాపక్షం/కోదాడ:** అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్‌కార్డులు పంపిణీ జరుగుతుందని అదనపు కలెక్టర్ పి.రాంబాబు అన్నారు. మంగళవారం కోదాడ పట్టణంలోని ఆర్‌ఎస్‌వి ఫంక్షన్ హాల్‌లో నూతన రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం పేదలను వారి కుటుంబాలను ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో సన్నబియ్యం, నూతన రేషన్‌కార్డులను అందజేస్తున్నామని తెలిపారు. అందరూ జాగ్రత్తగా రేషన్‌కార్డును భద్రపర్చుకోవాలని, ప్రతి సంక్షేమ పథకాలను ఇది ఉపయోగంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోదాడ ఆర్డీవో సూర్యానారయణ, జిల్లా గ్రంధాలయ చైర్మన్ వంగవీటి రామారావు, తహసిల్దార్ వాజిద్‌అలీ, మండల పార్టీ అధ్యక్షులు తూమాటి వరప్రసాద్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇర్ల సీతారాంరెడ్డి, మల్లెల రాణి, పిఎసిఎస్ చైర్మన్లు కొత్త రఘుపతి, శ్రీనివాసరావు, మందలపు శేషు, పాలకి సురేష్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** హాస్టల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హాస్టల్ విద్యార్థులు మంగళవారం నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని డీవీకే రోడ్ లో గ ల శాంతినగర్ ఎస్‌సి హాస్టల్లో సరైన సదుపాయాలు లేక 80 మంది విద్యార్థులకు ఒకే బాత్రూం ఉందని అన్నం కూడా సరిగా పెట్టలేని దుస్థితి ఏర్పడిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. 20 రూపాయల పెరుగు 80 మంది విద్యార్థులకు ఎలా సరిపోతుందని ఒకసంవత్సరం నుంచి ఇదే తంతు అని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్ ని వేరే బిల్డింగ్‌కి మారుస్తాం అంటున్నారే తప్ప ఏ ఒక్క అధికారి వచ్చి మా సమస్యలు పరిష్కరించడం లేదని ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి వెంటనే మా సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

## దళితులపై అక్రమ కేసులను నిరసిస్తూ తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా



**ప్రజాపక్షం/మునగాల:** మండల పరిధిలోని గణపవరం గ్రామంలో చెరువుశిఖం భూమి విషయమై గత సంవత్సర కాలంగా గ్రామానికి చెందిన దళిత కుటుంబాలపై అక్రమంగా కేసులు నమోదు చేస్తూ తమని ఇబ్బందులకు గురిచేస్తున్న మునగాల ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌పై చట్టరీత్యా తక్షణమే చర్యలు తీసుకుని ఆయనను విధుల నుండి తొలగించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయం ముందు పలువురు గణపవరం గ్రామానికి చెందిన దళితులు ధర్నా నిర్వహించారు. అనంతరం తహసిల్దార్ రామకృష్ణారెడ్డికి గణపవరం గ్రామంలోని చెరువు భూమిలో భూమి యాజమాన్య హక్కు కల్పించి నిరుపేదలైన దళితులకు సేద్యం చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు దళితులు మాట్లాడుతూ భూమిలేని నిరుపేద దళిత కుటుంబాలకు చెందిన తాము గణపవరం చెరువు శిఖం భూమిలో ఎన్నో ఏళ్లుగా సేద్యం చేసుకుని బ్రతుకుతుండగా అదే గ్రామానికి చెందిన గోపిరెడ్డి నాగిరెడ్డి అనే భూస్వామి తమపై దౌర్జన్యంగా గత సంవత్సర కాలంగా తప్పుడు కేసులు పెడుతూ తమ తాతల తండ్రుల నుండి భూమిని నమ్ముకుని బతుకుతున్న తమకు కావాలని పలు రకాలుగా ఇబ్బందులు పెడుతూ డబ్బులు వెదజల్లి అక్రమ కేసులు తమపై బనాయించి స్టేషన్ చుట్టు తిప్పుతున్నారని బాధిత దళిత కుటుంబాలు సూరేపల్లి రాములు, గోపి ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రెవిన్యూ, పోలీస్ అధికారులు దళితులుగా మాకు జరుగుతున్న అన్యాయంపై సమగ్రంగా విచారించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బచ్చలకూర స్వరాజ్యం, బిఆర్ఎస్ మునగాల అధ్యక్షులు ఉడుం కృష్ణ, బిఆర్ఎస్ మండల అధికార ప్రతినిధి ఎలిపి రామయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు సూరేపల్లి రమేష్, పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు సూరేపల్లి పిచ్చయ్య, కోటయ్య, వెంకన్న, బిక్షం, వెంకటేష్, గోపి పాల్గొన్నారు.

## నేడు రేషన్ కార్డులు పంపిణీ

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మధ్యాహ్నం 1 గంటలకు ప్రభుత్వ విప్, ఆలేరు ఎంఎల్ఏ బీర్ల అయిలయ్య, జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా లబ్దిదారులకు నూతన రేషన్ కార్డులు, ఎన్ఎఫ్‌బిఎస్ (ఇరవై వేలు) పంపిణి చేయడం జరుగుతుందని మండల తహశీల్దార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## బ్యాంక్ స్ట్రీట్ ఉపపోస్టు ఆఫీస్‌ను హెడ్ పోస్టు ఆఫీస్‌లో విలీనం చేయొద్దు


### పెన్షన్‌దారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని విలీనంను విరమించుకోవాలి



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** జిల్లా కేంద్రంలోని 25వ వార్డులో కొనసాగుతున్న బ్యాంక్ స్ట్రీట్ ఉప పోస్టు ఆఫీస్‌ను హెడ్ పోస్టు ఆఫీస్‌లో విలీనం చేయాలనుకునే ఆలోచనను వెంటనే విరమించుకోవాలని బిఆర్ఎస్ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఆకుల లవకుశ డిమాండ్ చేశారు. పెన్షన్‌దారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆ ఆలోచనను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బ్యాంక్ స్ట్రీట్ ఉప తపాల కార్యాలయం ముందు పెన్షన్‌దారులతో కలిసి ధర్నా నిర్వహించి మాట్లాడారు. ఈ పోస్టు కింద మూడువేల మంది పెన్షన్‌దారులతో పాటు 3వేల మంది ఖాతాదారులు ఉన్నారని, దీని హెడ్ పోస్టు ఆఫీస్‌లో విలీనం చేయడంతో వృద్ధులు, వికలాంగులు, పెన్షన్లు తీసుకునేందుకు చాల ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఇదే పోస్టు ఆఫీస్‌ని గతంలో చర్చి కంపౌండ్ ప్రాంతంగా నిర్వహించగా దూరభారం కావడంతో తాము అధికారులకు విన్నవించిన వెంటనే 25వ వార్డులో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఇటీవల పోస్టు ఆఫీస్ విజిట్‌కు వచ్చిన పిజిఎం ఇక్కడ పోస్టు ఆఫీస్‌లో ఖాతాలులేవని కేవలం పెన్షన్ల కోసమే కొనసాగుతుందని చెబుతూ దీన్ని హెడ్ పోస్టు ఆఫీస్‌లో విలీనం చేయాలని రిపోర్టు ఇవ్వడం సరికాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షన్‌దారుల జీవితాలతో చెలగాటాలాడుతూ ఉప పోస్టు ఆఫీస్‌లను ఎత్తివేయాలని చూడటం దారుణమన్నారు. పేదలు, వృద్ధులు, వికలాంగులను దృష్టిలో ఉంచుకుని బ్యాంక్ స్ట్రీట్ ఆఫీస్‌ను ఇక్కడే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అర్వపల్లి లింగయ్య, బైరు వెంకన్న, వృద్ధులు, వికలాంగులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదులను హతమార్చినందుకు గర్వంగా ఉంది

**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** పరేషన్ మహాదేవ్ లో ముగ్గురు ఉగ్రవాదులను భారత సైన్యం హతమార్చినందుకు అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కన్వీనర్ జక్కుల శ్రీనివాస్ యాదవ్ హర్ష వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ పహాల్గాం దాడికి పాల్పడిన ఉగ్రవాదు లు సులేమాన్, అఫ్గాన్, జీప్రాక్, అనే ముగ్గురిని ఇండియన్ భారత సైన్యం మట్టిలో కలిపిందని తెలిపారు. వారితోపాటు కీలక వ్యక్తిగా గతంలో ఆపరేషన్ సింధూరిలో ఇండియన్ ఆర్మీ అతన్ని చంపేశారని ఇది చాలా గర్వంగా ఉందని మన భారత సైన్యానికి, మన ప్రధానమంత్రి మోడీ కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. మోడీ ఆర్మీ త్రివిధ దళాలకు, స్వేచ్ఛ ఇచ్చి ప్లాన్ మీదే, అటాక్ మీదే, నాకు ఇన్ఫర్మేషన్ ఇయ్యండి అని చెప్పాడని అందుకు మన ఇండియన్ ఆర్మీ చాలా ముందుకు సాగుతుందన్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ఉగ్రవాదం ఎప్పటికీ గెలవదు : ఫరూఖ్



**శ్రీనగర్ :** పహల్గామ్ ఉగ్రవాద దాడికి పాల్పడిన వారిని నిర్మూలించడం ఉగ్రవాదం విజయవంతం కాదని ఒక పాఠం అని నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూఖ్ అబ్దుల్లా పేర్కొన్నారు. మంగళవారం శ్రీనగర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'నేను వారిని చూడలేదు, వారు ఎవరో నాకు తెలియదు. వారిని చూసిన వ్యక్తులు మాత్రమే గుర్తించగలరు. వారు చంపబడి ఉంటే, అది మంచి విషయం. ఉగ్రవాదం ఎప్పటికీ విజయం సాధించదని వారికి పాఠం నేర్పింది' అని మాజీ ముఖ్యమంత్రి అన్నారు. పహల్గామ్ మారణహోమం నిర్వహించిన ముగ్గురు ఉగ్రవాదులను శ్రీనగర్ సమీపంలో సైన్యం, సిఆర్‌పిఎఫ్, జమ్ముకశ్మీర్ పోలీసులు సం యుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో భద్రతా దళాలు హతమార్చాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా మంగళవారం లోక్‌సభలో ప్రకటించారు. ఆపరేషన్ సిందూర్‌పై ప్రత్యేక చర్చలో పాల్గొన్న షా, సోమవారం ఆపరేషన్ మహాదేవ్ కింద ఉగ్రవాదులు హతమయ్యారన్నారు. వారిని సులేమాన్ అలియాస్ ఫైజల్, ఆఫ్ఘని, జిబ్రాన్‌గా గుర్తించినట్లు చెప్పారు.

# కేరళ నన్స్...అరెస్ట్ దిగ్భ్రాంతికరం

**• మానవ అక్రమరవాణా అభియోగాలపై సిపిఐ ఎంపి పి.సందోష్‌కుమార్ ఆక్షేపణ • ఈ దేశం ఏమైనా 'బనానా రిపబ్లిక్'గా మారిందా? అని విస్మయం వ్యక్తం**

న్యూఢిల్లీ : మానవ అక్రమ రవాణా, బలవంతపు మార్పిడి అభియోగాలపై కేరళ రాష్ట్రానికి చెందిన ఇద్దరు కేథలిక్ నన్స్‌ను బిజెపి పాలిత ఛత్తీస్‌గఢ్‌లో అరెస్ట్ చేయడం ఒక వింతను తలపిస్తుందని, ఈ చర్య 'దిగ్భ్రాంతికరం' అని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఎంపి పి.సందోష్‌కుమార్ అన్నారు. ఈ వింత చర్యను చూస్తే ఈ దేశం ఏమైనా 'బనానా రిపబ్లిక్'గా మారిందా ? అని సందోష్‌కుమార్ ప్రశ్నించారు. మీడియా వార్తల ప్రకారం...ఇటీవల కేరళకు చెందిన కేథలిక్ నన్స్ ఛత్తీస్‌గఢ్‌లోని ఒక రైల్వే స్టేషన్‌లో అరెస్ట్ అయినట్లు వార్తలు ప్రసారం అయ్యాయన్నారు.వారిపై మానవ అక్రమ రవాణా, బలవంతపు మతమార్పిడుల అభియోగాలు మోపడం దారుణమన్నారు. ఇది ఒక వింతమాత్రమే కాదు, దిగ్భ్రాంతికరమైన కేసు. మానవ అక్రమరవాణా కేసు ఏదైతే ఉందో అది భారతీయ న్యాయ సంహిత (బిఎన్‌ఎస్)లోని సెక్షన్ 143 కింద అభియోగాలు నమోదు అయ్యాయని, ఈ మానవ అక్రమ రవాణా నేరంలో ఒకరి కంటే ఎక్కువమంది భాగస్వాములైతే 10సంవత్సరాలకు పైగానే జైలుశిక్షకు శిక్షార్హులు అవుతారని కేరళ రాష్ట్ర సిపిఐ నాయకుడు, ఎంపి సందోష్‌కుమార్ మంగళవారం ఇక్కడ 'పిటిఐ' వీడియోస్‌కు ఇచ్చిన 'ఇంటర్వ్యూ'లో చెప్పారు. దుర్గ్ స్టేషన్ నుండి ఆగ్రా స్టేషన్‌కు మానవ అక్రమ రవాణానా? అసలు ఇది అంతా ఏమిటి? ఈ దేశం ఏమైనా బనానా రిపబ్లిక్‌గా మారిపోయిందా? అని ఎంపి సందోష్‌కుమార్ విస్మయం వ్యక్తం చేశారు. బిజెపి పాలనలో మైనారిటీలు అందరినీ లక్ష్యంగా చేసుకుంటున్నారు. నన్స్, ఫాదర్స్ వారి డ్రెస్సు ధరించాలంటేనే భయపడిపోతున్నారని చెప్పారు. ఈ సంఘటన మరోసారి బిజెపి చేత బహిర్గతం అయ్యిందని వామపక్ష నేత, ఎంపి సందోష్‌కుమార్ వెల్లడించారు.



దేశంలో గత ఏడాది క్రిస్టియన్లకు వ్యతిరేకంగా 834కు పైగా దౌర్జన్య సంఘటనలు నమోదయ్యాయన్నారు. 'ఈ ఏడాది కూడా ఇలాంటి సంఘటనలు నిరవధికంగా సంభవిస్తున్నాయి. మేం వాటితో రాజీ పడే ప్రసక్తేలేదు. మేం మాత్రం ఇలాంటి వాటిపై నిరవధిక పోరాటం కొనసాగిస్తాం'అని సందోష్ కుమార్ వివరించారు. కుమార్ మాట్లాడుతూ వామపక్ష పార్టీలకు చెందిన ప్రతినిధి బృందం ఒకటి ప్రస్తుతం రాయ్‌పూర్, దుర్గ్‌లను సందర్శిస్తున్నదని చెప్పారు. 'ఈ కేథలిక్ నన్స్‌ను తక్షణమే తప్పకుండా విడుదల చేయాలి. వారికి వ్యతిరేకంగా అభియోగాలు మోపేందుకు ఏ అంశమూ లేదు, మేం దానిపై తప్పకుండా పోరాడతాం' అని ఆయన చెప్పారు. ఈ ఇద్దరు నన్స్ అరెస్ట్ రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. ప్రతిపక్షనాయకులు మాట్లాడుతూ ఇది క్రిస్టియన్లపై జరిగిన దాడి అని ఆరోపించారు. ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి ఈ అంశంపై మాట్లాడుతూ ప్రతిపక్షాలు ఈ అంశాన్ని రాజకీయం చేయాలని చూస్తున్నారని, ఆయన 'బస్తర్ నుంచి వచ్చిన మన కూతుళ్ల సురక్షితం పట్ల తనకు ఆందోళనగా ఉందని సాయి చెప్పారు. అయితే కేరళ రాష్ట్ర బిజెపి శాఖ మంగళవారం విష్ణుదేవ్ సాయి వ్యాఖ్యలను తోసిపుచ్చింది. నన్స్ ఎలాంటి మానవ అక్రమ రవాణా, బలవంతపు మార్పిడిలలో భాగస్వామ్యం కాలేదని తేల్చిచెప్పింది.

# 22 మంది చిన్నారులను దత్తత తీసుకోనున్న రాహుల్‌గాంధీ

**రాజౌరి/జమ్ము :** ఆపరేషన్ సిందూర్ సందర్భంగా జమ్ముకశ్మీర్ పూంచ్ జిల్లాలోని నియంత్రణ రేఖ (ఎల్‌ఓసి) వెంబడి పాకిస్థాన్ జరిపిన కాల్పుల్లో తల్లిదండులిద్దరినీ లేదా అందులో ఒకరిని కోల్పోయిన 22 మంది పిల్లల విద్యకు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీ స్పాన్సర్ చేస్తారని పార్టీ నాయకుడు ఒకరు తెలిపారు. ఎన్నికలకు ముందు కూటమి భాగస్వామి అయిన నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి)తో ఎలాంటి విభేదాలను కూడా ప్రదేశ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తారిఖ్ హమీద్ కర్రా స్పష్టం చేశారు. అయితే గత తొమ్మిది నెలలుగా అధికార పార్టీతో సమన్వయ కమిటీ ఏర్పాటు కోసం తమ పార్టీ వేచి ఉందని అన్నారు. పాకిస్థాన్ కాల్పుల్లో (మే 7—10 మధ్య) చాలా మంది పౌరులు మరణించారు. తీవ్ర ఆస్తి నష్టం జరిగింది. విధ్వంసకర కాల్పుల తర్వాత రాహుల్ గాంధీ పూంచ్‌ను సందర్శించి, మృతుల కుటుంబాలను పరామర్శించారు. తల్లిదండ్రులను కోల్పోయిన పాఠశాలకు వెళ్లే పిల్లల జాబితాను సిద్ధం చేయాలని ఆయన తమను కోరారని కర్రా చెప్పారు. ముఖ్యంగా అన్నదాతలను కోల్పోయి పాఠశాలకు వెళ్లే పిల్లల జాబితాను సిద్ధం చేయాలన్నారు. తదనుగుణంగా తాము ఆ జాబితాను ఆయనకు సమర్పించామని, మూడు రోజుల పర్యటనలో రాజౌరికి చేరుకున్న



కర్రా సోమవారం మీడియాతో మాట్లాడారు. ఒక్క పూంచ్ జిల్లాలోనే 22 మంది పిల్లల జాబితా కాంగ్రెస్ వద్ద ఉందని, మూడు రోజుల పర్యటన ముగింపులో పిల్లల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఆయన అన్నారు. జమ్ముకశ్మీర్‌లో పాకిస్థాన్ జరిపిన షెల్లింగ్, డ్రోన్ దాడుల్లో 28 మంది పౌరులు మరణించగా, అందులో 13 మంది చిన్నారులు ఉన్నారు. ఏప్రిల్ 22న జరిగిన పహల్గామ్ ఉగ్రవాద దాడికి ప్రతీకారంగా భారత సాయుధ దళాలు మే నెలలో ఆపరేషన్ సిందూర్ కింద సరిహద్దు వెంబడి ఉగ్రవాద మౌలిక సదుపాయాలపై క్షిపణి దాడులు చేసింది. బాధిత పిల్లల విద్య కోసం ప్రతిపక్ష నాయకుడు పంపిన ఆర్థిక సహాయాన్ని అందజేయడానికి మంగళవారం పూంచ్‌ను సందర్శిస్తున్నట్లు కర్రా చెప్పారు. పిల్లల చదువులు ప్రభావితం కాకుండా వారికి సహాయం అందించడం దీని లక్ష్యమన్నారు.

# సిందూర్‌పై చర్చకు తివారీ, థరూర్ దూరం!

**న్యూఢిల్లీ:** ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో జరిగే చర్చకు కాంగ్రెస్ నేతలు శశిథరూర్, మనీశ్ తివారీలను ఆ పార్టీ దూరం పెట్టింది. దీనిపై తివారీ నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. అందులో తాను భారత్ వైపే మాట్లాడతానని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ గురించి ప్రపంచదేశాలకు వివరించడానికి వెళ్లిన అఖిలపక్ష బందంలో థరూర్, తివారీ ఉన్నారు. ఈ ఆపరేషన్‌పై జరిగే చర్చలో తమను ఎందుకు దూరం పెట్టారనే దానిపై ఓ వార్తా సంస్థ రాసిన కథనాన్ని తివారీ ఎక్స్‌లో పంచుకున్నారు. దానికి పూరబ్ ఔర్ పశ్చిమ్ అనే బాలీవుడ్ సినిమాలోని దేశభక్తి గీతంలో కొన్ని వ్యాఖ్యలను జోడించారు. భారతీయుడిగా తాను దేశ వైభవాన్నే కోరుకుంటాననేది దాని అర్థం. దీనికి ముందు చర్చల్లో తాను మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని తివారీ అభ్యర్థన పంపారని పార్టీ వర్గాలు ఓ వార్తా సంస్థకు తెలిపాయి. ఆపరేషన్‌పై జరిగే చర్చల్లో థరూర్ ఉండాలని కాంగ్రెస్ కోరిందని, అయితే, పార్టీ చెప్పినవిధంగా మాట్లాడాలని కోరినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. కానీ, దీనికి ఆయన నిరాకరించినట్లు సమాచారం. దీనిపై విలేకరులు ప్రశ్నించగా... మౌనవ్రతం, మౌనవ్రతం అంటూ థరూర్ బదులిచ్చారు.

# టైగర్ రిజర్వ్‌లో 2021 నుంచి 50 శాతం పులులు మృతి



**న్యూఢిల్లీ :** భారతదేశంలో 2021 నుండి 2025 మధ్యలో ఇప్పటి వరకు జరిగిన పులుల మరణాలలో సగానికి పైగా రక్షిత అభయారణ్యాల వెలుపల సంభవించాయని, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలోనే అత్యధిక సంఖ్యలో సంభవించాయని ప్రభుత్వ గణాంకాలు వెల్లడించాయి. నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ (ఎన్‌టిసిఎ) ప్రకారం నాలుగేళ్లలో 667 పులులు మరణించగా, 341 లేదా 51 శాతం టైగర్ మరణాలు అభయారణ్యాల వెలుపల సంభవించాయి. సంవత్సరాల వారీగా డేటా ప్రకారం 2021లో 129 పులులు, 2022లో 122, 2023లో 182, 2024లో 126, 2025లో ఇప్పటివరకు 108 పులులు మృతి చెందాయి. రిజర్వ్‌ల వెలుపల మరణాల సంఖ్య 2021లో 64, 2022లో 52, 2023లో 100, 2024లో 65, 2025లో ఇప్పటివరకు 60గా ఉంది. మహారాష్ట్రలో అత్యధికంగా 111 పులులు అభయారణ్యాల వెలుపల మరణించగా, మధ్యప్రదేశ్‌లో 90 మరణాలు సంభవించాయి. 2021లో మహారాష్ట్రలో 23, మధ్యప్రదేశ్‌లో 18, కేరళలో ఐదు, తెలంగాణాలో నాలుగు చనిపోయాయి. 2022లో మహారాష్ట్రలో 18, మధ్యప్రదేశ్‌లో 12, కేరళ, ఉత్తరాఖండ్‌లో నాలుగు చొప్పున ప్రాణాలు కోల్పోయాయి. 2023లో మహారాష్ట్రలో అభయారణ్యాల వెలుపల 34, మధ్యప్రదేశ్‌లో 13, కేరళ, ఉత్తరాఖండ్‌లో 11 చొప్పున, కర్ణాటకలో ఆరు పులులు మృతి చెందాయి. 2024లో మధ్యప్రదేశ్‌లో 24, మహారాష్ట్రలో 16 పులులు అభయారణ్యాల వెలుపల మరణించాయి. ఈ సంవత్సరం, ఇప్పటి వరకు మహారాష్ట్రలో అభయారణ్యాల వెలుపల 20, మధ్యప్రదేశ్‌లో 13, కేరళలో ఎనిమిది, కర్ణాటకలో ఏడు పులులు అభయారణ్యాల వెలుపల మరణించాయి. 2012— 2024 మధ్య 1,519 పులులు అభయారణ్యాల వెలుపల మరణించగా, 634 లేదా 42 శాతం మరణాలు అభయారణ్యాల వెలుపల సంభవించాయని ఎన్‌డిసిఎ గణాంకాలు తెలియజేస్తున్నాయి. ప్రస్తుత భారతదేశంలోని అంచనా వేసిన 3,682 పులులలో దాదాపు 30 శాతం నోటిఫైడ్ టైగర్ రిజర్వ్‌ల వెలుపల నివసిస్తున్నాయి. ఈ ప్రాంతాలలో పెరుగుతున్న మానవ—పులుల సంఘర్షణను పరిష్కరించడానికి, ప్రభుత్వం త్వరలో టైగర్స్ అవుట్‌సైడ్ టైగర్ రిజర్వ్ (టిఒటిఆర్) ప్రాజెక్టును ప్రారంభించాలని యోచిస్తోంది. ఇది 17 రాష్ట్రాలలో 80 అటవీ విభాగాలను కవర్ చేస్తుంది. 2022లో నిర్వహించిన తాజా పులుల జనాభా అంచనా ప్రకారం, మధ్యప్రదేశ్‌లో దాదాపు 785 పులులు, కర్ణాటకలో 563, ఉత్తరాఖండ్‌లో 560, మహారాష్ట్రలో 444, తమిళనాడులో 306, అసోంలో 229, కేరళలో 213, ఉత్తరప్రదేశ్‌లో 205 పులులు ఉన్నాయి.

# రోజుకో రీతిలో విపక్షాల నిరసన

**న్యూఢిల్లీ :** బిహార్‌లో ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ల జాబితా సవరణకు వ్యతిరేకంగా మంగళవారం పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో ఇండియా కూటమి పార్టీలకు చెందిన పలువురు ఎంపిలు నిరసన తెలిపారు. పార్లమెంట్‌లో కార్యకలాపాలు ప్రారంభం కావడానికి ముందు కాంగ్రెస్, డిఎంకె, టిఎంసి, ఆర్‌జెడి, వామపక్ష పార్టీలతో సహా పలువురు



ప్రతిపక్ష ఎంపిలు పార్లమెంటు మకర ద్వారం మెట్లపై జరిగిన నిరసనలో పాల్గొని నినాదాలు చేశారు. 'ఓట్ కి చోరీ బంద్ కరో (ఓట్ల దొంగతనాన్ని ఆపండి)' 'సిఆర్ వాపస్‌లో (రోల్‌బ్యాక్ సిఆర్)' వంటి నినాదాలు చేశారు. 'ఓట్ల దోపిడీని ఆపండి' అని వ్రాసిన ప్లకార్డులతో పాటు ఇసి, ప్రభుత్వం మధ్య 'కుట్ర'ను చిత్రీకరించే ప్లకార్డులను కూడా ప్రతిపక్ష ఎంపిలు ప్రదర్శించారు. కాగా, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సిఆర్)కు వ్యతిరేకంగా పార్లమెంటు హౌస్ కాంప్లెక్స్‌లో ప్రతిపక్షాలు ప్రతిరోజూ వేర్వేరు పద్ధతుల్లో నిరసన వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బిహార్‌లో ఓటర్ల ఓటు హక్కును తొలగించడమే లక్ష్యంగా ఇసి చేపట్టిన కసరత్తు ఉందని ఆరోపిస్తున్నారు. ఉభయ సభల్లోనూ ఈ అంశంపై చర్చ జరగాలని కూడా వారు డిమాండ్ చేస్తున్నారు.

### రాజ్యసభలో వాయిదాల పర్వం

హార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్) ఓటర్ల జాబితాతో సహా వివిధ అంశాలపై చర్చించడానికి ప్రతిపక్షాలు ఇచ్చిన వాయిదా నోటీసులను తిరస్కరించిన తర్వాత రాజ్యసభ కార్యకలాపాలు మంగళవారం మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడ్డాయి. ఉదయం జాబితా పత్రాలు సభ్యులకు అందించిన తర్వాత, డిప్యూటీ చైర్మన్ హరివంశ్ మాట్లాడుతూ ఎస్‌ఐఆర్ ఇతర రాష్ట్రాల్లో బెంగాలీ వలస కార్మికులపై వివక్ష చూపుతున్నారని, ఉపాధ్యక్షుడు జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా వంటి వివిధ అంశాలపై చర్చ కోరుతూ రూల్ 267 కింద తనకు 24 నోటీసులు వచ్చాయని చెప్పారు. అయితే ఆయన వాయిదా నోటీసులను తిరస్కరించారు. దీనిపై విపక్ష సభ్యులు నిరసించారు. నిరసనలు కొనసాగుతుండగా, కార్యకలాపాలు మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు.

### లోక్‌సభలో సజావుగా ప్రశ్నోత్తరాలు

21వ తేదీన వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన తర్వాత మంగళవారం లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయం సజావుగా సాగింది. బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణ, ఆపరేషన్ సిందూర్‌పై చర్చకు ప్రతిపక్షాలు డిమాండ్ చేయడంతో సభలో పదే పదే గందరగోళం నెలకొన్న విషయం విదితమే. అయితే సోమవారం సభలో ఆపరేషన్ సిందూర్‌పై చర్చ ప్రారంభమైనప్పటికీ, ఆ తర్వాత బిహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్) ప్రక్రియపై చర్చ జరుగుతుందని ప్రభుత్వం హామీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు మొదటి అర్ధభాగంలో అంతరాయం కలిగించాయి. ఆరు రోజుల తరువాత ప్రశ్నోత్తరాల సమయాన్ని మంగళవారం అంతరాయం లేకుండా జరిగింది. కీలక మంత్రిత్వ శాఖలకు సంబంధించిన అంశాలు చర్చకు వస్తున్నందున, ప్రభుత్వం జవాబుదారీగా ఉండడంతో సభ్యులు ప్రశ్నోత్తరాల సమయంలో పాల్గొనాలని స్పీకర్ ఓం బిర్లా విజ్ఞప్తి చేశారు.

# రాష్ట్రపతి బిల్లుల ఆమోదంపై 19 నుంచి విచారణ

**న్యూఢిల్లీ:** రాష్ట్రాల శాసనసభలు ఆమోదించిన బిల్లులను రాష్ట్రపతి నిర్దిష్ట గడువులోగా తేల్చాలని కోర్టులు నిర్దేశించవచ్చా అన్న అంశంపై ఆగస్టు 19 నుంచి విచారణ జరగనుంది. ఈ విషయంపై తమ అభిప్రాయాలు తెలియజేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఇప్పటికే అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. ఆగస్టు 12లోగా తమ అభిప్రాయాలు తెలియజేయాలని పేర్కొంది. శాసనసభలు ఆమోదించిన బిల్లులపై ఆయా రాష్ట్రాల గవర్నర్లు, రాష్ట్రపతి నిర్దిష్టకాల వ్యవధిలోగా చర్యలు తీసుకోవాలని ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు పేర్కొంది. దీనిపై స్పందించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తనకు రాజ్యాంగంలోని 143(1) అధికరణం ద్వారా సంక్రమించిన అధికారాలు ఉపయోగించుకొని 14 కీలక ప్రశ్నలను అత్యున్నత న్యాయస్థానం ముందుంచారు. ప్రజా ప్రయోజనంతో ముడిపడివున్న చట్టపరమైన అంశాలపై రాష్ట్రపతి సుప్రీంకోర్టు అభిప్రాయం తెలుసుకునేందుకు ఆ కోర్టు ముందు తన ప్రశ్నలను ఉంచవచ్చని, సుప్రీంకోర్టు దానిపై విచారణ జరిపి తన అభిప్రాయాన్ని రాష్ట్రపతికి తెలియజేయవచ్చని 143(1) అధికరణం తెలియజేస్తోంది. ఈ నేపథ్యంలోనే వచ్చే నెల విచారణ జరగనుంది.

# బస్సు—ట్రక్కు ఢీకొని ఆరుగురు కన్వారియాలు మృతి

### 24 మందికి గాయాలు

**రాంచీ/డియోఘర్ :** జార్ఖండ్‌లోని డియోఘర్ జిల్లాలో మంగళవారం భక్తులతో వెళ్తున్న బస్సు, వంట గ్యాస్ సిలిండర్లతో నిండిన ట్రక్కు ఢీకొన్న ప్రమాదంలో కనీసం ఆరుగురు కన్వారియాలు మృతి చెందగా, 24 మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. మోహన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జమునియా అటవీ ప్రాంతంలో ఉదయం 5.30 గంటల ప్రాంతంలో బస్సుట్రక్కును ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని వారు తెలిపారు. దేయోఘర్‌లోని జమునియా చౌక్‌లో జరిగిన ప్రమా దంలో ఆరుగురు భక్తులు మరణించగా, 24 మంది గాయపడ్డారని, గాయపడిన 24 మందిలో ఎనిమిది మందిని దేవోఘర్‌లోని ఎయిమ్స్‌కు తరలించారు. మిగిలిన వారు సదర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని దేవోఘర్ డిప్యూటీ కమిషనర్ నమన్ ప్రియేష్ లక్రా తెలిపారు. ముందుగా, కన్వారియాలతో కూడిన బస్సు గ్యాస్ సిలిండర్లను రవాణా చేస్తున్న ట్రక్కును ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని ఇన్‌స్పెక్టర్ జనరల్ (దుమ్కా జోన్) శైలేంద్ర కుమార్ సిన్హా పిటిఐకి తెలిపారు.ఢీకొన్న తర్వాత, డ్రైవర్ బస్సు నుండి పడిపోయాడు. స్టీరింగ్ వీల్ వెనుక ఎవరూ లేకుండా వాహనం కొంతసేపు కదులుతూనే ఉండి, ఇటుకల కుప్పను ఢీకొన్న తర్వాత ఆగిపోయిందని ఐజి చెప్పారు. అయితే, ఎంపి నిషికాంత్ దూబే, ప్రమాదంలో 18 మంది కన్వారియాలు మరణించారని 'ఎక్స్'లో ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు. ఆరుగురు మాత్రమే ప్రాణాలు కోల్పోయారని పోలీసులు నిర్ధారించగా, మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ప్రమాదంలో కనీసం 24 మంది కన్వారియాలు గాయపడి, దుమ్కాలోని సరయ్యాహాత్ పిహెచ్‌సితో సహా వివిధ ఆసుపత్రులు, సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తరలించబడ్డారని మరో అధికారి తెలిపారు. అనేక మంది గాయపడిన వారి పరిస్థితి తీవ్రంగా ఉన్నందున ప్రాణనష్టం పెరిగే అవకాశం ఉందని ఆయన అన్నారు. ప్రమాదం తర్వాత జిల్లా యంత్రాంగం అప్రమత్తమైందని ఆయన అన్నారు. దేయోఘర్ సబ్ డివిజనల్ ఆఫీసర్ రవి కుమార్ మాట్లాడుతూ కన్వారియాలు బాసుకినాథ్ ఆలయానికి వెళ్తున్నారని అన్నారు. సివిల్ సర్జన్, దేయోఘర్ తెలిపిన వివరాల ప్రకారం, మరణించిన వారిలో బస్సు డ్రైవర్ సుభాష్ టూరి, ఇతరులు గయాకు చెందిన సుమన్ కుమారి, పీయూష్, వైశాలి, దుర్గావతి దేవి, బెట్టియాకు చెందిన జాంకీ దేవి ఉన్నారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన భక్తుల కుటుంబాలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'ఎక్స్'లో సంతాపం తెలిపారు.

# మాటమార్చిన చిరాగ్ పాశ్వాన్




**పట్నా:** కేంద్రమంత్రి, లోక్‌జనశక్తి పార్టీ(పాశ్వాన్) అధినేత చిరాగ్ పాశ్వాన్ మాటమార్చారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం నితీశ్ కుమార్ మరోసారి ముఖ్యమంత్రి అవుతారని చెప్పారు. నితీశ్ సర్కారుకు మద్దతిచ్చినందుకు చింతిస్తున్నానని ఇటీవల విమర్శించిన చిరాగ్... తాజాగా యూటర్న్ తీసుకోవడం గమనార్హం. ఇక్కడ ఓ కార్యక్రమంలో పాల్గొన్న చిరాగ్ మాట్లాడుతూ 'ప్రధాని మోదీపై నా ప్రేమ, నిబద్ధత నిరంతరం ఉంటాయని ఉద్ఘాటిస్తున్నా. మోదీ నాయకత్వంలో రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతాయి. ఎన్నికల ఫలితాల అనంతరం నితీశ్ మళ్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తారు. కచ్చితంగా ఆయన సీఎం అవుతారు' అని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఎస్‌ఐఆర్ గురించి ప్రస్తావిస్తూ ఈ ప్రక్రియ గతంలో నాలుగుసార్లు జరిగిందన్నారు. ఇప్పుడు డిజిటల్ టెక్నాలజీతో అనుసంధానమవుతోందని చెప్పుకొచ్చారు. దీనిపై ప్రతిపక్షం గందరగోళం చేయాల్సిన అవసరం లేదన్నారు. జాబితా నుంచి అనర్హులను మాత్రమే తొలగిస్తున్నట్లు తెలిపారు. ప్రతిసారి ఎన్నికల తర్వాత ఏదోఒక ఫిర్యాదు లేవనెత్తడం ప్రతిపక్షాలకు అలవాటైపోయిందని విమర్శించారు. ఈ ఎన్నికల్లో వారికి ఈవీఎంలు బాగానే ఉన్నాయి. ఓటర్ల జాబితానే సమస్య అని ఎద్దేవా చేశారు. ఎస్‌ఐఆర్ ఇప్పుడు బీహార్‌లో జరుగుతుంది. ఆ తర్వాత పశ్చిమబెంగాల్, తమిళనాడు సహా దేశవ్యాప్తంగా జరుగుతాయన్నారు. ఎన్డీఏ విడిపోవాలని ప్రతిపక్షం కోరుకుంటుందని చిరాగ్ ఆరోపించారు. ఎన్నికల్లో సొంత బలంతో గెలవలేక... ప్రత్యర్థి పక్షాన్ని బలహీనపరిచి గెలవాలని చూస్తోందన్నారు..

# 'నేడు' నింగిలోకి ప్రతిష్ఠాత్మక 'నిసార్'

### 27.30 గంటల కౌంట్‌డౌన్
### నిసార్ గుప్పెట్లో భూగ్రహ వైపరీత్యాల కదలికలు

**శ్రీహరికోట:** నాసా—ఇస్రోలు ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన భూపరిశీలక ఉపగ్రహం 'నిసార్' (నాసా—ఇస్రో సింథటిక్ అరెర్చుర్ రాడార్) ప్రయోగానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. నిర్ణీత ప్రకారం బుధవారం సాయంత్రం 5.40 గంటలకు శ్రీహరికోటలోని సతీశ్ థావన్ అంతరిక్ష కేంద్రం నుండి నింగిలోకి దూసుకుపోతుంది. 27.30 గంటల కౌంట్‌డౌన్ కార్యక్రమం మంగళవారం మధ్యాహ్నం 2.10 గంటలకు ప్రారంభమైంది. ఎంతోకాలంగా ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ ప్రయోగంవల్ల భూగ్రహం అంతటా ఎక్కడైనా సంభవించే ప్రకృతి వైపరీత్యాలకు సంబంధించిన సమాచారం ముందుగా సేకరించవచ్చు. అంటే యావత్ భూగ్రహంలో ప్రకృతి వైపరీత్యాల కదలికలు ఇకమీదట నిసార్ గుప్పెట్లోకి వస్తాయి. ప్రపంచవ్యాప్తంగా లభించే ఈ ముందస్తు సమాచారాన్ని ప్రతి 12 రోజులకు ఒకసారి భూమికి పంపుతుంది. భూతలాన్ని, సముద్రాలను, పర్వతాలను, మంచు ప్రాంతాలను ఇది పరిశీలిస్తుంది. ప్రధానంగా భూమి, మంచు కదలికలలో తేడాలను, వాటిల్లో వచ్చే వైపరీత్యాలను పరిశీలించడం నిసార్ ప్రధాన లక్ష్యం.


భూ స్థిరకక్ష్యలోకి ఉపగ్రహాలను ప్రవేశపెట్టేందుకు ఇతర దేశాలపై ఆధారపడకుండా దేశీయంగా తయారు చేసిన జిఎస్‌ఎల్‌వి (భూ సమస్థితి ఉపగ్రహ వాహకనౌక) ద్వారా ఈ ఉపగ్రహాన్ని పంపుతారు.నిసార్ భూపరిశీలన ఉపగ్రహం సూర్యసమవర్తన కక్ష్యలో పరిభ్రమించేందుకు వీలుగా జిఎస్‌ఎల్‌వి శ్రేణి ఎంకె 2 వాహకనౌక నింగిలోకి తీసుకెళుతుంది. నాసా—ఇస్రో రెండు అంతరిక్ష పరిశోధనా సంస్థలూ ఉమ్మడి ఒప్పందంతో దశాబ్దకాలంపైగా కృషిచేసి ఈ ప్రయోగానికి రంగం సిద్ధం చేశాయి. నిసార్‌ను ఇస్రో తయారు చేసింది. లాంచ్‌ప్యాడ్ నుండి బయలుదేరిన తర్వాత చెన్నైకి 135 కి.మీ తూర్పు దిశగా ప్రయాణించి 19 నిమిషాల వ్యవధిలో ఇచ్చిన బాధ్యతలు పూర్తి చేస్తుంది. 51.7 మీటర్ల ఎత్తుగల ఈ వాహకనౌక మూడు దశలలో ఉపగ్రహాన్ని నిర్దేశిత గమ్యానికి చేరుస్తుంది. శాస్త్రవేత్తలు నిర్దేశించిన కక్ష్యలోకి అంటే 740 కి.మీ ఎత్తులోకి నిసార్ ఉపగ్రహాన్ని పంపుతుంది.



నిసార్ ఉపగ్రహం అత్యంత అధునాతనమైన రాడార్ ఇమేజింగ్‌లను ఉపయోగించి భూమిపై ఉన్న నేలను, మంచు ఎత్తులను అత్యంత సమీపం నుండి కొలతలు తీసి, పర్యావరణంలో మార్పులను పరిశీలించి భూతలకేంద్రానికి పంపిస్తుంది. అత్యవసర సమయాలలో అంటే ప్రకృతి వైపరీత్యాల సమయంలో దీనిద్వారా మనకు ముందస్తు హెచ్చరికలు లభిస్తాయి. భూకంపాలు, సునామీలు, అగ్నిపర్వతాలు బద్దలుకావడం, పర్యావరణ అవాంతరాలు, మంచు పలకల పతనం వంటివాటితోసహా కొన్ని ఇతర గ్రహాలకు సంబంధించిన సంక్లిష్టమైన సహజ ప్రక్రియలను కూడా పరిశీలించడానికి ఈ నిసార్ ఉపగ్రహం ఎంతో ఉపయోగపడుతుంది. మూడు సంవత్సరాల పాటు ఈ నిసార్ క్రియాశీలంగా తన బాధ్యతలు నిర్వహిస్తుంది. ఉచితంగా అందుబాటులో ఉండే ఈ సమాచారాన్ని అత్యవసర సమయాలలో గంటల వ్యవధిలోనే అందరికీ అందుబాటులోకి తీసుకువస్తారు. సాధారణ సమాచారాన్ని ఒకటి రెండు రోజులు ఆలస్యంగా అందిస్తారు. ఇంతకుముందు కూడా భారతదేశం రీసోర్స్ శాట్, రీశాట్‌లను నింగిలోకి పంపింది. కానీ ఈ ఉపగ్రహాలు పంపిన సమాచారం కేవలం భారతదేశ భూభాగానికి మాత్రమే పరిమితమైనవి. ఈ నిసార్ మాత్రం ఇందుకు భిన్నంగా భూమ్మీద ఎక్కడ వైపరీత్యాలు వచ్చినా ఆ సమాచారాన్ని నమోదు చేసి భూ కేంద్రానికి పంపుతుంది. నాసా చెప్పిన సమాచారం ప్రకారం, నిసార్ మిషన్ ఇప్పటివరకూ సాధించిన విజయాల వారసత్వ పునాదులపై తయారైంది. ఇటీవల యాక్సియం మిషన్—4 ద్వారా ఇస్రో,నాసాలు ఉమ్మడిగా నలుగురు వ్యోమగాములను విజయవంతంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి పంపి తిరిగి విజయవంతంగా భూమికి తీసుకువచ్చాయి. ఈ విధంగా చేయడం ఇదే మొదటిసారి కాగా, ఆ వరుసలో నిసార్ ప్రయోగం రెండవది.

2008లో ఇస్రో మొదటిసారి చంద్రుడిమీదకు చంద్రయాన్—1 ప్రయోగం విజయంతంగా చేసింది. 3,400 కంటేఎక్కువసార్లు ఇది చంద్రుడిచుట్టూ పరిభ్రమించింది. అత్యంత క్రయోజనిక్ ఇంజన్లతో రూపొందించిన జిఎస్‌ఎల్‌వి తరం వాహకనౌకలు 2001 నుండి ఇప్పటివరకూ నింగిలోకి దూసుకెళ్ళి తమ లక్ష్యాలను నెరవేరుస్తున్నాయి. అందులోభాగం ఇప్పుడు జిఎస్‌ఎల్‌వి—ఎఫ్ 16 ఎంకె 2 కొత్తశాఖ వాహకనౌకకు ప్రతిష్ఠాత్మకమైన 'నిసార్'ను నింగిలోకి తీసుకెళ్ళే బాధ్యతలు అప్పగించారు. శ్రీహరికోట నుండి ప్రయోగించే 102వ ప్రయోగంగా 'నిసార్' ఇస్రో చరిత్రలో నమోదవుతుంది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌తో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వాషింగ్టన్‌లో ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిపిన సమావేశంలో తీసుకున్న నిర్ణయంవల్ల రెండు దేశాల అంతరిక్ష సంస్థలూ సంయుక్తంగా భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రోత్సాహం వచ్చింది.

# ప్రళయ్ క్షిపణి పరీక్షలు విజయవంతం



**భువనేశ్వర్:** భారత రక్షణరంగ పరిశోధన సంస్థ (డీఆర్‌డీవో) అభివృద్ధి చేసిన ప్రళయ్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించారు. ఒడిశాలోని అబ్దుల్ కలామ్ ద్వీపంలో 28, 29 తేదీల్లో నిర్వహించిన టెస్ట్‌లు విజయవంతమయ్యాయి. ఈ క్షిపణి అత్యధిక, అత్యల్ప రేంజిని అంచనా వేయడానికి యూజర్ ఎవల్యూషన్ ట్రయల్స్‌ను నిర్వహించారు. డీఆర్‌డీవో ప్రకారం రెండు టెస్ట్‌ల్లో క్షిపణి అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాన్ని ఛేదించింది. అన్ని ప్రమాణాలను ప్రళయ్ అందుకొందని అధికారులు వెల్లడించారు. దీంతో ఇది వినియోగానికి సిద్ధంగా ఉందని తేలినట్లైంది. ప్రళయ్ స్వల్పశ్రేణి బాలిస్టిక్ క్షిపణి. యుద్ధరంగాల్లో నేరుగా వినియోగించేందుకు వీలుగా దీనిని తయారుచేశారు. భారత వాయుసేన, సైన్యం అవసరాలకు తగినట్లు దీనిని తీర్చిదిద్దారు. ఇది 150 నుంచి 500 కిలోమీటర్ల లోపు లక్ష్యాలను ఛేదించగలదు. 350 నుంచి 700 కిలోల అణుశీర్షాలను మోసుకెళ్లగలదు. శత్రువుల కమాండ్ సెంటర్లు, లాజిస్టిక్స్ హబ్‌లను ఇది లక్ష్యంగా చేసుకోగలదు. వాహనాలపై ఉంచి దీన్ని ఎక్కడికంటే అక్కడికి తరలించడానికి అవకాశం ఉంది.

ప్రజాపక్షం
బుధవారం, 30 జులై

## బిహార్‌లో ఇసిఐ సంకటం

ఆగస్టు 1 బహు దగ్గరిలోకి వచ్చింది. బిహార్‌లో భారత ఎన్నికల కమిషన్ ఏకపక్షంగా చేబట్టిన ''ప్రత్యేక ముమ్మర రివిజన్'' (ఎస్ఐఆర్–సర్) ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటించటానికి అది నిర్దేశించిన రోజు అది. రెండో వైపున జనవరి 2025 నాటి ఓటర్ల జాబితాలో పేర్లు నమోదై ఉన్నవారిలో 65లక్షల మంది దరఖాస్తు ఫారాలు సమర్పించలేదని ఇసి అధికారికంగా చెబుతుండగా, దాదాపు కోటి మంది ఓట్ల తొలగింపునకు లగ్నం పెట్టారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అప్‌లోడ్ చేసిన దరఖాస్తుల్లో కూడా బూత్‌స్థాయి అధికారులనబడేవారే ఇంటింటికీ వెళ్లి వాకబు చేయకుండానే వారే వివరాలు నింపి వారే సంతకాలు చేసిన అక్రమాలు పెద్ద ఎత్తున జరిగినట్లు ఆరోపణలున్నాయి. సుప్రీంకోర్టు జులై 10న విచారణలో 'సలహాయిచ్చిన' ఆధార్, ఓటరు ఎపిక్‌కార్డు, రేషన్‌కార్డులను ఓటరు ధృవీకరణకు ఇసి అంగీకరించక పోవటం కూడా సమస్యాత్మకంగా మారింది. జులై 28న జరిగిన విచారణలో సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం మీరు అన్నట్లు ''రేషన్‌కార్డులకు సంబంధించి అవి సులభంగా ఫోర్జరీ చేయవచ్చు. కాని ఆధార్, ఎపిక్ కార్డులకు కొంత పవిత్రత ఉంది, అవి నిజమైనవనే భావన ఉంది''. వాటిని అంగీకరించండని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయ్‌మాల బాగ్చీలతో కూడిన ధర్మాసనం మరోసారి ఇసికి చెప్పింది. పైమూడు గుర్తింపు కార్డులు సులభంగా ఫోర్జరీ జరగవచ్చన్న ఇసి వాదన నేపథ్యంలో ధర్మాసనం పైవ్యాఖ్య చేసింది. అయితే ఈ పర్యాయం కూడా అది ఉత్తర్వు కాదు, సలహా పునరుద్ఘాటన మాత్రమే. పిటిషనర్‌లు భయపడుతున్నట్లు , భారీగా ఓట్ల తొలగింపు జరిగితే మొత్తం ఎస్ఐఆర్ ప్రక్రియను అక్కడికక్కడే రద్దు చేస్తామని ధర్మాసనం ఇసికి హెచ్చరిక చేసింది. తుది విచారణను ఆగస్టు 12,13 తేదీలకు మంగళవారం నాడు బెంచి వాయిదా వేసింది.

ఓటర్ల ధృవీకరణకు ఇసి ప్రకటించిన 11 ఆధారపత్రాలు ఫోర్జరీకి అవకాశం లేనివిగా అది భావించటం, ఎంతో కట్టుదిట్టమైన ఏర్పాట్లతో జారీ చేసే ఆధార్, ఇసియే స్వయంగా ఇచ్చే ఓటరు ఎపిక్ కార్డు ఫోర్జరీకి అవకాశమున్నవిగా ఎన్నికల కమిషన్ వాదించటమే వింత. జెడియు ఎంపి ఒకరు ఇలా వాఖ్యానించారు. ''క్షేత్రస్థాయి వాస్తవాలు ఇసికి తెలియవు. ఎస్ఐఆర్‌ను వారిపై రుద్దారు''. ఇది వాస్తవానికి దగ్గరిగా ఉంది. రాష్ట్రంలో ఒకవైపు వరదలు, మరోవైపు వ్యవసాయ పనులు, సహజంగానే పదుల లక్షల సంఖ్యలో బిహారీ శ్రామికులు పొట్టచేతబట్టుకుని వలస పోతుంటారు. ఇసి లెక్క ప్రకారమే 32 లక్షల మంది ఓటర్లు శాశ్వతంగా రాష్ట్రం నుంచి మకాం మార్చారు. వారే వలస కార్మికులు. ఈ పరిస్థితుల్లో ఓటర్లు నెలరోజుల వ్యవధిలో జనన, నివాస ధృవీకరణ పత్రాలు ఆర్‌డిఓ లేక మున్సిపాలిటీల నుంచి పొంది ఓటరు దఖాస్తు చేయటం సాధ్యమా? రాష్ట్రంలో నిరక్షరాస్యత, నిరుద్యోగం ఎక్కువ. పక్కా ఇళ్లు లేక గుడిసెల్లో తలదాచుకునే పేదలు ఎందరో! వారి నివాసాలకు ఇంటి నెంబర్లే ఉండవు, ఇక ధృవీకరణ ఎక్కడ నుంచి వస్తుంది. దళితులు, బిసిలు, మైనారిటీ ఓటర్లను పెద్ద ఎత్తున తొలగించి పాలక బిజెపి–జెడియు కూటమికి లబ్ధి చేకూర్చటానికి ఇప్పుడీ సమగ్ర రివిజన్ విన్యాసం చేపట్టారనే నిందకు ఇసిఐ గురైంది. నాలుగు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలుండగా ఈ తమాషాలో దురుద్దేశం తప్ప నిజాయితీ ఉందా? రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీలన్నీ ఈ ప్రక్రియను ఆదినుంచీ వ్యతిరేకిస్తున్నాయి. అవసరమైతే ఎన్నికలు బహిష్కరించే విషయం ఆలోచిస్తామంటున్నాయి.

ఆగస్టు నెల అంతా ముసాయిదా ఓటర్ల జాబితాలో చేర్పులు, తొలగింపులకు అవకాశం ఉంది. ఎన్నికల కమిషన్ ఇప్పటికైనా విజ్ఞత ప్రదర్శించి ఆధార్, ఓటరు కార్డులను ధృవీకరణ పత్రాలుగా అంగీకరిస్తే, జరిగిన తప్పులను దిద్దుకునే అవకాశం ఉంటుంది. ఎవరి ఆదేశాల ప్రకారమో మొండిగా పెద్ద ఎత్తున ఓటర్ల తొలగింపుకే నిబద్ధమైతే సుప్రీంకోర్టు ఆగ్రహానికి గురి కావచ్చు. అది మొదటికే మోసం తెస్తుంది. ఇప్పుడు బంతి ఇసి కోర్టులో ఉంది.

# రష్యా చమురుపై ఇయు ఆంక్షలు
# భారత్‌పై నిష్ఫలమా?



నంటూ బెనర్జీ

రష్యా చమురును బయటి దేశాలు కొనుగోలు చేయకుండా నిరోధించడానికి యూరోపియన్ యూనియన్ (ఇయు) చట్ట విరుద్ధంగా తనకు తానే అధికారాలను ఆపాదించుకున్నట్లు కనిపిస్తోంది. ఇయులో సభ్యత్వం లేని దేశాలపై తన అభిప్రాయాన్ని రుద్దేందుకు దానికి ఎలాంటి అధికారం లేదు. కాబట్టి, రష్యా ఇంధన ఎగుమతులను లక్ష్యంగా ఇయు ఆంక్షల తాజా విస్తరణ ఇయులోని 27 సభ్య దేశాలు, అందులో పనిచేసే సంస్థలకు మాత్రమే వర్తిస్తుంది. అంతకు మించి కాదు. ఇయు దేశాలకు విక్రయించే రష్యా చమురుపై ధరల నిర్ణయించడంలో పరిమితులు, షిప్పింగ్, బీమాపై ఆంక్షలు వంటి నిర్ణయాలను అమలు చేయడానికి ఇయుకు అధికారం ఉంది. అంతే తప్ప అంతర్జాతీయ మార్కెట్‌లో రష్యా చమురును ఇయు ఏతర దేశాలు కొనుగోలు చేయకుండా ఇయు ఏతర జెండా క్యారియర్లు, బీమా సంస్థలను ఉపయోగించుకొని ఇయు చట్టబద్ధంగా నిషేధించలేదు. భారతదేశం, చైనా వంటి దేశాలపై ఇయుకి ఎటువంటి అధికార పరిధి లేదు. గత జూన్ నెలలో రష్యా ముడి చమురు ఎగుమతులలో ఈ రెండు దేశాలు కలిసి దాదాపు 85 శాతం వాటాను కలిగి ఉన్నాయి.

గుజరాత్‌కు చెందిన నయరా ఎనర్జీ (గతంలో ఎస్సార్ ఆయిల్)ని మూసివేయడానికి ఇయు ప్రయత్నిస్తే అది చట్టవిరుద్ధం. ఇందులో రష్యా చమురు దిగ్గజం రోస్‌నెఫ్ట్ 49.13 శాతం వాటాను కలిగి ఉంది. లేదా రష్యా నుండి ముడి చమురును దిగుమతి చేసుకోకుండా భారతీయ చమురు శుద్ధి కర్మాగారాలను నిరోధించడానికి ప్రయత్నిస్తే అది కూడా చట్టవిరుద్ధం. రిలయెన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) శుద్ధి చేసిన ఉత్పత్తులను ప్రాసెస్ చేయడానికి, ఎగుమతి చేయడానికి రష్యా ముడి చమురును భారతదేశంలో అతిపెద్ద దిగుమతిదారు. లండన్ స్టాక్ ఎక్స్ఛేంజ్ గ్రూప్ (ఎల్ఎస్ఇజి) షిప్ ట్రాకింగ్ డేటా ప్రకారం, ఆర్ఐఎల్ ఈ ఏడాది మొదటి ఏడు నెలల్లో సగటున నెలకు 2.83 మిలియన్ బ్యారెళ్ల డీజిల్, 1.5 మిలియన్ బ్యారెళ్ల జెట్ ఇంధనాన్ని యూరప్‌కు రవాణా చేసింది. రోస్‌నెఫ్ట్ సింగపూర్‌లో తన అనుబంధ సంస్థ రోస్‌నెఫ్ట్ సింగపూర్ పిటిఇ. లిమిటెడ్ ద్వారా ప్రాంతీయ ప్రాజెక్టులను నిర్వహించడానికి, ఆసియా–పసిఫిక్ ప్రాంతంపై రోస్‌నెఫ్ట్ వ్యూహాత్మక దృష్టిలో భాగంగా చమురు, పెట్రోలియం ఉత్పత్తుల అంతర్జాతీయ వాణిజ్యాన్ని అభివృద్ధి చేయడానికి ఉద్దేశించబడింది. ఇది ఇంధన వినియోగంలో గణనీయమైన వృద్ధిని చూడవచ్చని అంచనా. ఇది చైనాలోని టియాంజిన్‌లో ఒక రిఫైనరీ, పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌ను నిర్మించడానికి పెట్రోచైనాతో ఒక జాయింట్ వెంచర్‌ను కూడా కలిగి ఉంది.

రష్యాకు వ్యతిరేకంగా జూలై 18న ఆమోదించబడిన తన 18వ ఆంక్షల ప్యాకేజీలో ఇయు మూడవ దేశాల నుండి రష్యా ముడి చమురు నుండి తయారైన శుద్ధి చేసిన పెట్రోలియం ఉత్పత్తుల దిగుమతులను నిషేధించింది. అయితే, భారతదేశం, చైనా తగ్గింపు ధరతో రష్యా ముడి చమురుని కొనుగోలు చేస్తూనే ఉంటాయని అంచనా. అయితే ఆర్ఐఎల్ వంటి కొన్ని భారతీయ శుద్ధి కర్మాగారాలు శుద్ధి చేసిన రష్యా ముడి చమురును ఇయు సభ్య దేశాలకు తిరిగి ఎగుమతి చేయడం కష్టంగా భావిస్తాయి.

ఇయు కొత్త ఆంక్షల తర్వాత మరింత రాయితీ ఇవ్వబడే శుద్ధి చేసిన రష్యా ముడి చమురు తిరిగి ఎగుమతి చేయడానికి ఆర్ఐఎల్ నూతన మార్గాలను లేదా కొత్త గమ్యస్థానాలను వెతుక్కోవాల్సి ఉంటుంది లేదా పెద్ద ఆర్థిక దెబ్బను ఎదుర్కోవలసి ఉంటుంది. మొత్తంగా, భారతీయ శుద్ధి కర్మాగార పరిశ్రమ కోరుకుంటే శుద్ధి చేసిన రష్యా ముడి చమురును తిరిగి ఎగుమతి చేయడానికి మార్గాలను కనుగొనవలసి ఉంటుంది. ఇది అంత సులభమైన పని కాకపోవచ్చు.



ఇది నార్వే, యుకె, స్విట్జర్లాండ్, కెనడా, యుఎస్ సహా కొన్ని పాశ్చాత్య దేశాలను మినహాయించింది. ఇది ఇయు పోర్టులు, డాక్‌లను అందుబాటులో చేయకుండా లేదా పాత చమురు ట్యాంకర్ల 'షాడో ఫ్లీట్' అని పిలవబడే వాటిని అడ్డుకోవడానికి షిప్‌టు షిప్ చమురు మార్పిడి చేపట్టకుండా నౌకలను నిషేధించింది. ఇవి రష్యా చమురును రవాణా చేయడానికి, ఆంక్షలను అధిగమించడానికి ఉపయోగించబడుతున్నాయని నివేదించబడింది. అమెరికా ఈ చర్యను కొంతవరకు ప్రతిఘటించిందని, ఇయు సొంతంగా ముందుకు సాగడానికి అనుమతించిందని గమనించాలి. ఎందుకంటే చమురు ఎక్కువగా డాలర్లలో వర్తకం చేయబడుతుంది. దీనికి చెల్లింపు క్లియరింగ్ అమెరికా బ్యాంకులచే నియంత్రించబడుతుంది. ఇయు కొత్త ఆంక్షల ప్యాకేజీ రష్యా చమురు, సహజవాయువు ఎగుమతులను దెబ్బతీయడం చాలా మటుకు అసంభవం.

భారతదేశం సంవత్సరానికి 15 బిలియన్ల విలువైన శుద్ధి చేసిన పెట్రోలియం ఉత్పత్తులను యూరప్‌కు సరఫరా చేసేది. భారతదేశం 2024–25లో రష్యా నుండి 50.3 బిలియన్‌ల అమెరికా డాలర్‌ల విలువైన ముడి చమురును దిగుమతి చేసుకుంది. భారతదేశం ముడి చమురు మొత్తంలో రష్యా చమురు వాటా 44 శాతం కంటే ఎక్కువ. అనేక ఇయు ఏతర దేశాలు శుద్ధి చేసిన ముడి చమురును, ముఖ్యంగా రష్యా ముడి చమురు నుండి పొందిన శుద్ధి చేసిన పెట్రోలియం ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటాయి. రష్యా ముడి చమురు,శుద్ధి చేసిన ఉత్పత్తులకు భారతదేశం, చైనా, టర్కీ ముఖ్యమైన కొనుగోలుదారులు. ఇతర ముఖ్యమైన శ్రుద్ధి చేసిన ముడి చమురు దిగుమతిదారులు దక్షిణ కొరియా, తైవాన్. ఇయు ఆంక్షల తాజా ప్యాకేజీ రష్యా ముడి చమురును మరింత చౌకగా మారుస్తుంది. ఇది రష్యా ముడి ధరను బ్యారెల్‌కు 60 డాలర్‌ల నుండి 47.60 డాలర్‌లకి తగ్గిస్తుంది. సెప్టెంబర్ 3న అమలులోకి వచ్చే కొత్త పరిమితి, ఇది ఎల్లప్పుడూ సగటు రష్యా ముడి ధరల కంటే 15 శాతం తక్కువగా ఉండేలా చూసే వ్యవస్థను కూడా కలిగి ఉంది.

అంతర్జాతీయ ఇంధన సంస్థ (ఐఇఎ) ప్రకారం, రష్యా గత సంవత్సరం చమురు అమ్మకం ద్వారా సుమారు 192 బిలియన్‌ల అమెరికా డాలర్లను సంపాదించింది. అందులో కొంత భాగాన్ని తగ్గించడం ద్వారా ఆ దేశం ఎగుమతి ఆదాయానికి నష్టాన్ని కలిగించవచ్చు, కానీ రష్యా రోజుకు ఏడు మిలియన్ బ్యారెళ్ళకు పైగా చమురు ఎగుమతి అకస్మాత్తుగా నిలిచిపోతే, ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు పెరగడం ద్వారా మిగిలిన ప్రపంచానికి కూడా నష్టం కలిగించవచ్చు. ఏదేమైనా, రష్యా చమురును ప్రధానంగా దిగుమతి చేసుకునే రెండు దేశాలు భారతదేశం, చైనాలు రష్యా చమురు దిగుమతిపై ఇయు విధించిన 'యూనివర్సల్ బ్యాన్ (సార్వత్రిక నిషేధం)' లేదా రష్యా–ఉక్రెయిన్ యుద్ధంలో సంధిలో భాగంగా అమెరికా అలాంటి నిషేధాన్ని బలవంతంగా ఆదేశించే ముప్పుకు లోబడి ఉండవు. యాదృచ్ఛికంగా, భారతదేశం, చైనా రెండూ ఉక్రెయిన్‌తో మంచి సంబంధాలను కలిగి ఉన్నాయి. గత సంవత్సరం, ఉక్రెయిన్ నుండి భారతదేశం దిగుమతులు 1.036 బిలియన్‌ల అమెరికన్ డాలర్లు కాగా, ఉక్రెయిన్‌కు భారతదేశం ఎగుమతులు 0.187 బిలియన్‌ల అమెరికన్ డాలర్లు. అదే కాలానికి రెండు దేశాల మధ్య మొత్తం వాణిజ్య టర్నోవర్ 1.224 4బిలియన్ డాలరు యుఎన్ కామ్‌ట్రేడ్ డేటా ప్రకారం, ఉక్రెయిన్ నుండి చైనా దిగుమతులుమొత్తం2.68 బిలియన్‌ల అమెరికన్ డాలర్లు.

ఇప్పటివరకు, రష్యా చమురు, సహజ వాయువు ఎగుమతులపై ఇయు నిషేధంతో భారతదేశం, చైనా రెండూ ప్రభావితం అయినట్లు కనిపించడం లేదు. భారతదేశ పెట్రోలియం మంత్రి హర్‌దీప్ సింగ్ పురి మార్కెట్ దాదాపు సాధారణంగా పని చేయడం కొనసాగిస్తుందని భావిస్తున్నారు. రోస్‌నెఫ్ట్‌పై ఇయు దృష్టి ఆందోళన కలిగిస్తుంది. రష్యా చమురు ఎగుమతులపై నిషేధాన్ని మరింత కఠినతరం చేయాలని ఇయు ఆలోచించకముందే, నయారా ఎనర్జీలో తన మెజారిటీ వాటాను విక్రయించడానికి ఆర్ఐఎల్ తో సహా కొంతమంది భారతీయ కొనుగోలుదారులతో రోస్‌నెఫ్ట్ చర్చలు జరుపుతున్నట్లు భావించారు. రష్యాపై ఇయు కొత్త ఆంక్షల ప్రకటన తర్వాత చమురు మార్కెట్లు కఠినం కాలేదని భారతీయ పెట్రోలియం మంత్రి మామూలుగానే సంతోషంగా ఉన్నట్లు కనిపిస్తోంది. ఇయుకి భారతదేశం 15బిలియన్ల అమెరికన్ డాలర్ల శుద్ధి చేసిన పెట్రో ఉత్పత్తుల ఎగుమతి దెబ్బతిన్నప్పటికీ, దేశం ఇప్పటికే శుద్ధి చేసిన పెట్రోలియం ఎగుమతికి కొత్త మార్కెట్లను అన్వేషిస్తోంది. గత సంవత్సరం ఎగుమతి ఆదాయం 85 బిలియన్ డాలర్లు. ప్రస్తుత భౌగోళిక రాజకీయ పరిస్థితుల దృష్ట్యా, దిగుమతి ఆధారిత భారతదేశం తన ఇంధన భద్రతను అలాగే ఎగుమతి వాణిజ్యాన్ని రక్షించుకోవడానికి బలమైన వ్యూహాన్ని రూపొందించాలి.

## ఈ మరణాలను ఆపేదెలా?

కళాశాలల్లో, కోచింగ్ సెంటర్లలో మార్కుల కోసం, ర్యాంకుల కోసం జరిగే తీవ్రమైన పోటీలో ఎంతో మంది యువత తమ చిరునవ్వులు పోగొట్టుకుంటున్నారు. వారి మనసులలో పేరుకుపోయిన ఒత్తిడి, బయటకు చెప్పుకోలేని బాధ, చివరికి ప్రాణాలు తీసుకోవడానికి దారితీస్తోంది. ఈ భయంకరమైన పరిస్థితిని గుర్తించిన సుప్రీంకోర్టు 25జూలై 2025న కీలకమైన తీర్పు ఇచ్చింది. 'నేర్చుకోవడంలో ఆనందం పోయి, ర్యాంకులు, ఫలితాలు, నిరంతర పోటీ ఆందోళనగా మారిపోయింది' అని న్యాయమూర్తులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై మద్దతు ఇవ్వడానికి, ఆత్మహత్యలను నివారించడానికి దేశంలో సమగ్రమైన, అమలు చేయదగిన చట్టపరమైన నియంత్రణలు లేవని కోర్టు లోతుగా విశ్లేషించింది. విద్యార్థుల ఆత్మహత్యలను ఆపడానికి 15 ముఖ్యమైన సూత్రాలతో కూడిన ఒక ప్రణాళికను ప్రకటించింది. విద్య అంటే కేవలం చదువు మాత్రమే కాదు, పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యం కూడా ముఖ్యమని ఈ తీర్పు తేటతెల్లం చేసింది.

### గణాంకాలు చెప్పే కఠిన వాస్తవం:

జాతీయ నేర గణాంక సంస్థ 2022 నాటి 'యాక్సిడెంటల్ డెత్స్ అండ్ సూసైడ్స్ ఇన్ ఇండియా' నివేదిక మన దేశంలో ఆత్మహత్య చేసుకున్న వారిలో 7.6%మంది విద్యార్థులే అని పేర్కొంది. 2022లో సుమారు 13,044 మంది విద్యార్థులు తమ ప్రాణాలు తీసుకున్నారు. వీరిలో 2,248 మంది కేవలం పరీక్షలలో ఫెయిల్ అవడం వల్లే చనిపోయారని స్పష్టం చేసింది. 2001లో 5,425 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకోగా 2022 నాటికి ఈ సంఖ్య 13,044కి చేరింది. నియంత్రణ లేని కోచింగ్ పరిశ్రమ ఎలా యువత జీవితాలను ప్రమాదంలో పడేస్తుందో విశ్లేషిస్తుంది.

### సుప్రీంకోర్టు జోక్యం ఎందుకు?

ఈ తీర్పునకు తక్షణ కారణం, సుక్దేబ్ సాహా అనే ఒక తండ్రి తన కుమార్తెకు జరిగిన అన్యాయంపై చేసిన పోరాటం. విశాఖపట్నంలోని ఒక కోచింగ్ సెంటర్‌లో నీట్ కోసం చదువుతున్న అతని 17 ఏళ్ల కుమార్తె 2023 జూలై 14న హాస్టల్ పైకప్పు నుండి పడిపోయి అనుమానాస్పదంగా మరణించింది. ఈ సంఘటనపై పోలీసులు సరిగా విచారించడం లేదని కోచింగ్ సెంటర్ యాజమాన్యం నిజాలను దాచిపెడుతోందని ఆరోపిస్తూ సాహా హైకోర్టును ఆశ్రయించారు. అక్కడ న్యాయం జరగకపోవడంతో చివరికి సుప్రీం కోర్టుకు వచ్చారు. ఈ కేసును విచారించిన జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం, ఆ ఒక్క సంఘటనను కేవలం వ్యక్తిగత విషాదంగా చూడకుండా అది దేశవ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న మానసిక సంక్షోభానికి, విద్యావ్యవస్థలోని 'వ్యవస్థాగత లోపం'కు నిదర్శనంగా విశ్లేషించింది. పోలీసు దర్యాప్తులో 'లోతైన లోపాలు' ఉన్నాయని, 'కీలక ఆధారాలను దాచిపెట్టే అవకాశం' ఉందని గమనించి సీబీఐ విచారణకు ఆదేశించడం ద్వారా వ్యవస్థల మధ్య జవాబుదారీతనం లేకపోవడం పైనా కోర్టు పరోక్షంగా దృష్టి సారించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21, జీవించే హక్కు పరిధిలో మానసిక ఆరోగ్యం ఒక అంతర్భాగమని కోర్టు స్పష్టం చేసింది. ఈ హక్కును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, అందుకే ఈ ఆదేశాలను జారీ చేయాల్సి వచ్చిందని పేర్కొంది.

### సంస్థలే జవాబుదారీ వహించాలి:

విద్యార్థుల సమస్యలు విద్యా సంస్థలు పట్టించుకోకపోయినా, ఆ నిర్లక్ష్యం ఆత్మహత్యకు దారితీస్తే, ఆ సంస్థలే బాధ్యత వహించాలని సుప్రీంకోర్టు గట్టిగా హెచ్చరించింది. ఈ తీర్పు విద్యార్థుల మానసిక ఆరోగ్యం మరియు శ్రేయస్సును కాపాడటానికి ఒక బహుళరంగ విధానాన్ని ప్రతిబింబిస్తుంది, ప్రతి సూత్రం ఒక నిర్దిష్ట సమస్యను పరిష్కరించడానికి రూపొందించబడింది. అన్ని విద్యాసంస్థలు, కోచింగ్ సెంటర్లు ఒకే రకమైన మానసిక ఆరోగ్య విధానాన్ని పాటించాలి. ఇది దేశవ్యాప్తంగా మానసిక ఆరోగ్యానికి ఒక ప్రామాణిక విధానాన్ని ఏర్పాటు చేయాలి. 100 మందికి పైగా విద్యార్థులున్న ప్రతి విద్యా సంస్థలో కనీసం ఒక అర్హత కలిగిన కౌన్సెలర్, సైకాలజిస్ట్‌ను తప్పనిసరిగా నియమించాలి. చిన్న సంస్థలు తగినంత మంది కౌన్సెలర్‌లు ఉండేలా చూసుకోవాలి. పరీక్షా సమయాల్లో విద్యార్థి బృందాలకు మెంటార్‌లను కేటాయించాలి. మానసిక ఆరోగ్య సేవలు, స్థానిక ఆసుపత్రులు, ఆత్మహత్య నివారణ హెల్ప్‌లైన్‌లకు తక్షణ రెఫరల్ కోసం అన్ని విద్యా సంస్థలు ప్రోటోకాల్‌లను ఏర్పాటు చేయాలి.

వార్షిక తనిఖీలు జవాబుదారీతనాన్ని పెంచుతాయి. కేవలం మార్కుల వెనుక పరిగెత్తే ధోరణిని వదిలిపెట్టి, పిల్లల సమగ్ర అభివృద్ధికి, మానసిక స్థితిస్థాపకతను ప్రోత్సహించే విద్య వైపు మన సమాజం మళ్లినప్పుడే సాధ్యమవుతుంది.

— జనక మోహన రావు దుంగ
8247045230

## స్నేహం ఓ అద్వితీయ అమృతహస్తం

స్నేహం చేయని మనిషి ఉండడు. స్నేహితులు లేని తనువు ఉండదు. ప్రతి వ్యక్తి జీవితంలో స్నేహానికి ఓ ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. స్నేహితుల హస్తాలు నిస్వార్థ నేస్తాలు. బంధువులతో లేని ఓ అపురూపమైన అనుబంధం స్నేహితులతో ఉంటుంది. కొన్ని సమయాల్లో కుటుంబ సభ్యులతో పంచుకోలేని విషయాలను సహితం స్నేహితులతో పంచుకుంటాం. మనకు స్నేహితులు అనేకులు ఉండవచ్చు కాని ప్రాణ మిత్రులు కొద్ది మంది మాత్రమే ఉంటా రు. ప్రాణ స్నేహితులతో మనం అన్ని విషయాలను దాపరికం లేకుండా పంచుకుంటాం. స్నేహం అంటే ఓ త్యాగం, ఆపదలో అభయ హస్తం, కష్టాల్లో ఓ శీతల నేస్తం, ఆపదలో సాంత్వన చేకూర్చే మహా వృక్షం. ప్రాణ స్నేహితులకు ప్రత్యామ్నాయం ఉండదు. మనసుకు ప్రశాంతత, శరీరానికి ఉపశమనం కలిగిస్తుంది స్నేహ హస్తం. సహానుభూతికి ఓ చక్కని ఉదాహరణ స్నేహం. పరస్పర గౌరవానికి, త్యాగానికి చిరునామా ఫ్రెండ్‌షిప్. సన్నిహిత మిత్రుడు అంటే ఓ మహా నమ్మకం. స్నేహానికి వయోభేదం లేదు. చంటి వాడి నుంచి పండు ముసలి వరకు అందరికీ స్నేహితులు ఉంటా రు, వద్దన్నా ఆనందాలను వడ్డిస్తూ ఉంటారు. స్నేహం విలువను తెలుసుకోవడం, మంచి స్నేహితులతో సంబంధాలు కొనసాగించడం, అపార్థాలను నివృత్తి చేసుకొని స్నేహాన్ని కొనసాగించడం, భేదాభిప్రాయాలను దూరం చేసుకోవడం. పౌర సమాజంలో శాంతి పందిరి వేయడానికి అనుకూలమైన అనువైన సందర్భంగా ప్రతి ఏట జులై 30న అంతర్జాతీయ స్నేహ దినోత్సవం (ఇంటర్నేషనల్ ఫ్రెండ్‌షిప్ డే) పాటించాలని 2011లో ఐరాస తీర్మానం చేయడం, ప్రతి ఏట పాటించడం కొనసాగుతున్నది. 2025 అంతర్జాతీయ స్నేహ దినం ఇతివృత్తంగా స్నేహం : శాంతి, సంఘీభావం, సంస్కృతుల మధ్య అవగాహనలను పెం పొందించే వారధి అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహించడం జరుగుతోంది.



వివిధ దేశాలు, జాతులు, మతాలు, కులాలు, అసమానతలను మరిచి అందరం స్నేహ బంధంతో ఏకం కావడమే లక్ష్యంగా ఈ దినోత్సవాన్ని జరుపుకుంటాం. స్నేహ బంధం పరమ పవిత్రమైనది. నిజమైన స్నేహితుల మధ్య విడదీయరాని ప్రేమ అనే అభేద్య బంధం పెనవేసుకొని ఉంటుంది. మంచి స్నేహితులు కొన్ని విషయాల్లో విభేదించినా, సదా ఒక్కటిగానే ఉంటారు.

చిన్ననాడే స్నేహం అనే బంధం మొలకెత్తుతుంది. అమ్మనాన్న తర్వాత మన సంక్షేమాన్ని, శ్రేయస్సును నిస్వార్థంగా తలుస్తూ మన వెంట నడిచే వ్యక్తులు మన ప్రాణ మిత్రులు మాత్రమే. బడికి వెళ్లడంతో మనకు నూతన స్నేహితులు పుడతారు. వారితోనే మన దినచర్య ముడిపడి ఉంటుంది. చదవడం, ఆడడం, పాడడం, మాట్లాడుకోవడం, సరదాగా తిరగడం లాంటివి మన ప్రాణ స్నేహితులతోనే ముడిపడి ఉంటాయి. ఒకే కంచంలో తిని ఒకే మంచంలో పడుకునే స్థాయికి స్నేహం ఎదుగుతుంది. తరగతులు పెరిగిన కొద్దీ తరగతులు మారుతూ, కొత్త మిత్రులు వచ్చి చేరతారు. పాత మిత్రుల స్నేహం కొనసాగుతూనే ఉంటుంది. స్నేహితులు పెరిగిన కొద్దీ బయటి ప్రపంచం కొత్తగా కనిపిస్తుంది. అందరి సంస్కృతీ వారసత్వాలు అర్థం అవుతాయి. మన జీవితానికి లక్ష్యాలను కూడా మిత్రులు నిర్ణయించుకునే స్థాయి కూడా వస్తుంది.

అంతర్జాతీయ స్నేహ దినం వేదికగా పాత మిత్రులను కలవడం, కొత్త మిత్రులతో సరదాగా గడపడం, ఆపాత మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకోవడం, ఫ్రెండ్‌షిప్ బ్యాండ్స్ పంచుకోవడం, తమ తమ అనుభవాలను పంచుకోవడం, స్నేహితుల కష్టాలను తెలుసుకొని సహాయం చేయడం, సామాజిక మాధ్యమాల్లో స్నేహ బంధాల విలువను వివరించడం, పాత స్నేహితులతో ఉన్న ఫోటోలను పంచుకోవడం, హాపీ ఫ్రెండ్‌షిప్ డే శుభాకాంక్షలు చెప్పుకోవడం లాంటి కార్యక్రమాలను నిర్వహించుకోవచ్చు.

— బి.ఎం
9949700037

## సరోగసి అంటే వ్యాపారమా?



అంజాద్ మియా
9000517186
(హైదరాబాద్)

మాతృత్వం అనేది వర్ణనాతీతమైన అనుభూతి. జీవితంలో అపరిమితమైన ప్రేమ, త్యాగం, కృషి, దయ, ఆరాధనలాంటి అద్భుతమైన గుణాల కలయికల సంగమం ఒక తల్లి మాత్రమే. తన పిల్లల కోసం తన జీవితాన్ని సంపూర్ణంగా అర్పిస్తుంది మాతృమూర్తి. తల్లి గొప్పతనం చెప్పకుండానే మనసుకు అర్థమవుతుంది. ఆమె ప్రేమకి, దయకి, అంకితభావానికి ప్రపంచంలో ఎటువంటి పదాలు తగవు. అలాంటి అమ్మ ప్రేమ అంగట్లో అరువుగా అమ్ముతూ సొమ్ము చేసుకుంటూ అమ్మ ప్రేమకే మచ్చగా మారుతున్నారు కొందరు. అవునూ, ఈ మధ్యకాలంలో సరోగాసి అనే కొత్త వ్యాపారం చాప కింద నీరుల వ్యాప్తి చెందుతూ సంవత్సరానికి కొన్ని వేల కోట్ల వ్యాపార స్థావరంగా మారి అమాయక ప్రజల జీవితాల చిచ్చుల రాజేస్తోంది. దానికి ప్రత్యక్ష నిదర్శనంగా సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌లో జరిగిన ఘటనను చెప్పవచ్చు. అసలు ఈ టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌లో ఏం జరిగింది. ఇంతకీ సరోగసి అంటే ఏంటి.? దేశం మొత్తంలో ఇలాంటి టెస్ట్‌ట్యూబ్ బేబీ సెంటర్లు ఎన్ని ఉన్నాయి. వాటిలో ఏంచేస్తుంటారు..? మన చట్టాలు ఏం చెప్తున్నాయి. మొదలైన విషయాలు తెలుసుకుందాం..!

సరోగసి అంటే అద్దెగర్భం. అంటే ఏదైనా కారణం చేత తన సొంత గర్భం ద్వారా కాకుండా మరో మహిళా యొక్క గర్భం ద్వారా పిల్లల్ని కనడం. దీనినే సరోగసి అంటారు. ఈ సరోగసి అనేది మన ప్రాచీనకాలం నుండే కొనసాగుతూ వస్తున్న విధానంగా చెప్పవచ్చు. ఒకసారి మన పురాణాలు ఇతిహాసాలను గమనించినట్లయితే మనకు ఈ సరోగసి అక్కడక్కడ దర్శనమిస్తుంది. అయితే లిఖితపూర్వకమైన ఆధారాలు 17వ శతాబ్దంలో బాబ్లియోన్ (ప్రస్తుత ఇరాక్) సంస్కృతిలో లభించాయి. ఎవరికైతే పిల్లలు జన్మించలేదో వారు విడాకులు తీసుకోకుండా వేరే మహిళతో పిల్లలను కనవచ్చు అని చారిత్రాత్మక ఆధారాలు లభించాయి. ఆ తర్వాత ప్రపంచవ్యాప్తంగా అనేక పరిశోధనలు జరిగాయి. ఫలితంగా 1978లో లండన్‌లో లూయిస్ జాయ్ బ్రౌన్ అనే మొట్ట మొదటి టెస్ట్ ట్యూబ్ బేబీ జన్మించాడు. ఆ తర్వాత అమెరికాలో 1985లో మొట్టమొదటిసారి ఈ సరోగసిపై కేసు నమోదైయింది. ఇక అప్పునుండి నేటి వరకి ఈ సరోగసి అనే విధానం బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. అయితే ఇక్కడ ప్రశ్న ఉత్పన్నమవుతుంది, సరోగసి ఎలా చేస్తారు, అది ఎన్ని రకాలుగా ఉంటుంది, భారతదేశంలో ఈ సరోగసికి అనుమతి ఉందా.? భారతీయ చట్టాలు ఏం చెప్తున్నాయి తెలుసుకుందాం.? సాధారణంగా సరోగసి రెండు రకాలుగా ఉంటుం ది. ఒకటి జెస్టేషనల్ సరోగసి, రెండోది బయోలాజికల్ సరోగసి. జెస్టేషనల్ సరోగసి ఈ పద్ధతిలో భార్య భర్తల నుండి అంటే భర్త నుండి వీర్యాన్ని భార్య అండాన్ని తీసుకొని ల్యాబ్‌లో ఫలదీకరణం చేస్తారు. అలా ఫలదీకరణం చేసిన పిండాన్ని ఎవరైతే ఈ సరోగసికి సానుకూలంగా ఒప్పుకుంటారో ఆమె గర్భంలోకి ప్రవేశపెడతారు. ఈ పద్ధతిలో గర్భంతో ఉన్న మహిళకు ఆమె కడుపులో ఉన్న బిడ్డకు ఎలాంటి జన్యుపరమైన సంబంధం ఉండదు. కేవలం గర్భం మాత్రమే ఆమెది ఉంటుంది. 9 నెలల తర్వాత ఆ బిడ్డను కని అసలైన తల్లిదండ్రులకు ఇవ్వడం జరుగుతుంది. ఇక బయోలాజికల్ సరోగసి అంటే ఒక భార్యాభర్తల జంటలో ఏదైనా అనారోగ్య సమస్యల కారణంగా భార్యకు అండాల ఉత్పత్తి ఆగిపోయినట్లయితే లేదా ఇతర అనారోగ్య సమస్యలు ఉంటే కేవలం భర్త యొక్క వీర్యాన్ని తీసుకొని ఎవరైతే ఈ సరోగసికి సానుకూలంగా ఉంటారో ఆ మహిళ నుండి అండాలను స్వీకరించి ల్యాబ్‌లో ఫలదీకరణం చేస్తారు. అలా ఫలదీకరణం చేసిన అండం పిండంగా మారినప్పుడు ఆ పిండాన్ని ఆ సదరు మహిళ గర్భంలోకి ప్రవేశపెడతారు. ఈ ప్రక్రియనే బయాలజికల్ సరోగసి అంటారు. ఈ పద్ధతిలో అండం గర్భం రెండు ఒకే మహిళకు సంబంధించి ఉంటాయి కాబట్టి ఈ విధానంలో భార్య కేవలం నామమాత్రపు పాత్ర పోషిస్తుంది. పూర్తి బాధ్యత అంతా సరోగేట్ తల్లిపై ఉంటుంది.



అయితే ఈ తతంగం అంతా చాలా సమయంతో డబ్బుతో కూడుకున్న వ్యవహారం కాబట్టి ఈ సరోగసికి సులువైన మార్గం మానవ అక్రమ రవాణా అంటే ఒక స్త్రీని కొన్ని రోజుల పాటు అద్దెకు తీసుకుని ఆమెతో కొంత కాలం సహజీవనం చేసిన తర్వాత ఏ పిల్లనో, పిల్లాడో పుట్టిన వెంటనే ఆ బిడ్డను తీసుకొని వెళ్లిపోవడం అన్నమాట. ఈ సరోగసి ప్రోత్సహించే క్లినిక్‌లు దేశవ్యాప్తంగా కొకోల్లలుగా ఉన్నాయి. ఈ క్లినిక్‌లు నిరుపేద స్త్రీలనే ప్రధానంగా టార్గెట్ చేసుకొని ఎవరైతే ధనవంతులుగా ఉండి, పిల్లలు కలుగని వారై ఉంటారో వారినుండి లక్షల్లో వసూలు చేసి, నిరుపేద స్త్రీలకు డబ్బులు ఆశచూపించి ఈ సరోగసికి ఒప్పిస్తారు. ఈ పద్ధతి ద్వారా గర్భం దాల్చిన ఆమెను కొంతకాలం తమ పర్యవేక్షణలో ఉంచుకొని బిడ్డ పుట్టిన తర్వాత కొంతమొత్తంలో ఆమెకు అప్పజెప్పి ఆమెను బయటికి గెంటేస్తారు. ఆ తర్వాత ఆమెకు దేవుడే దిక్కు. ఈ విధంగా పుట్టిన పిల్లలకు మగబిడ్డ అయితే ఒకరేటు. ఆడపిల్ల అయితే ఒక రేటు చొప్పున అమ్మేస్తుంటారు. ఈ మధ్య బాలీవుడ్ సెలబ్రెటీలైన తుషార్ కపూర్, కరణ్ జోహార్, షారూఖ్ ఖాన్, అమీర్ ఖాన్ లాంటి వారు ఈ పద్ధతి వైపు మొగ్గుచూపించడం ద్వారా ఈ వ్యాపారానికి ఇంకా డిమాండ్ పెరిగిందని చెప్పవచ్చు. మన కండల వీరుడైన సల్మాన్ ఖాన్ సైతం పెళ్లి వద్దు, సరోగసి ముద్దు అని పేర్కొన్నాడు.

ఈ సరోగసి వ్యాపారాన్ని నివారించడానికి కేంద్ర ప్రభుత్వం 2021 చట్టం చేసి కొన్ని కఠినమైన ఆంక్షలు, నియమ నిబంధనలు విధించినప్పటికి గుట్టుచప్పుడు కాకుండా ఈ వ్యాపారం ఇంకా జోరుగా కొనసాగుతూనే ఉంది. కోట్లలో డబ్బులు చేతులు మారుతూ అమాయక ప్రజల జీవితాలను బుగ్గిపాలు చేస్తున్నారు. లేకపోతే బీరు బిర్యానీ ఇచ్చి పురుషుల వీర్యాన్ని తీసుకొని వేరే మహిళ అండాలతో ఫలదీకరణం చేయడం ఏంటండీ.? సిగ్గుచేటు కాకపోతే. సరోగసి అంటే అమ్మ అనే పిలుపుకోసం పరితపించే వారి ఆకాంక్షలను నెరవేర్చే సుమార్గం. అలాంటి మార్గాన్ని డబ్బుకోసం ఇంత నీచంగా మార్చి సొమ్ము చేసుకోవడం అనేది ఏమాత్రం తగదు. ఇప్పటికైనా మన ప్రభుత్వాలు మేల్కొని ఈ సరోగసి క్లినిక్‌ల పట్ల కఠినంగా వ్యవహరిస్తూ అమాయక ప్రజలు జీవితంలో వెలుగులు నింపాలని ఆశిద్దాం...!

## విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

ప్రజాపక్షం/ కాగజ్‌నగర్ రూరల్ : విద్యార్థుల విద్య పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలని కాగజ్‌నగర్ మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ అన్నారు. మంగళవారం కాగజ్‌నగర్ మండలంలోని ఎంపియూపిఎస్ అంకుసాపూర్, ఎంపిపిఎస్ అంకుసాపూర్ కాలనీ, ఎంపిపిఎస్ మారెపల్లి పాఠశాలలను స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వెంకటరాజయ్యతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలో విద్యార్థుల అభ్యాస ఫలితాలు పరిశీలించారు. ఉపాధ్యాయుల బోధనను ప్రత్యేక్షకంగా వీక్షించి పలు సూచనలు సలహాలు చేశారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరీక్షించారు. విద్యార్థులు ప్రతీ రోజు పాఠశాలలకు వచ్చేలా చూడాలని అన్నారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి వర్షాకాలం దృష్ట్యా విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా పరిశుభ్రత పాటించాలని అన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని సూచించారు. మారెపల్లి పాఠశాలలో భవన సమస్యల నేపథ్యంలో విద్యార్థుల భద్రత, శ్రేయస్సు పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులు ఉపేంద్రను ఆదేశించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

## అగ్రికల్చర్ కాలేజీ నిర్మాణానికి స్థల పరిశీలన



ప్రజాపక్షం/బోధన్ : బోధన్ నియోజకవర్గం పరిధిలోని రుద్రూర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం ఆవరణలో బియస్సీ అగ్రికల్చర్ కాలేజీ నిర్మాణ స్థలాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. కాలేజీ నిర్మాణంతో ఈ ప్రాంతంలో యువతకు మంచి విద్యా అవకాశాలు లభించనున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. ఆయన వెంట ఫుడ్ సైన్స్, టెక్నాలజీ కాలేజీ ప్రిన్సిపల్ వెంకట్ రెడ్డి, పరిశోధన కేంద్రం అధికారి సమత పరమేశ్వరి, రుద్రూర్ మండల ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## ఫిల్టర్‌బెడ్‌లు పరిశీలించిన ఎఐటియుసి నాయకులు



ప్రజాపక్షం/మందమర్రి : మందమర్రి ఏరియాలో ఏర్పాటు చేసిన ఫిల్టర్ బెడ్‌లను ఎఐటియుసి నాయకులు, సివిల్ డిపార్ట్‌మెంట్ అధికారులు మంగళవారం పరిశీలించారు. చతులాపూర్ సమీపంలో రూ.9 కోట్లతో నిర్మించిన మూడు బోర్ల ద్వారా 3ఏ ఫిల్టర్ బెడ్‌కు నీటిని పంపి శుద్ధి చేసి కాలనీలకు సరఫరా చేస్తున్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ భీమనాధుని సుదర్శన్, సివిల్ ఫిట్ కార్యదర్శి కలవల శ్రీనివాస్, ఏరియా నాయకుడు తిరుపతి, సివిల్ అధికారులు రాకేష్, సిబ్బంది పాల్గొన్నారు. శుద్ధి చేసిన నీటిని టెస్టింగ్‌కు పంపారు. కార్మికుల కోసం తాగునీటి సరఫరా కల్పించిన జిఎం దేవేందర్, సివిల్ అధికారి రాములకు ఎఐటియుసి నాయకులు ధన్యవాదాలు తెలిపారు.

## సరిహద్దుల్లో వాహనాల తనిఖీలు



ప్రజాపక్షం/కోటపల్లి /చెన్నూర్ : మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో చెన్నూర్ రూరల్ పోలీసులు అప్రమత్తమయ్యారు. రామగుండం కమిషనర్, మంచిర్యాల డిసిపి, జైపూర్ ఎసిపి ఆదేశాల మేరకు చెన్నూర్ రూరల సిఐ, కోటపల్లి ఎస్ఐ ఆధ్వర్యంలో సరిహద్దు గ్రామాల్లో పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. అనుమానితుల సమాచారిన్న సేకరిస్తూ, అవసరమైతే వివరాలు నమోదు చేస్తున్నారు. ప్రజల రక్షణ భద్రత తమ బాధ్యతని పోలీసులు పేర్కొన్నారు

## పర్యావరణ రక్షణకు పులులు సంరక్షణ




ప్రజాపక్షం/సిర్పూర్(టి) : అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో మంగళవారం మండల ఫారెస్ట్ రేంజ్ కార్యాలయం నుంచి జడ్‌పి పాఠశాల విద్యార్థులతో బస్టాప్ చౌరస్తా వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ అంతరించిపోతున్న జాతుల్లో పులి ఒకటని, వాటి సంరక్షణతో పర్యావరణ సమతుల్యతను కాపాడొచ్చు అని తెలిపారు. భవిష్యత్ తరాలకు ప్రకృతిని సురక్షితంగా అందించాలంటే పులులను కాపాడాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఓ శశిధర్, ఎఫ్ఎస్ఓ లు తులసిదాస్, తిరుపతి, అతరుద్దీన్, ప్రసాద్ రావు, మోతిలాల్, వందన, ఎఫ్‌డిఓలు లక్ష్మి , రవినా జాదవ్, శ్రీదేవి, అనూష, సంతోష్, మల్లికార్జున్, అరవింద్, అరుణ్‌రెడ్డి, ఫారెస్ట్ వాచర్లు పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థి ఒక మొక్క నాటాలి



ప్రజాపక్షం/జన్నారం : పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి విద్యార్థి ఒక మొక్క నాటాలని ఇందన్‌పల్లి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీధరచారి సూచించారు. ప్రపంచ పులుల దినోత్సవం సందర్భంగా కలమడుగు ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రధానోపాధ్యాయుడు కట్ట రాజమౌళి మాట్లాడుతూ పిల్లలకు పౌష్టికాహారం అందించి ఆరోగ్యంగా పెరిగేలా చూడాలని, ఉదయం వేళల్లో చదువుకునే అలవాటు పెంచాలని, పదవ తరగతి విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులకు నిత్యం హాజరయ్యేలా తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలి అన్నారు. ఎఫ్ఆర్ఓ మాట్లాడుతూ విద్యార్థులు గురువుల పట్ల గౌరవం చూపాలని, అది వారికి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు దారి తీస్తుందని అన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ మన బాధ్యత

సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ శ్రీనివాస్



ప్రజాపక్షం/శ్రీరాంపూర్ : రాబోయే తరాల ఆరోగ్యకర భవిష్యత్తు కోసం పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం వన మహోత్సవం సందర్భంగా ఇందారం ఉపరితల గనిలోని బలరామ జలది వద్ద వంద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జన్మదినాన్ని పురస్కరించుకుని మొక్కలు నాటడం ఎంతో సంతోషదాయమన్నారు. కాలుష్య నివారణకు ప్రతీ ఒక్కరు భాగస్వాములై మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. సంస్థ తరపున ప్రతీ సంవత్సరం వేల ఎకరాల్లో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్ఓటు జిఎం ఎన్.సత్యనారాయణ, అధికారుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, ఎజిఎం ఫైనాన్స్ భీభత్స, ప్రాజెక్టు ఆఫీసర్ వెంకటేశ్వరరెడ్డి, డిజిఎం ఫారెస్ట్ హరినాథ్, పర్చేజ్ అధికారి చంద్రశేఖర్, మేనేజర్లు నాగన్న, శంకర్, ఎన్విరాన్‌మెంట్ అధికారి హనుమంతున్ గౌడ్, సేఫ్టి ఆఫీసర్ మహేష్, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి, ఫిట్ ఇంజనీర్ భీమన్న తదితదులు పాల్గొన్నారు.

# పారదర్శకతతో ఆర్‌టిఐ యాక్ట్ అమలు

రాష్ట్ర ముఖ్య సమాచార కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి






ప్రజాపక్షం/మెదక్ :పారదర్శకత, జవాబుదారీతనంతో ఆర్‌టిఐ చట్టాన్ని అమలు చేసేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర ముఖ్య సమాచార కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మెదక్ జిల్లాలో సమాచార హక్కు చట్టం పటిష్టంగా అమలు చేయడంలో జిల్లా కలెక్టర్, అధికారులు తీసుకుంటున్న చొరవ అభినందనీయమని ఆయన అన్నారు. మంగళవారం మెదక్ జిల్లా సమాచార హక్కు చట్టం కమిషనర్ల పర్యటన నేపథ్యంలో సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో పౌర సమాచార అధికారులతో ఆర్‌టిఐ యాక్ట్ అమలు విధి విధానాలపై పౌర సమాచార అధికారులకు చట్ట నిబంధనలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సదస్సుకు రాష్ట్ర ముఖ్య పౌరసమాచార కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, కమిషనర్లు పివి శ్రీనివాస్, బోరెడ్డి, అయోధ్య రెడ్డి, మోసిన్ పర్వీన్, వైష్ణవి మేర్ల, దేశాల భూపాల్ హాజరయ్యారు. కమిషనర్లకు కలెక్టర్ రాహుల్‌రాజ్ పూల బొకేతో స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ గౌరవ వందన స్వీకరించి, అటవీ శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్‌టిఐ కమిషనర్లుగా బాధ్యతలు చేపట్టి మొదటిగా మెదక్ జిల్లాకు రావడం జరిగిందన్నారు. సమాచార హక్కు చట్టంపై పౌర సమాచార అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ పథకాల అమలు, నిధుల వినియోగం, అవినీతి నిర్మూలనే లక్ష్యంగా సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చిందని తెలిపారు. సెక్షన్లు, సబ్ సెక్షన్లపై క్షుణ్ణంగా చదివి పౌర సమాచార అధికారులు సమగ్ర అవగాహన పెంపొందించుకోవాల్సిన ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలకు జవాబుదారుతనం ఎంత అవసరమో పారదర్శకత అంతే అవసరమని ఆర్‌టిఐ యాక్ట్ ద్వారా పూర్తి సమాచారం అందించినప్పుడు మాత్రమే జవాబుదారితనం పారదర్శకత సార్ధకత స్థాయికి వెళ్తాయని చెప్పారు. ప్రజలు సమాచారం కోసం దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లో సమాచారం అందజేయాలని, ప్రతి ప్రభుత్వ కార్యాలయాల వద్ద సిటిజన్ షాట్‌బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. సహేతుక కారణాలు చూపించకుండా ఆర్‌టిఐ యాక్ట్ దరఖాస్తులను తిరస్కరించకూడదన్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ మా ట్లాడుతూ జిల్లాలో సమాచార హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలయ్యే విధంగా అధికారులకు పలు ఆదేశాలిస్తూ పూర్తి నిబంధనలను అనుసరిస్తూ ప్రజలు ఎటువంటి సమాచారం కావాలని దరఖాస్తు చేసుకున్నా నిబంధనలకు లోబడి సమాచారం అందించే విధంగా ఆదేశాలు జారీ చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్‌పి మహేందర్, మెదక్, నర్సాపూర్, తూఫ్రాన్ ఆర్‌డిఓలు రమాదేవి, మహిపాల్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, జిల్లాలోని వివిధ శాఖల పౌర సమాచార అధికారులు, పోలీస్ యంత్రాంగం, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజల ఆరోగ్య పరిరక్షణ బాధ్యత మీదే

వైద్యాధికారులతో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి



ప్రజాపక్షం/మాక్లూర్ : ప్రజల ఆరోగ్యాలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వ వైద్యాధికారులదేనని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం మండల కేంద్రంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కంద్రం, అంగన్‌వాడీ సెంటర్, మండల విద్యాధికారి కార్యాలయం, వ్యవసాయ సహకార సంఘం ఎరువుల గోడౌన్, శాఖ గ్రంథాలయం, సబ్ పోస్టాఫీస్ తదితర కార్యాలయాలను కలెక్టర్ తనిఖీ చేశారు. గ్రామపంచాయతీ కార్యదర్శిని ఇందిరమ్మ ఇళ్ల ప్రగతి పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మాక్లూర్ పిహెచ్‌సిని సందర్శించిన కలెక్టర్ ఓపి రిజిస్ట్రేషన్ కౌంటర్, ల్యాబ్, ఇన్ పేషెంట్ వార్డు, వ్యాక్సినేషన్ రూమ్ తదితర విభాగాలను పరిశీలించారు. మెడికల్ ఆఫీసర్‌తో పాటు విధుల్లోని సిబ్బంది హాజరు తనికీ చేశారు. ఆరోగ్య కేంద్రం ద్వారా ప్రజలకందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వ్యాధుల నిర్ధారణ కోసం సగటున ప్రతి రోజు ఎన్ని రక్తపరీక్షలు జరుపుతున్నారు, వాటి ఫలితాలను ఎలా తెలియజేస్తున్నారని ప్రశ్నించారు. అంగన్‌వాడీ సెంటర్‌ను సందర్శించి పరిశీలించారు. నగదు కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని లబ్ధిదారులకు సకాలంలో పెన్షన్ మొత్తాన్ని అందజేయాలని సూచించారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై పంచాయతీ కార్యదర్శిని వాకబు చేశారు. మంజూరీలు పొందిన ప్రతి లబ్ధిదారు ఇంటినిర్మాణం చేపట్టేలా ప్రోత్సహించాలని, క్షేత్రస్థాయి పర్యవేక్షణ జరుపుతూ అవసరమైన వారికి ఐకెపి ద్వారా రుణమందేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యశాఖ, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ప్రజాపక్షం/శ్రీరాంపూర్ : ఎస్ఆర్‌పి 3 గనిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా డిమాండ్ చేశారు. మంగళవారం యూనియన్ ప్రతినిధులతో కలిసి గనిలోని శాఖల వారిని కలుసుకొని సమస్యలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాలర్ ఆపరేటర్లు, కోల్ కట్టర్స్, పంప్ ఆపరేటర్లు, లైన్మెన్ల కోసం ఉన్న రెస్ట్‌హాల్స్ వర్షంలో లీకవుతున్నాయని, కొత్త సీట్లు ఏర్పాటు చేయాలని కోరారు. ట్రాక్ లైన్లు దెబ్బతినడంతో టబ్బులు పడిపోతుండటంతో ఉత్పత్తికి అతరాయం ఏర్పడుతుందని తెలిపారు. మెటీరియల్స్ అయిన చెక్కులు, తుంటలు, డాగ్ నెయిల్స్, రోల్స్ లైనర్స్ తగినంత తెప్పించాలని, పాత టబ్బుల స్థానంలో కొత్తవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. క్యాంటిన్‌లో నాణ్యమైన అల్పాహారం ఇవ్వాలని కోరారు. మహిళల కోసం వాష్ రూములు, బ్యాక్‌హెడ్ వద్ద గోడలు నిర్మించాలన్నారు. ఆఫీసు కోసం కంప్యూటర్లు, ప్రింటర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమస్యలను మేనేజర్‌కు వివరించగా త్వరితంగా పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, బద్రి బుచ్చయ్య, ప్రసాద్ రెడ్డి, మూడ సుధాకర్, అఫ్రోజ్ ఖాన్, మురళీ చౌదరి, దాడి రాజయ్య, గునిగంటి నరసింగా రావు, తౌటం, మల్లేష్, అంబాల రవి, కాసిపేట విక్కి, బట్టారి శ్రీకాంత్, ఆడేపు సురేష్, సుధాకర్, సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ

పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



ప్రజాపక్షం/పటాన్‌చెరు : సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఎంపిడిఓ కార్యాలయం సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలు, పట్టణాలు డివిజన్లకు సంబందించిన లబ్దిదారులకు నూతన రేషన్ కార్డులను ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పటాన్‌చెరు నియోజకవర్గం వ్యాప్తంగా 2096మంది లబ్దిదారులకు నూతన రేషన్ కార్డులు మంజూరయ్యాయని తెలిపారు. రేషన్ కార్డుల పంపిణి ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## విద్యావ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం కృషి

ఎమ్మెల్సీ దండే విఠల్



ప్రజాపక్షం/తిర్యాణి : తిర్యాణి మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామని, విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం కీలకంగా వ్యవహరిస్తోందని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో రూ.3.25కోట్ల నిధులతో మంజూరైన బాలుర వసతి గృహానికి మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యా, ఆరోగ్య, రవాణా, మౌలిక సదుపాయాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో డిసిసి అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు, జువ్వాజి అనిల్‌గౌడ్, ఎంపిడిఓ వేముల మల్లేష్, ఎంఇఓ అంజయ్య పాల్గొన్నారు.

## హాస్టల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాపక్షం/నర్సాపూర్ : నర్సాపూర్ మండల పరిధిలోని నాగులపల్లి గ్రామంలో పిఎం జన్మన్ సహాయక సంఘం కేంద్ర నిధుల నుంచి రూ. మూడు కోట్ల 50 లక్షలతో ఎస్టి ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్ మంజూరు కాగా సోమవారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై హాస్టల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు సేనాధిపతి, జీవన్ రెడ్డి, ఆనంద్ కుమార్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు బోగా శేఖర్, రఘుపతి రెడ్డి, సురేందర్ రెడ్డి, ముకుందా రెడ్డి, కుమార్, కిష్టయ్య, మేఘమాల, నర్సింలు, గోవర్ధన్, రవికుమార్, జితేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బిక్కునాయక్, సందీప్, నహీముద్దీన్, షేక్ హుస్సేన్, వినయ్, రాకేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా బెస్ట్ స్కూల్‌కు అభినందనలు



ప్రజాపక్షం/పెంచికల్‌పేట్ : పీఎం శ్రీ పథకం కింద జిల్లాలో ఉత్తమ పాఠశాలగా ఎంపికైన పెంచికల్‌పేట్ జడ్‌పి ఉన్నత పాఠశాలను సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యాపకులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఎం శ్రీ పథకం కింద ప్రభుత్వం ఈ పాఠశాలకు రూ. 18 లక్షల నిధులు మంజూరు చేసిందని, ఉత్తమ పాఠశాలగా ఎంపిక కావడంతో అదనంగా రూ. 15 లక్షలు అందనున్నాయని తెలిపారు. ఇప్పటికే ల్యాబ్ నిర్మాణం, అదనపు గదుల నిర్మాణం పూర్తయినట్లు వివరించారు. విద్యార్థులు చదువుపై ఆసక్తి పెంచుకోవాలని, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు గౌరవం తీసుకొచ్చేలా ప్రవర్తించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయనిర్మల, బిజెపి మండల అధ్యక్షుడు రాజేశ్వర్, ఘనపురం నాగేష్, రాజన్న, ప్రభాకర్, సాయికిరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు

కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

ప్రజాపక్షం/ఆసిఫాబాద్ : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే పేర్కొన్నారు. మంగళవారం తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ జిల్లా పర్యటనలో భాగంగా కలెక్టరేట్ భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో మలేరియా, డెంగ్యూ చికెన్‌గున్యా వ్యాప్తిని అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నామని వివరించారు. వైద్య విధాన పరిషత్ కమిషనర్ మాట్లాడుతూ జిల్లా పర్యటనలో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులను సందర్శించి, జ్వరవార్డుల్లో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, వైద్యసిబ్బంది, మందులు సరఫరా, ల్యాబ్ పరీక్షలు, పౌష్టికాహారం, పారిశుధ్య నిర్వహణపై సమీక్షించి నివేదిక ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం, ఆసుపత్రి పర్యవేక్షకుడు చెన్నకేశవ, వైద్యులు పాల్గొన్నారు.



# సిఎస్‌ఆర్ నిధులతో చేపట్టిన పనులు త్వరితగతిన పూర్తి

సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

కెజిబివి పాఠశాలలో కలెక్టర్ రాత్రి నిద్ర





ప్రజాపక్షం/ సంగారెడ్డి : కెజిబివి పాఠశాలల్లో సిఎస్ఆర్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అధికారులను అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ప్రావీణ్య హత్నూర కెజిబివి పాఠశాలలో సోమవారం రాత్రి నిద్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలో అన్ని తరగతులు డిజిటల్ విధానంలో ప్రణాళిక ప్రకారం బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధపడేలా ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులకు కంప్యూటర్‌కు సంబందించిన ప్రోగ్రాంలు నేర్పించాలన్నారు. పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్‌ను, డైనింగ్ హాల్లు, కిచెన్ షెడ్డు, స్టోర్ రూమ్, డిజిటల్ తరగతి గదులను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో అవసరమైన మౌలిక వసతుల మెరుగుకు సిఎస్ఆర్ ఫండ్ ద్వారా రూ.19.5 లక్షల నిధులు మంజూరు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. విద్యార్థులకు నూతన మెనూ ప్రకారం రుచికరమైన భోజనం ప్రతి రోజు అందించాలని సిబ్బందికి సూచించారు. వర్షాకాలంలో విద్యార్థులు అనారోగ్యాల బారిన పడకుండా అవసరమైన అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. పాఠశాల పరిసరాలలో పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థులకు భవిష్యత్తులో చదివే వివిధ కోర్సులపై అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం కలెక్టర్ విద్యార్థులతో కలసి రాత్రి భోజనం చేశారు. కలెక్టర్‌తో పాటు జడ్‌పి డిప్యూటీ సిఇఓ స్వప్న, తహసీల్దార్ షేక్ పర్వీన్, ఎంపిడిఓ తదితర అధికారులు కెజిబివి పాఠశాలలో రాత్రి నిద్ర చేశారు.

**ఇందిరమ్మ ఇండ్ల పురోగతిపై కలెక్టర్ సమీక్ష...** మండల పర్యటనలో భాగంగా కలెక్టర్ ప్రావీణ్య మొదటగా ఎంపిడిఓ కార్యాలయాన్ని సందర్శించారు. మండలంలో ఇందిరమ్మ ఇండ్ల పురోగతిపై సమీక్ష జరిపారు. మండలానికి 596 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా ఇప్పటి వరకు 582 మందికి ప్రొసిడింగ్‌లు అందజేసినట్లు అధికారులు కలెక్టర్ తెలిపారు. వీటిలో 232 ఇండ్ల నిర్మాణం పనులు ప్రారంభమైనట్లు తెలిపారు. మంజూరైన లబ్దిదారులకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో అధికారులు సహకారం అందించాలని కలెక్టర్ సూచించారు. ఆదర్శ పాఠశాలలో మౌలిక వసతులను ఉపాధిహామీ పథకం ద్వారా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు స్త్రీనిధి ఎస్‌హెచ్‌జి గ్రూఫ్‌లో రుణాలు విరివిగా అందించాలని సూచించారు. కార్యక్రమంలో డిఇఓ వెంకటేశ్వర్లు, టిజిఇ డబ్ల్యు ఐడిసి శ్రీనివాస్‌రెడ్డి, డిఇ రాజు, కెజిబివి ప్రత్యేక అధికారి విజయలక్ష్మి పాల్గొన్నారు.

## ఉద్యాన పంటలు పండిస్తే రైతులకు అధిక లాభాలు



**ప్రజాపక్షం/ఇల్లందకుంట:** ఉద్యాన పంటలు పండించడం వల్ల రైతులకు అధిక లాభాలు వస్తాయని ఉద్యనశాఖ అధికారి మంజువాణి తెలిపారు. మంగళవారం ఇల్లందకుంట మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులకు ఉద్యాన పంటలు, పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్కువ నీటి సౌలభ్యంతో ఉద్యాన పంటలు పండించడం వల్ల రైతుల లాభాలు గడించవచ్చన్నారు. కూరగాయలు, పండ్లు, పువ్వులు, కూరగాయలు, తీగ జాతి పంటలకు మార్కెట్‌లో ఎక్కువ డిమాండ్ ఉందని, ఆ పంటలు పండిస్తే ఎక్కువ లాభాలు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఎఇఒ రవళిక, ఆదర్శ రైతు శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

## ఇండ్ల పట్టాలను మంజూరు చేయండి



**ప్రజాపక్షం/కొహెడ:** సిపిఐ కొహెడ మండల కార్యదర్శి వేల్పుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో శ్రీరాములపల్లి ఇండ్ల స్థలాల పట్టాల మంజూరులో జాప్యం జరుగుతుందని హుస్నాబాద్ ఆర్డిఓకు వినతిపత్రం ఇవ్వడంతో సానుకూలంగా స్పందించి కొహెడ ఎమ్మార్వోకు ఫోన్ చేసి సర్వేర్ని పంపించి హద్దులు పెట్టి ఇండ్లు నిర్మించుకోవడానికి అనుమతి ఇవ్వాల్సిందిగా తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సీనియర్ నాయకులు బోనగిరి శంకర్, జాగిరి బాలయ్య, బూర రాజేశం, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం / ఇబ్రహీంపట్నం:** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని అమ్మక్కపేట, డబ్బా, వర్షకొండ, కోమటి కొండాపూర్, ఎర్దండి, కోజన్ కొత్తూరు, మూల రాంపూర్, బర్తీపూర్, వేములకుర్తి, యామాపూర్, తిమ్మాపూర్, గోధూర్, ఇబ్రహీంపట్నం గ్రామాలలో మంగళవారం బిఆర్ఎస్ పార్టీ స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఇంటింటికి వెళ్లి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి పంపిణీ చేశారు. 42 మంది లబ్దిదారులకు 42,04,872 కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే సంజయ్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లబ్దిదారులకు ఇబ్బందులు తలెత్తకూడదనే ఉద్దేశ్యంతో లబ్దిదారుల ప్రతి గ్రామానికి వెళ్లి కళ్యాణ లక్ష్మి చెక్కులను అందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి కేసిఆర్ ఒక మేనమామ లాగా కళ్యాణ లక్ష్మి పథకాన్ని ప్రారంభించి ఇప్పటికి అదే లక్ష రూపాయలు అందజేస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇస్తానన్న తులం బంగారం ఎటుపాయే అని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ధశరథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వేమూరి సత్యనారాయణ, మాజీ వైస్ ఎంపిపి నోముల లక్ష్మారెడ్డి, విండో చైర్మన్‌బద్దం గోపి, మాజీ మండల కోఆప్షన్ ఏలేటి చిన్నారెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కంతం రమేష్, దొంతుల తుకారాం, పుప్పాల నర్సయ్య, జెడి సుమన్, గుంటి దేవన్న, దాసరి చిన్న రాజన్న, దోమకొండ చిన్న రాజన్న, సంఘం సాగర్, రెబ్బసి సాగర్, తీగల విక్రం, తీగల రవీందర్, నేమూరి నరేష్, సున్నం సత్యం, జింక శ్రీనివాస్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు లబ్ధిదారులు పాల్గొన్నారు.


## అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుదాం:నర్సింగ్‌రావు



**ప్రజాపక్షం/కోరుట్ల:** మన రాష్ట్రం ప్రజల ప్రభుత్వమని, ప్రజల అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుదామని కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగ్‌రావు అన్నారు. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం గుమ్లాపూర్ గ్రామంలోని శ్రీవేంకటేశ్వర ఆలయ ఉత్తర ద్వారం అభివృద్ధి కోసం మూడు లక్షల ప్రొసిడింగ్ పత్రాన్ని కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి నర్సింగ్‌రావు గుమ్లాపూర్ వెంకటేశ్వర సేవా సమితి సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా నర్సింగ్‌రావు మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొంతం రాజం, కోరుట్ల మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి, బిసి సెల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గడ్డం వెంకటేష్‌గౌడ్, గ్రామ కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర సేవాసమిత సభ్యులు పాల్గొన్నారు.

## రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**ప్రజాపక్షం/గంగాధర:** రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ అని, అర్హులందరికీ కార్డులు అందజేస్తామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. గంగాధరలోని జివిఆర్ ఫంక్షన్ హాలులో గంగాధర మండలానికి చెందిన లబ్ధిదారులకు రేషన్ కార్డు మంజూరు ఉత్తర్వులు మంగళవారం అం దజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత సర్కారు దశాబ్దం పాటు ఒక్క రేషన్ కార్డు మంజూరు చేయలేదని, కార్డులు అందక ఎంతో మంది ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. ప్రతి పేదవాడికి రేషన్ కార్డు ఒక ఆత్మగౌరవమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి పేదవాడి అవసరాన్ని గుర్తించిందని తెలిపారు. ఇందులో భాగంగా దరఖాస్తు చేసుకున్న వారందరికీ రేషన్ కార్డు అందిస్తోందన్నారు. నియోజకవర్గంలో తొలివిడతగా 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని తెలిపారు. రానున్న కాలంలో ప్రతి అర్హునికి ఇందిరమ్మ ఇల్లు అందజేస్తామన్నారు. నారాయణపూర్ జలాశయం కుడికాలువ పనులను ఆరు నెలల్లో ప్రారంభించనున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ జిల్లాలో 78 వేల 500 కు పైగా కొత్త రేషన్ కార్డులు, ఉన్న కార్డుల్లో మార్పులు చేశామని తెలిపారు.మార్కెట్ కమిటీ చైర్మన్ జాగిరపు రజిత శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ తోట కరుణాకర్, సింగిల్ విండో చైర్మన్ తిరుమల రావు, వైస్ చైర్మన్ వేముల భాస్కర్, తహసీల్దార్ అనుపమ రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుబ్బాసి బు చ్చయ్య, రామిడి రాజిరెడ్డి, బూరుగు గంగన్న, దోర్నాల శ్రీనివాస్ రెడ్డి, అ జయ్ రావు, తోట సంధ్య, రోమాల రమేష్, సత్తు కనుకయ్య, కర్ర విద్యాసాగర్ రెడ్డి, గుజ్జుల బాపురెడ్డి, గంగాధర సుదర్శన్, రాచమల్ల భాస్కర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ముచ్చ శంకర్, చందు, వంగల శ్రీనివాస్, మంత్రి మహేందర్, పానుగంటి సత్యం తదితరులు పాల్గొన్నారు.

## ఆశిరెడ్డిపల్లిలో రైతు అవగాహన

**ప్రజాపక్షం / చందుర్తి :** మండలంలోని ఆశిరెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం రైతు విజ్ఞానకేంద్రం కరీంనగర్ ఆధ్వర్యం లో నిర్వహించిన వ్యవసాయంలో డిజిటల్ అనువర్తనాలు,శిక్షణ కార్యక్రమంలో రుద్రంగి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బొజ్జ మల్లేశం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం ప్రత్యేక చొరవ చూపుతుందన్నారు. రైతులు గ్రూపులుగా ఏర్పడి వ్యవసాయం లో డిజిటల్ పద్ధతులపై చర్చించుకోవడం వల్ల అవగాహన పెంపొందుతుందన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు, సూచనలతో పంటలు వేయడం, ఎరువులు వాడడం, తెగుళ్ళ నివారణ తీసుకోవలసిన చర్యలు లాంటివి చేయడం వల్ల తక్కువ పెట్టుబడి వ్యయంతో అధిక లాభాలు పొందవచ్చాన్నారు. ఈ కార్యక్రమంలో ఎఒ అనూష, ఒఇఓ ప్రవీణ్, కార్యదర్శి మహేష్, తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయ శాస్త్రవేత్తల కమిటీ డైరెక్టర్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# రూ.9వేల కోట్లతో సన్నబియ్యం పథకం

రాష్ట్రకార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి వివేక్



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** అర్హులందరికి తెల్ల రేషన్‌కార్డులు అందిస్తామని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. గత పదేండ్ల బిఆర్ఎస్ పాలనలో కొత్త రేషన్‌కార్డుల కోసం ప్రజలు ఎదుచూసారన్నారు. కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ప్రజలకు ఏలా సేవ చేయవచ్చునని ఆలోచించి ప్రజాఉపయోగ కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. అందులో అర్హులైన ప్రజలందరికి తెల్లరేషన్‌కార్డులు అందించేందుకు నిర్ణయం తీసుకుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రేషన్‌కార్డులు. ఇందిరమ్మ ఇళ్లు ప్రభుత్వం అందిస్తుందన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో మంగళవారం కొండ మల్లయ్య గార్డెన్‌లో సిద్దిపేట అర్బన్, రూరల్ మండల ప్రజలకు 10వేలకు పైగా రేషన్‌కార్డుల పంపిణీని జిల్లా కలెక్టర్ హైమావతి, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌తో కలసి మంత్రి వివేక్‌వెంకటస్వామి అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి వెంకటస్వామి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పాత రేషన్‌కార్డుల్లో లబ్దిదారుల్లో చేర్పులు, కొత్త కార్డులు కలిపి 52వేల మందికి అదనంగా లబ్ధి చేకూరుతుందన్నారు. గతంలో ప్రభుత్వం పంపిణీ చేసిన దొడ్డు బియ్యం లబ్ధిదారులు వినియోగించుకోలేదన్నారు. పేద ప్రజలకు రుచికరమైన పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశ్యంతో రేషన్‌కార్డులతో ఉచిత సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 9కోట్ల రూపాయలతో సన్నబియ్యం పథకం అమలు కోసం ఖర్చుచేసిందన్నారు. సిద్దిపేట అభివృద్ధి కోసం అవసరమైన నిధులు మంజూరు చేయిస్తానన్నారు. అభివృద్ధి చేసే బాధ్యత ప్రభుత్వానిది అని జిల్లా అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. జిల్లా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ జిల్లాలో 26వేల రేషన్‌కార్డులు పంపిణీ జరుగుతుందన్నారు. సిద్దిపేట నియోజక వర్గంలో 9971 కార్డులు పంపిణీ చేయటం జరుగుతుందని, ఈకార్డుల్లో 30 వేల మంది సభ్యులున్నారన్నారు. 21300 మందిని పాతకార్డుల్లో చేర్పించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎసీ కమిషన్ చైర్మన్ బక్కివెంకటయ్య,జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ కేడెం లింగమూర్తి, జిల్లా ఇన్‌చార్జి పోలీస్ కమిషనర్ రాజేశ్‌చంద్ర, ఆర్డీఓసదానందం, డిఎం సివిల్ సప్లయ్ ప్రవీణ్, సిద్దిపేట మున్సిపల్ చైర్మన్ మంజుల రాజనర్స్, వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ ఇంచార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

## వన మహోత్సవంలో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యం కావాలి

జగిత్యాల జిల్లా గ్రామీణభివృద్ధి శాఖ అధికారి రఘు వరణ్



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల రూరల్ మండలం లక్ష్మి పూర్ గ్రామంలో మంగళవారం రోజున జగిత్యాల జిల్లా గ్రామీణభివృద్ధి శాఖ అధికారి రఘువరణ్ వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించి మొక్కను నాటారు. అనంతరం ఆసరా పింఛన్ల పంపిణీ పోస్టఫీస్ ద్వారా నూతనంగా వచ్చిన విధానం ప్రకారం పింఛనుదారుల ముఖ గుర్తింపుతో పంపిణీ చేసే పద్ధతిని పరిశీలించారు. ఈ సందర్భంగా డిఆర్‌డిఓ మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలో రూ.2,26,000ల పింఛన్లు పంపిణీ ప్రతి నెల 45 కోట్ల రూపాయలు పంపిణీ చేయడం జరుగుతుందని, ఇందులో రూ.2,00,000లవరకు బ్యాంక్ ద్వారా, రూ.26000 పింఛన్లులు పోస్టఫీస్ ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించి మొక్కను నాటడమే కాదు మొక్కను సంరక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల రూరల్ ఎంపిడిఓ. రమాదేవి, జిల్లా డిపియం నాగేశ్వర్ రావు, మండల ఎపియం వి.గంగాధర్, ఎపిఓ. గంగాలక్ష్మ ణ్, పంచాయతీ సీక్రటరీ రాజేష్, సిసి. మరియా, గంగారాం, మండల సమాఖ్య అధ్యక్షురాలు మారు. సత్తవ్వ, విఓఏలు రాజ్యలక్ష్మి, భాగ్య లక్ష్మి, లావణ్య పలువురు మహిళా సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

## 'అల్మాస్‌పూర్ కెజిబివి'లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో విద్యార్థినులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని అధికారులను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. అల్మాస్‌పూర్‌లో నిర్వహిస్తున్న ఎల్లారెడ్డిపేట కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కెజిబివి)లో మం గళ వారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంట గది, స్టోర్ రూమ్‌లో ని లువ ఉంచిన ఆహార పదార్థాల సామాగ్రి, కూరాగాయల నాణ్యతను పరిశీలించారు. అలాగే విద్యాలయంలో విద్యార్థినులకు ఆ ర్బాఎస్కే టీం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సా ధారణ వైద్య పరీక్షల శిబిరాన్ని పరిశీలించారు. క్రమం తప్పకుండా విద్యార్థినులకు వై ద్య పరీక్షలు చేస్తున్నామని, బాలికల ఎత్తు బరువు ఏవైనా అనారోగ్య సమస్యలు ఉన్నాయా తెలుసుకకొని దాని ప్రకారం వారికి అవసరమైన మందులు వైద్య సహాయం అందిస్తున్నామనిడాక్టర్లు కలెక్టర్‌దృష్టికితీసుకెళ్లారు.

**అన్ అకాడమీ తరగతులపై ఆరా...**

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలోని 8,9,10వ తరగతుల విద్యార్థులను పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. పలువురు విద్యార్థులతో పాఠ్యాంశాలు చదివించారు. ఈ విద్యాలయంలో అన్ అకాడమీ ఆద్వర్యంలో కొనసాగుతున్న ఆన్లైన్ శిక్షణ తరగతుల వివరాలు అలాగే విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజ , ఆర్వో ప్లాంట్ పని తీరు పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండల ప్రత్యే అధికారి గుండోజు సత్యం, ఏఎంసి చైర్మన్ సబేరా బేగం, మండల విద్యాధికారి కృష్ణహరి,పాఠశాలప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు విద్యార్థులు ఉన్నారు.

## బయోమెట్రిక్ విధానంతో వైద్య సిబ్బంది హాజరు నమోదు

పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** బయోమెట్రిక్ విధానం ద్వారా వైద్య సిబ్బంది హాజరు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మంథని మండలంలో విస్తృతంగా పర్యటించారు. మంథని పట్టణ కేంద్రంలో ఉన్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్, మాత శిశు ఆసుపత్రి, గోపాల్ పూర్ గ్రామంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, గద్దెలపల్లి గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు.ఆసుపత్రిలో వార్డులను క్షుణ్ణంగా కలెక్టర్ తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగుల కొరకు నూతనంగా నిర్మించిన షెడ్ ను పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆసుపత్రిలో సిబ్బంది, వైద్యులు సకాలంలో విధులకు హాజరు కావాలని, ప్రతిరోజు తప్పనిసరిగా హాజరు వివరాలను బయోమెట్రిక్ విధానం ద్వారా నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్య సేవలను గర్భిణీ మహిళలకు అందించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. గోపాల్ పూర్ గ్రామంలో ప్రాథమిక పాఠశాల నిర్మాణ పనులు వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని అన్నారు. గద్దెలపల్లి ప్రాథమిక ఆసుపత్రిని పరిశీలించి ఏ.ఎం.సి ప్రొఫైల్ సక్రమంగా నిర్వహించాలని, ఎన్‌సిడి స్క్రీనింగ్, ఎక్స్ రే .టి.బి. ముక్త్ భారత్ మరియు ఆరోగ్య మహిళ తదితర వాటిపై ఆరా తీశారు. ఒపి సేవలు పెంచాలని కలెక్టర్ ఆదేశించారు.విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు, మంగళవారం మంథని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆకస్మిక తనిఖీలు ఆసుపత్రిలో ఉదయం 11:30 గంటల వరకు ఆర్ ఎం ఓ డాక్టర్ టివి రాజశేఖర్ రెడ్డి, ఎం ఎన్ ఓ షంషేర్ ఖాన్, ఎన్ సి డి కాంట్రాక్టు ఉద్యోగి సావిత్రి పియాలు విధులకు హాజరు కాకపోవడానికి జిల్లా కలెక్టర్ గమనించారు. ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు కావడం, సమయపాలన పాటించకుండా ఆసుపత్రికి లేటుగా రావడం, బయోమెట్రిక్ విధానంలో హాజరు నమోదు చేసుకోకపోవడంపై మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని మెమో జారీ చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని, వైద్య సిబ్బంది, వైద్యులు కచ్చితంగా సమయపాలన పాటించాలని స్పష్టం చేశారు. ఎంపిడిఒ శశికళ, మంథని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్, ఎఇపిఆర్. అనుదీప్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మతపరమైన రిజర్వేషన్లకు కాంగ్రెస్ వ్యతిరేకం

కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి



**ప్రజాపక్షం/కరీంనగర్ సిటీ:** మతపరమైన రిజర్వేషన్లు కల్పించడానికి కాంగ్రెస్ వ్యతిరేకంగానే ఉందని ఆ పార్టీ మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. కరీంనగర్‌లోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిసి రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చకుండా కేంద్ర ప్రభుత్వం నాన్చడం తగదన్నారు. బిసిల రిజర్వేషన్‌పై జాతీయ స్థాయిలో చర్చ జరుగుతోందంటే ఆ ఘనత రాహుల్ గాంధీదేనన్నారు. 42 శాతం రిజర్వేషన్ల కోసం గవర్నర్ కేంద్రానికి నివేదిక పంపాడంటేనే అందులో న్యాయం ఉందని అర్థమవుతుందన్నారు. కేంద్రం దీనిపై మూడు నెలల్లోగా సమాధానం చెప్పాల్సి ఉన్నా నాన్చుతోందన్నారు. దీన్ని 9వ షె డ్యూల్‌లో చేర్చకపోగా తన అభిప్రాయాన్ని సైతం చెప్పకుండా కేంద్రం జా ప్యం చేస్తోందన్నారు. ఇప్పుడు పంపిన ఆర్డినెన్స్‌ను ఆమోదించకుండా మళ్లీ హోం శాఖకు గవర్నర్ పంపడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. ముస్లింలకు బిసిల్లో రిజర్వేషన్ వద్దంటున్న బిజెపి గుజరాత్, మహారాష్ట్రలో ఎందుకు కల్పిస్తోందని ప్రశ్నించారు. సామాజిక వెనుకబాటుకు గురైన ముస్లింలకు రిజర్వేషన్లు ఇస్తున్నారన్నారు. తెలంగాణలో మాత్రమే ముస్లింలపై వివక్ష ఎందు కు? అని ప్రశ్నించారు. ఏ మతమైనా సామాజిక వెనుకబాటునే రిజర్వేషన్లకు ప్రామాణికమన్నారు. 56 శాతం బిసిలున్నట్లు ఇటీవల కులగణన లెక్కలు తేలాయని, ఇందులో 10శాతం ముస్లింలు ఉంటారని తెలిపారు. వీరిని పకక్కన పెడితే 46 శాతమే అవుతుందని, అందులో 42 శాతం బిసి రిజర్వేషన్ ఎలా సాధ్యం? అని ప్రశ్నించారు. ఇప్పటికే తెలంగాణలో విద్యా, ఉద్యోగాలలో అన్ని కలిపి 54శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయని, 42 శాతం బిసి రిజర్వేషన్ అమలు చేస్తే అదనంగా పెరిగేది 13 శాతమేనన్నారు. అదనంగా ముస్లింలకు దక్కేది 1.08శాతమేనని పేర్కొన్నారు. ఇప్పటికే ముస్లింలకు 4శాతం రిజర్వేషన్లు ఉండగా అదనంగా దక్కితే 5.08 శాతమే అవుతుందన్నారు. బిజెపి తప్పుడు లెక్కలతో తప్పుదో పట్టిస్తోందన్నారు. బిజెపి నేతలు సామాజిక వెనుకబాటుకు గురైన వారికి వ్యతిరేకంగా ఉందన్నారు. ఇప్పటికే బిసిలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 10 శాతం రిజర్వేషన్లను బిఆర్ఎస్ తగ్గించిందన్నారు. డెడికేషన్ కమిషన్ వేయకుండా బిఆర్ఎస్ మోసం చేసిందన్నారు. రిజర్వేషన్ల లెక్కలపై అవగాహన లేకుండా బిజెపి నేతలు మా ట్లాడుతున్నారన్నారు. రాష్ట్రంలో రిజర్వేషన్ అమలు బిల్లుకు బిజెపి మద్దతు తెలిపి జాతీయ ఓబిసి నాయకులు 42 శాతం రిజర్వేషన్ బిల్లు రాష్ట్రపతి వద్ద ఉండగా ఆర్డినెన్స్ ఎలా తీసుకువస్తారంటూ ప్రశ్నిస్తుండడం విడ్డూరంగా ఉందన్నారు. బిజెపి నేతల రెండు నాల్కల ధోరణి తగదన్నారు. సమావేశంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు శ్రావణ్ నాయక్, సమద్ నవాబ్, కోడూరి రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

## ప్రధాన రోడ్డుపై గుంతలు

పరిశీలించిన ఎమ్మెల్యే సంజయ్, ఆర్‌అండ్‌బి అధికారులు



ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం / ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంప ట్నం మండల కేంద్రం రోడ్డు పరిస్థితి రోజు రోజుకు అధ్వాన్నంగా మారుతుంది అనే సమస్యపైన (పేరుకే మండల కేంద్రం... రోడ్డు మాత్రం అధ్వా న్నం) అనే శీర్షికన ఈ నెల 28 న ప్రజాపక్షం దినపత్రికలో వచ్చిన వార్త కథనానికి ఆర్‌అండ్‌బీ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ స్పందించారు. మంగళవారం మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీను, ప్రదాన రోడ్డుపై ఉన్న గుంతలను ఎమ్మెల్యే సంజయ్, ఆర్‌అండ్‌బి అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డుపైన గుంతలను సత్వరమే పూడ్చి రోడ్డు పైన మురుగునీరు నిలవకుండా తక్షణ చర్యలు చేపట్టాలని దృష్టికి అధికారుల దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆర్‌అండ్‌బి అధికారులు పంచాయితీ కార్యదర్శి రామకృష్ణ దగ్గర ఉండి పంచాయతీ సిబ్బందితో కలిసి జెసిబి సహాయంతో రోడ్డుపై నీరు నిలవకుండా కచ్చా డ్రైనేజిని ఏర్పాటు చేశారు. గతంలో సంబంధిత కాంట్రాక్టర్ రోడ్డుపైన ప్యాచ్ వర్క్‌లను మూల రాంపూర్ వరకు చేపట్టగా ఒక మండల కేంద్రంలోని ఒక కిలోమీటర్ వరకు ప్యాచ్ వర్క్ చేయాల్సి ఉందని, ఒక రెండు రోజుల్లో రోడ్డుపైన గుంతలను పూడ్చి వేస్తామని, ఆర్‌అండ్‌బీ ఏఈ మహమ్మద్ ఫైజాన్ తెలిపారు. కాగా రోడ్డు పరిస్థితి, డ్రైనేజీ పరిస్థితిపై వార్తకథనం ప్రచురించి సంబంధిత అధికారులు ప్రజా ప్రతినిధుల్లో కదలిక తెచ్చిన ప్రజాపక్షం దినపత్రికకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

# గురుకులాలను తనిఖీ చేసిన కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం/ కరీంనగర్:** గంగాధరలోని మహాత్మా జ్యోతిబాపూలే బిసి సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బిసి బాలుర గురుకులంలో తరగతి గదులను, స్టోర్ రూంను, వంటగదిని పరిశీలించారు. విద్యార్థులు కూర్చుండేందుకు సరఫరా చేసిన గ్రీన్ మ్యాట్లను ఉపయోగించకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా యంత్రాంగం నుంచి సరఫరా అయిన ప్రతి వస్తువును విదార్థుల కోసం వినియోగించాలని లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పలువురు విద్యార్థులతో మాట్లాడారు. జ్వరం, విరేచనాలు,వంటి అనారోగ్య సమస్యలు వస్తే అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిర్దిష్ట సమయం ప్రకారం వైద్యాధికారితో ప్రతి విద్యార్థికి వైద్యపరీక్షలు చేయించాలని ఆదేశించారు. మెడికల్ రిజిస్టర్ ను తనిఖీ చేసి విద్యార్థులకు ఇచ్చిన మందులను పరిశీలించారు. మైనార్టీ గురుకులను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో కలిసి బోజనం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన మెనూ ఖచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. తరగతిగదులను పరిశీలించిన కలెక్టర్ ఆరవ తరగతి విద్యార్థులను ఇంగ్లీష్ కు సంబంధించిన ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. జిల్లా బిసి సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్ ఉన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతం

డిపిఒ మధు మోహన్



**ప్రజాపక్షం / సారంగాపూర్ :** జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు నిర్మాణాలను వేగవంతంగా చేపట్టేలా వారిని అన్ని విధాలుగా ప్రోత్సాహించాలని డిపిఒ మధు మోహన్ అధికారులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద లబ్ధిదారులు చేపట్టిన ఇండ్ల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. తహసీల్దార్ వహీదుద్దీన్, ఎంపిడిఒ చౌదారం గంగాధర్, ఎంపిఒ సలీం, ఈఈ, ఎఇ వాసవి, సిఒ కోటి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొండ్ర రామచంద్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శిఇందిరమ్మ లబ్ధిదారులుపాల్గొన్నారు.

## 30, 31 తేదీలలో 'కెజిబివి'లో ఇంటర్మీడియట్ కోర్సులకు స్పాట్ అడ్మిషన్

జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** జూలై 30, 31 తేదీలలో కెజిబివిలో ఇంటర్మీడియట్ కోర్సులకు స్పాట్ అడ్మిషన్ ఇవ్వడం జరుగుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఉన్న 8 కసుర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో ఇంటర్మీడియట్ వివిధ కోర్సులకు, అంతర్గాంలో 10 బైపిసి, జూలపల్లిలో 15 బైపిసి, మంథని ముత్తారంలో 16 సిఇసి, 19 ఎంపిహెచ్‌డబ్ల్యూ, ఓదెలలో 18 ఎంపిసి, 27 బైపిసి, పాలకుర్తిలో 19 ఎంఎల్‌టి, 19 బైపిసి, రామగిరిలో 10 ఎంపిసి, కంప్యూటర్ సైన్స్ 25, శ్రీరాంపూర్‌లో 20 సిఇ.సి, 2 ఎంపిహెచ్‌డబ్ల్యూ, సుల్తానాబాద్‌లో 21 ఎంపిహెచ్‌డబ్ల్యూ సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు నేరుగా జూలై 30, 31న స్పాట్ అడ్మిషన్ పొందవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# క్రీడ

## బెంగళూరులో దులీప్ ట్రోఫీ.. నాగ్‌పూర్‌లో ఇరానీ కప్!



దేశవాళీ క్రికెట్ పండుగకు మరో ఇరవై రోజుల్లో తెరలేవనుంది. ఆగస్టు చివరి వారంలో బెంగళూరు వేదికగా దులీప్ ట్రోఫీతో డొమెస్టిక్ సీజన్ 2025–26 ప్రారంభం కానుంది. ఆ వెంటనే టీ20 ఫార్మాట్లో జరుగబోయే ఇరానీ కప్ మ్యాచ్‌లకు నాగ్‌పూర్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈసారి టీమిండియా స్టార్ తిలక్ వర్మ సారథిగా తన తడాఖా చూపించేందుకు సిద్ధమవుతున్నాడు. ఇంటర్ జోన్ ఫార్మాట్లో జరుగనున్న దులీప్ ట్రోఫీలో తిలక్ సౌత్ జోన్ జట్టును నడిపించనున్నాడు.

**దులీప్ ట్రోఫీ ఇంటర్ జోన్**

ఫార్మాట్లో జరుగనున్న దులీప్ ట్రోఫీ ఆగస్టు 18న మొదలై సెప్టెంబర్ 15న ముగుస్తుంది. బీసీసీఐ కొత్తగా నిర్మించిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ మైదానంలో మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. టైటిల్ కోసం ఆరుజట్లు కాచుకొని ఉన్నాయి. సౌత్ జోన్, సెంట్రల్ జోన్, వెస్ట్ జోన్, ఉత్తర జోన్, తూర్పు జోన్, ఈశాన్య జోన్ టీమ్స్ తలపడనున్నాయి. వీటిలో సౌత్, వెస్ట్ జోన్ జట్లు నేరుగా సెమీ ఫైనల్‌కు అర్హత సాధించాయి. ఆగస్ట్ 28నార్త్, ఈస్ట్ మధ్య ఆగస్టు 31న సెంట్రల్, ఈశాన్య జోన్ల మధ్య క్వార్టర్ ఫైనల్ ఫైట్ జరుగనుంది. సెప్టెంబర్ 4 నుంచి 7వ తేదీ వరకూ సెమీఫైనల్ మ్యాచ్‌లు నిర్వహిస్తారు. సెప్టెంబర్ 11న జరిగే ఫైనల్‌తో టైటిల్ విజేత ఎవరో తేలిపోనుంది.

**కరుణ్ ఏ జట్టుకు**

దులీప్ ట్రోఫీ తర్వాత నాగ్‌పూర్ వేదికగా ఇరానీకప్ జరుగనుంది. గత సీజన్ రంజీ విజేత విదర్భ, రెస్ట్ ఆఫ్ ఇండియాను ఢీకొననుంది. అయితే.. నిరుడు విదర్భ తరఫున పరుగుల వరద పారించిన కరుణ్ నాయర్ ఈసారి ఆడతాడా? లేదా? అనేది తెలియాల్సి ఉంది. ఈమధ్యే అతడు సొంత జట్టు కర్నాటకకు మారాడు. కానీ, సౌత్ జోన్ సెలెక్టర్లు మాత్రం కరుణ్‌ను దులీప్ ట్రోఫీ స్క్వాడ్‌లోకి తీసుకోలేదు. దాంతో, ఈ స్టార్ ప్లేయర్ ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీలో ఆడడంపై అనిశ్చితి నెలకొంది. మరో విషయం.. యువ పేసర్ రసిక్ దార్ సలాం జమ్ముకశ్మీర్ జట్టును వీడాడు. బోర్డు నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ రావడంతో ఈ స్పీడ్‌స్టర్ బరోడాకు మారాడు. ఇప్పటికే ఐపీఎల్ స్టార్ జితేశ్ శర్మ సైతం బరోడాకు ఆడేందుకు సిద్ధమయ్యాడు.

## యూత్ ఓపెన్ రెగెట్టాలో రిజ్వాన్ ముందంజ

రెండోస్థానంలో బన్నీ



హుస్సేన్ సాగర్‌లో సికింద్రాబాద్ క్లబ్ టిస్కాన్ యూత్ ఓపెన్ రెగెట్టా పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. రెండో రోజు పోటీల్లో ఆప్టిమిస్ట్ మెయిన్ ఫ్లీట్ విభాగంలో ఎన్‌వైఎస్‌సీ టీమ్‌కు చెందిన మహ్మద్ రిజ్వాన్ అత్యుత్తమ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. ఆరు రేసుల్లో 10 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచాడు రిజ్వాన్. టీఎస్‌సీకి చెందిన బొంగూర్ బన్నీ రెండో స్థానం, ఆర్‌ఎంవైసీ తరఫున పోటీపడిన కృష్ణా వెంకటాచలం మూడో స్థానం దక్కించుకున్నారు.

బాలికల విభాగంలో సికింద్రాబాద్ సెయిలింగ్ క్లబ్‌కు చెందిన శ్రీంగేరి రాయ్ తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ ఓవరాల్‌గా అగ్రస్థానంలో ఉంది. ఐఎల్‌సీయే బాలుర కేటగిరీలో ఎన్‌వైఎస్‌సీకి చెందిన రమాకాంత్ సత్తా చాటాడు. ఆరు రేసుల్లో 19 పాయింట్లు సాధించి మొదటి స్థానంలో నిలిచాడు. బాలికల విభాగంలో ఆస్థా పాండే ముందంజలో ఉంది.

వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో తొలిరోజు వాయిదా పడిన ఆప్టిమిస్ట్ గ్రీన్ ఫ్లీట్ కేటగిరీ రెండో రోజు జరిగింది. 36 మంది యువ సెయిలర్లు పోటీపడగా.. టీఎస్‌సీకి చెందిన యువరాజ్ అగ్రస్థానం సాధించాడు. అటు బాలికల విభాగంలో సీఈఎస్‌సీకి చెందిన సోనియా బ్రార్ సత్తా చాటింది.

## 'బిసిసిఐ' కార్యాలయం నుంచి ఐపిఎల్ జెర్సీల చోరీ!

ముంబయి వాంఖడే స్టేడియంలోని బిసిసిఐ కార్యాలయం నుంచి 6.5 లక్షల రూపాయల విలువైన ఐపిఎల్ 2025 జెర్సీలు చోరీకి గురయ్యాయి. నిందితుడైన సెక్యూరిటీగార్డు ఫరూఖ్ అస్లాం ఖాన్‌ను పోలీసులు అరెస్టు చేసినట్లు సమాచారం. అతడు దాదాపు 261 జెర్సీలను దొంగిలించినట్లు తెలుస్తోంది. ఒక్కోదాని ఖరీదు సుమారు 2,500 రూపాయలు ఉంటుందని అంచనా. ఆన్‌లైన్ జూదానికి బానిసైన సెక్యూరిటీగార్డు ఈ చోరీకి పాల్పడ్డాడని పోలీసుల విచారణలో తేలింది. అయితే జెర్సీలు వేరు వేరు జట్లకు చెందినవి అయినప్పటికీ, అవి ఆటగాళ్ల కోసమా.. లేక అభిమానుల కోసమా అనేది కచ్చితంగా తెలియదు. ఆ సెక్యూరిటీ గార్డు తాను దొంగిలించిన జెర్సీలను హరియాణాకు చెందిన ఆన్‌లైన్ డీలర్‌కు విక్రయించాడు. ఈ డీల్ కోసం నిందితుడు, అతణ్ని సోషల్ మీడియా ద్వారా సంప్రదించాడు. ఈ దొంగతనం జూన్ 13న జరిగినప్పటికీ ఆలస్యంగా వెలుగు చూసింది. స్టోర్‌రూమ్‌లో స్టాక్ మిస్సయినట్లుగా ఆడిట్‌లో తేలడంతో ఈ చోరీ ఉదంతం బయటకు వచ్చింది. బిసిసిఐ అధికారులు సీసీ టీవీ ఫుటేజ్‌లను పరిశీలించగా, ఆ సెక్యూరిటీ గార్డు జెర్సీలను ఒక పెట్టెలో పెట్టుకొని వెళ్లిపోయినట్లు గుర్తించారు. ఆ జెర్సీలను తాను కొరియర్ ద్వారా ఆన్‌లైన్ డీలర్‌కు పంపినట్లు నిందితుడు తెలిపాడు. అయితే ఎంత మొత్తానికి అమ్మింది ఇంకా తెలియాల్సి ఉంది.



సెక్యూరిటీ గార్డు నుంచి జెర్సీలను కొనుగోలు చేసిన డీలర్‌ను విచారణ కోసం పోలీసులు హరియాణా నుంచి పిలిపించారు. అయితే జెర్సీలు దొంగిలించిన విషయం తనకు తెలియదని డీలర్ పోలీసులకు తెలిపాడు. 'కార్యాలయంలో జరుగుతున్న పునరుద్ధరణ పనుల కారణంగా, స్టాక్ క్లియరెన్స్‌లో భాగంగా జెర్సీలు అమ్మకానికి ఉన్నాయని గార్డు తనకు చెప్పాడు' అని ఆన్‌లైన్ డీలర్ పోలీసుల విచారణలో వాపోయాడు. చోరీకి గురైన వాటిలో 50 జెర్సీలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డీలర్ నుంచి నేరుగా తన బ్యాంకు ఖాతాకు డబ్బులు వచ్చాయని నిందితుడు తెలిపాడు. అయితే ఆన్‌లైన్ బెట్టింగ్‌లో ఆ మొత్తాన్నీ పోగొట్టుకున్నానని అతడు తెలిపాడు. దీంతో ఆ సెక్యూరిటీ గార్డు బ్యాంక్ ఖాతాలను పోలీసులు తనిఖీ చేస్తున్నారు. అయితే.. జెర్సీలు మిస్సయిన విషయమై జులై 17న బిసిసిఐ అధికారులు మెరైన్ డ్రైవ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

# ఫోకస్ మహిళ

## సత్వర చర్యలు అత్యవసరం



మహిళల ఆరోగ్య సమస్యలు ఎక్కువ అనేది బహిరంగ రహస్యం. చాలా మంది మహిళలు వివిధ కారణాలతో, సమస్యలను బయట పెట్టకుండా, ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్న వైనం ఎన్నో సందర్భాల్లో చూస్తునే ఉన్నాం. మహిళలే స్వయంగా అప్రమత్తులు కావడం అత్యవసరం. అదే సమయంలో, మహిళల ఆరోగ్య సమస్యలకు పరిష్కారాలను చూపే దిశగా సంబంధిత వర్గాల నుంచి సత్వర చర్యలు అత్యవసరం. ముఖ్యంగా వైద్య సేవల అంతగా అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్న గ్రామీణ మహిళల గురించి ఆలోచించాలి. వైద్య సదుపాయాలు కల్పించాలి. పురుష ఆధిపత్యం వల్ల, మహిళలు వైద్యానికి అనుమతి తీసుకోవాల్సి రావడం దారుణం. ఈ పరిస్థితికి తెరపడాలి. ఆర్థికంగా మహిళ బలపడితేనే, సొంత నిర్ణయాలు తీసుకోగలుగుతుంది. ముఖ్యంగా వైద్య, ఆరోగ్య పరమైన అంశాల్లో మహిళ నిర్ణయాధికారిగా ఉండాలి. అందుకుగాను ఆర్థికంగా ఎదగాలి. ప్రభుత్వాలు, సేవా సంస్థలు ఈ విషయంలో సాయం అందించాలి. జీవనశైలి ఒత్తిడుల నుంచి మహిళలు, ప్రత్యేకించి పట్టణ ప్రాంతాల్లోని వారు బయటపడాలి. సమయం లేకపోవడం వల్ల తన ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడం తగదు. ఉద్యోగ ఒత్తిడి, మానసిక దౌర్బల్యం నుంచి విముక్తి పొందాలి. గ్రామీణ ప్రాంతాల్లో మహిళల ఆరోగ్యంపై అవగాహన పెంచాలి. అంగన్వాడీల ద్వారా గర్భిణులు, బాలికలకు పోషకాహారం అందించాలి. ఎప్పటికప్పుడు రక్త పరీక్షలు, బ్రెస్ట్ స్క్రీనింగ్, పాప్స్‌మియర్ టెస్టులు జరగాలి. మహిళల ఆరోగ్యాన్ని వ్యక్తిగత సమస్యగా తీసుకోకుండా, సామాజిక సమస్యగా గుర్తించాలి. ఆరోగ్యంగా ఉండే మహిళే ఆరోగ్యకర సమాజాన్ని నిర్మించగలదు. అందుకే, మహిళల శారీరక, మానసిక, పోషణ, లైంగిక ఆరోగ్యాన్ని సమగ్రంగా పరిశీలించి ప్రభుత్వాలు, సామాజిక సంస్థలు, కుటుంబం సమష్టిగా కలిసి పని చేయాలి. ఎందుకంటే, ఒక మహిళ ఆరోగ్యంగా ఉంటే, కుటుంబం ఆరోగ్యంగా ఉంటుంది. కుటుంబం ఆరోగ్యంగా ఉంటే, సమాజం ఆరోగ్యంగా ఉంటుంది. సమాజం ఆరోగ్యంగా ఉంటేనే, దేశం అభివృద్ధి చెందుతుంది.

## గణాంకాల్లో మహిళలు..

భారతదేశం సహా ప్రపంచవ్యాప్తంగా మహిళల స్థితిగతులపై గణాంకాలు తీసుకొని చూస్తే, వివిధ రంగాల్లో పురోగతి ఉన్నా కూడా లింగ అసమానతలు, అణచివేతలు ఇంకా కొనసాగుతున్నాయనే విషయం స్పష్టమవుతుంది. భారతదేశానికి సంబంధించిన అందుబాటులో ఉన్న గణాంకాలను (2023–24) ఆధారంగా వివిధ అంశాల వారీగా పరిశీలిస్తే, ఈ విషయం స్పష్టమవుతుంది.



**1. విద్యా రంగం**

స్త్రీల అక్షరాస్యత రేటు..
పురుషులు: 84.7 శాతం
మహిళలు: 70.3 శాతం
గ్రామీణ మహిళల్లో సెకండరీ విద్య పూర్తి చేసిన వారు: 46 శాతం
ఉన్నత విద్యలో పూర్తిచేసిన వారు: 49 శాతం

**2. ఉద్యోగం, ఆర్థిక స్వావలంబన**

మహిళల శ్రమ శక్తి పాల్గొనే రేటు..
మహిళలు: 37 శాతం
పురుషులు: 77 శాతం
గ్రామీణ ప్రాంతాల్లో: 42 శాతం
నగరాల్లో: 24 శాతం
(మహిళలు సాధారణంగా అధికంగా వ్యవసాయం, అనధికార రంగాల్లోనే పని చేస్తున్నారు).

**3. బాలికలలో అనీమియా స్థాయి**

15–49 ఏళ్ళ మహిళల్లో 57 శాతం మంది ఈ సమస్యతో బాధపడుతున్నారు.

**4. లైంగిక హింస, వేధింపులు మహిళలపై దాడులు..**

2022లో 4.45 లక్షల కేసులు నమోదు (ఎన్‌సిఆర్‌బి ప్రకారం)
అత్యాచార కేసులు: రోజుకు సగటున 90.
గృహ హింస: ప్రతీ 3 మందిలో ఒకరు జీవితంలో ఏదో ఒక దశలో గృహ హింసను ఎదుర్కొంటున్నారు.

**5. రాజకీయ ప్రతినిధిత్వం..**

లోక్‌సభలో మహిళల శాతం (2024): 15 శాతం.
రాజ్యసభలో: 14 శాతం.
గ్రామ పంచాయతీ స్థాయిలో మహిళల రిజర్వేషన్: 33% (చాలా రాష్ట్రాల్లో 50% వరకు ఉంది)

**6. బాలికల స్థితి..**

బాలిక శిశు లింగ నిష్పత్తి (06 ఏళ్ళ వయస్సు):
2011: ప్రతి 1000 మంది బాలురకు 918
2021 (ప్రాథమిక గణాంకం) ప్రతి 1000 మంది బాలురకు 929

**బాల్యవివాహాలు..**

20–24 ఏళ్ల మహిళల్లో 23.3 శాతం మంది వివాహం 18 సంవత్సరాలలోపే జరుగుతున్నది.

**7. మహిళా శక్తీకరణ, డిజిటల్ భాగస్వామ్యం..**

జన్‌ధన్ యోజన పథకం ద్వారా బ్యాంక్ ఖాతాలు కలిగిన మహిళలు: 26 కోట్లకుపైగా
స్వయం సహాయ సమూహాల్లో మహిళల సంఖ్య: 8 కోట్లకు పైగా
ముద్రా యోజన ద్వారా లభించిన రుణాల్లో 68 శాతం రుణాలు మహిళలు పొందుతున్నారు.

## చర్మ సౌందర్యానికి..



**మొటిమలు:** రోజూ చక్కగా ముఖం క్లీన్ చేయండి – మైల్డ్ ఫేస్‌వాష్ వాడండి. టీ ట్రీ ఆయిల్‌ను నీటిలో కలిపి మొటిమలపై అప్లై చేయండి. ఇంట్లో ఉండే పసుపు, తేనె మిశ్రమాన్ని మొటిమలపై అప్లై చేయవచ్చు. పుల్లని, మసాలా అధికంగా ఉన్న ఆహారానికి దూరంగా ఉండండి. కనీసం తగ్గించండి.

**చర్మం నలుపు / మచ్చలు:** రోజూ సన్‌స్క్రీన్ వాడండి (ఎస్‌పిఎఫ్ 30 లేదా అంతకంటే ఎక్కువ). రోజూ రాత్రి ఆల్మండ ఆయిల్ లేదా ఆలివ్ ఆయిల్ రాసి మసాజ్ చేయండి. బొప్పాయి గుజ్జు, నిమ్మరసం మిశ్రమం మచ్చలపై వారానికి 2సార్లు రాయండి.

**చర్మం మీద ముడతలు / వృద్ధాప్య లక్షణాలు:** రాత్రిపూట విటమిన్ 'ఇ' ఆయిల్ రాసుకుని నిద్రపోవడం మంచి పరిష్కారం. అవిసె పిండి, పెరుగు మిశ్రమాన్ని వారానికి 2సార్లు చొప్పున ముఖానికి రాయండి. నీరు ఎక్కువగా తాగితే, చర్మం నిగారింపు పొందుతుంది. సిగరెట్, మద్యం, నిద్రలేమి వంటివి ముడతలకు ప్రధాన కారణం. వాటిని నివారించండి. నిత్యం ముఖం క్లీన్ చేయండి. మేకప్ లేకపోయినా రోజు రెండుసార్లు ముఖాన్ని సాఫ్ట్ క్లీన్సర్‌తో శుభ్రం చేయాలి.

రాత్రిపూట అల్మాండ్ ఆయిల్ లేదా ఆలివ్ ఆయిల్ రాసి మృదువుగా మసాజ్ చేస్తే చర్మం నిగారింపు పొందుతుంది.

పసుపు, పెరుగు ప్యాక్ చర్మం పైన గ్లో రావడానికి వాడాలి. దీనిని వారంలో 2సార్లు అప్లై చేయండి.



## నేడు వరంగల్‌లో జిల్లా మహాసభ

సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి

**ప్రజాపక్షం/ వరంగల్ :** జూలై 30 ,31వ తేదీలలో సిపిఐ వరంగల్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి జిల్లా ప్రజలలకు పిలుపునిచ్చారు. మంగళవారం ధర్మారం గ్రామంలో గీసుగొండ మండల మహాసభకు ఎండి పాషా, భారతిలు అధ్యక్ష వర్గంగా వ్యవహరించగా ముఖ్య అతిథిగా హాజరైన మేకల రవి మాట్లాడుతూ సిపిఐ నిత్యం పేద మధ్య తరగతి ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ఒత్తిడి తెచ్చే విధంగా ప్రజలందరిని ఐక్యం చేస్తున్నాం అని అన్నారు. ఈ మహాసభలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్కె భాష్మీయ, పనాస ప్రసాద్‌లు మాట్లాడగా జిల్లా కార్యవర్గ సభ్యులు గన్నారపు రమేష్, దండు లక్ష్మ ణ్, గుండె బద్రి చంద్రకళ, వీరగోని శంకరయ్య జిల్లా సమితి సభ్యులు ఓర్సు రాజు, ఎండీ అక్బర్ రత్నాకర్ రెడ్డి లు పాల్గొన్నారు.

## మెటీరియల్ ఇవ్వకుండా ఇండ్ల నిర్మాణం ఎలా?

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక, మొరం పర్మిషన్లు ఇవ్వక త్వరగా నిర్మాణాలు పూర్తి చేయాలని ఒత్తిడి చేయడం సరైనది కాదని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు అన్నారు. మంగళవారం జిల్లా ఎఐటియుసి కార్మిక భవనంలో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. ఇసుక, మొరం లేక పనులు ఆగిపోతున్నాయని, ప్రతిరోజు ఇసుక మొరంకు పర్మిషన్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మెటీరియల్ లేక భవన నిర్మాణ కార్మికులకు సైతం పనులు దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ వెంటనే స్పం దించి ఇంటి నిర్మాణం కోసం మెటీరియల్ ప్రభుత్వ నిబంధనల మేరకు ,సలాఖసిమెం ట్ ధరలు నియంత్రణలో ఉండేలా చొరవ చూపాలన్నారు అధిక ధరలకు సిమెంట్‌సలా ఖ అమ్మే దుకానదారులపై చర్యలు తీసుకోవాలని, ఇసుక, మొరం, కాంక్రీట్, కంకరౌతు అమ్మే ట్రాక్టర్లు, టిప్పర్‌లు అధికారులు సీజ్ చేసి జరిమానాలు విధించడం జరుగుతుందని, అధికారులు అనుమతులు ఇచ్చినట్లైతే ధరలు నియంత్రణలో ఉండి, ఇందిరమ్మ ఇండ్లు త్వరగా పూర్తి అయ్యేవని అన్నారు. దీవిచే ఇంటి నిర్మాణ దారులు సైతం అధిక ధరల భారం నుండి బయట పడేవారని, సామాన్య, మధ్యతరగతి కుటుంబాల వారు ఫైనాన్స్‌లు, అప్పులు చేసి ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తున్నారని, ట్రాక్టర్లు, టిప్పర్లను సీజ్ చేసిన వాటిని వెంటనే వదిలేసి వారికి ఉపాధి లభించేలా ప్రతిరోజు అనుమతులు ఇవ్వాలని, ధరలను నియంత్రించాలని, ఇంటి యజమానులపై భారం తగ్గించాలని, ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు రాక చాలా మంది ట్రాక్టర్లు, టిప్పర్లు కొనుక్కొని ఉపాధి పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు అజ్జ వేణు, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టపర్చాలి

కార్మిక చట్టాల పరిరక్షణకు ఉద్యమించాలి : బాలరాజు



**ప్రజాపక్షం/నల్లగొండ:** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాలరాజు కార్మికులకు పిలుపునిచ్చారు. ఎఐటియుసి అనుబంధ సివిల్ సప్లై హామాలి వర్కర్స్ యూనియన్ నల్లగొండ జిల్లా సమావేశం మంగళవారం జిల్లా కార్యాలయంలో బి.మహేష్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి బాలరాజు ముఖ్య అతిథిగా హాజరైన మాట్లాడుతూ సంస్కరణల పేరుతో కార్మిక చట్టాలను కుదించి, కార్మికుల శ్రమ దోపిడీ చేస్తున్నారని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని సుప్రీంకోర్టు చెప్పిన ప్రభుత్వం అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తుందని, ప్రజలకు ప్రభుత్వానికి మధ్యల వారధిగా ఉంటూ ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యవసర వస్తువులను సరఫరా చేస్తున్న కార్మికులను ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణమని వారు అన్నారు. పెరుగుతున్న నిత్యవసర ధరలకు అనుగుణంగా కూలి రేట్లు లేవనీ, హమాలీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం ఇవ్వాలని ఈ సందర్భంగా వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎఐటియుసి సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్ రావు మాట్లాడుతూ దేశంలోని హమాలీ కార్మికులకు సమగ్ర చట్టం లేకపోవడం వల్ల రక్షణ కరువై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ ఆవేదన వ్యక్తం చేశారు. హమాలిలకు ప్రమాద బీమా 10 లక్షల కల్పించాలని, నూతన గోదాంలను నిర్మించాలని ఆయన కోరారు. ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ప్రజలకు బియ్యంతో పాటు ఇతర నిత్యావసర సరుకులు కూడా సివిల్ సప్లై ద్వారా అందివ్వాలని కోరారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలు నరేంద్ర మోడీ ప్రభుత్వం పూర్తిగా మార్చి వేస్తూ పెట్టుబడిదాలకు అనుకూలంగా చేస్తున్నారని ఆరోపించారు. పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని హక్కుల సాధన కోసం హామాలి కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశం లో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దొనకొండ వెంకన్న, ఉపాధ్యక్షులు బి మహేష్,నాగరాజు, అశోక్, కృష్ణయ్య, రఘు, శ్రీనివాసులు, రవి, శ్రీశైలం, రమేష్, శివ, ధర్మతేజ, లింగం, నాగార్జున, లింగస్వామి, గోపి, బాలస్వామి, కే శ్రీను,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## భూ నిర్వాసితులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలి

తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధానకార్యదర్శి పశ్య పద్మ డిమాండ్


**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** నారాయణపేటమక్తల్ కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన పరిహారం చెల్లిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధానకార్యదర్శి పశ్య పద్మ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నారాయణపేట మండలం పేరపల్లి గ్రామంలో భూ నిర్వాసిత రైతుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భూ నిర్వాసిత రైతులను కలిసిన పశ్య పద్మ దీనికి సంబంధించి వివరాలను తెలుసుకున్నారు. నారాయణపేటమక్తల్‌కొడంగల్ ఎత్తిపోతల పథకం కోసం భూసేకరణ చేస్తున్న ప్రభుత్వ అధికార యంత్రాంగం, రైతులను బలవంతంగా ప్రలోభాలకు గురిచేస్తూ మాయ మాటలు చెప్పి భూసేకరణ చేయడం తగదన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం న్యాయమైన పరిహారం ఇవ్వాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నారాయణపేట జిల్లా ప్రగతి బాట పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవ బహిరంగ సభలో ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతులకు ముఖ్యమంత్రి ఇచ్చిన మాటను పశ్య పద్మ గుర్తుచేశారు. ఇచ్చిన నిలబెట్టుకోవాలన్నారు. భూములు కోల్పోతున్న రైతులు మాట్లాడుతూ ప్రాజెక్టు కోసం భూములు ఇవ్వడం సంతోషించదగ్గ విషయమే అయినప్పటికీ సరైన పరిహారం అందడం లేదని వాపోయారు. భూములను సేకరించేందుకు రెవెన్యూ అధికారులు గ్రామాల్లో చేసిన సర్వే తప్పులతడకగా ఉందని ఆరోపించారు. భూవిస్తీర్ణ వివరాలు సరిగ్గా సేకరించడం లేదని, ఎకరాకు రూ.14 లక్షల నష్టపరిహారం కేటాయించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు.



బహిరంగ మార్కెట్లో ఎకరాకు రూ.40 లక్షల విలువ ఉన్నదన్నారు. తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూమిని తాము కోల్పోతే జీవనాధారం అత్యంత కష్టతరమవుతుందని రైతులు రైతు సంఘం నేత పశ్య పద్మ ఎదుట తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పశ్యపద్మ మాట్లాడుతూ నారాయణపేటమక్తల్‌కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టు కోసం భూమిని కోల్పోతున్న రైతులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మెడికల్ కాలేజీ, ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవ బహిరంగ సభలో స్వయంగా హామీ ఇచ్చారని, ఎకరాకు 20 లక్షల రూపాయలైనా సరే రైతులకు న్యాయమైన పరిహారం అందిస్తామని, అభివృద్ధికి అడ్డుపడకండి అని, ఎవరి మాటలూ నమ్మొద్దని, భూసేకరణకు సహకరించాలని రైతులకు విజ్ఞప్తి చేసిన విషయాన్ని ఆమె ఈ సందర్భంగా గుర్తు చేశారు. అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, రైతులకు న్యాయం చేస్తామని మీరు ఇచ్చిన అభయం ప్రకారమే ఎకరాకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని పశ్యపద్మ సిఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. తరతరాలుగా రైతులు సాగు చేసుకుంటున్న భూముల్లో వారి సొంత ఖర్చులతో పండ్లతోటలు, చెట్లు, రోడ్లు, బావులు, బోర్లు, పశువుల పాకలు వేసుకున్నారని వాటికి కూడా నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. భూనిర్వాసిత రైతులు చేస్తున్న పోరాటానికి తెలంగాణ రైతు సంఘం అండగా ఉంటుందని రైతు సంఘం నేత పశ్యపద్మ హామీ ఇచ్చారు. దీనికి సంబంధించి సమగ్రమైన విషయాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి మీ సమస్యను పరిష్కారించడానికి చొరవ తీసుకుంటానని రైతులకు ఆమె అభయం ఇచ్చారు. రైతులకు న్యాయమైన పరిహారం అందే వరకు ఈ పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు. ముఖ్యమంత్రి నారాయణపేట జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టి ఈ ప్రాంత రైతాంగానికి న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అన్ని విధాలుగా వెనుకబాటుకు గురైన నారాయణపేట జిల్లాకు ప్రాజెక్టు తప్పనిసరి అవసరమన్నారు. ఈ ప్రాంతానికి నీళ్లు అవసరమని, అదే సమయంలో భూనిర్వాసితులకు కూడా సరైన న్యాయం చేయాలని కోరారు. గత 14 రోజులుగా భూ నిర్వాసిత రైతులు న్యాయమైన పరిహారం కోసం ఆందోళన చేస్తున్నా ప్రభుత్వ అధికారులు, ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు ఏమాత్రం పట్టించుకోకపోవడం అత్యంత బాధాకరం అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నారాయణపేట జిల్లా నాయకులు దాసరి చెన్నయ్య, నాగరాజు, సంతోష్, వెంకటేష్, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

## త్వరగా కెఎల్ఐ ఉపకాల్వల పనులు

ప్రజలపక్షాన పోరాడే ఏకైక పార్టీ సిపిఐ : ఎం.బాల్‌నర్సింహ్మా



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్/కల్వకుర్తి :** ప్రజలపక్షాన పోరాడే ఏకైక పార్టీ సిపిఐ అని రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మా అన్నారు. మంగళవారం కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడు తూ సిపిఐ అ వతరించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి నియోజకవర్గంలో ఆగస్టు 1,2 తేదీలలో సిపిఐ జిల్లా తృతీయ మహాసభలను నిర్వహించడం జరుగుతుందన్నారు. మహాత్మాగాంధీ కల్వకుర్తి లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టుకు మొదటగా సిపిఐ ఆధ్వర్యంలోనే ఉమ్మడి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమంతో పాటు పాదయాత్ర చేసిన ఏకైక పార్టీ సిపిఐ అని ఆయన గుర్తు చేశారు. కెఎల్ఐ ప్రాజెక్టులో కల్వకుర్తి పేరు ఉంది కాని సాగునీరు పూర్తిస్థాయిలో రావడం లేదన్నారు. మొదట ప్రాజెక్టు ప్రారంభంలో 2లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని ప్రాజెక్టు అంచనాలో లేని మండలాలను కలుపుతూ కల్వకుర్తికి అన్యాయం జరుగుతుందని ఆయన విమర్శించారు. ప్రస్తుత మున్న కాల్వల మోటార్ల సహాయంతో రెండున్నర లక్షలకు మాత్రమే సాగునీరు అందించే అవకాశమున్న 4లక్షల ఎకరాలకు సాగును అందిస్తామని రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే కాల్వల విస్తీర్ణం పెంచి, కాల్వ వల్ల భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందించి ఉపకాల్వలను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు వార్ల వెంకటయ్య, కేశవులు గౌడ్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు సిహెచ్ శ్రీనివాసులు, సిపిఐ కల్వకుర్తి నియోజకవర్గ కార్యదర్శి పరుషరాములు, ఎఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు శివకృష్ణ, కల్వకుర్తిని యోజకవర్గ సహాయ కార్యదర్శి దారదాసు, కల్వకుర్తి ని యోజకవర్గ నాయకులు శంకరయ్య ఉన్నారు. కాగా కల్వకుర్తి పట్టణంలో ఆగస్టు 1,2తేదీలలో నిర్వహించే సిపిఐ జిల్లా తృతీయ మహాసభలను విజయవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర సభ్యులు ఎం. బాల్‌నర్సింహ్మా కోరారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడవెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్నలు హాజరవుతారని ఆయన తెలిపారు. సిపిఐ జిల్లా తృతీయ మహాసభలకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయ న పిలుపునిచ్చారు.



# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



**ప్రజాపక్షం/మధిర :** రైతును రాజు చేయాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం పెద్దపీట వేసిందని మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు అన్నారు. మంగళవారం మధిర మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన మిర్చి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క చొరవతో మధిర మార్కెట్‌ను రెగ్యూలర్ మార్కెట్‌గా చేస్తామన్నారు. అలాగే ప్రజా ప్రభుత్వంలో వరి సన్నధాన్యానికి రూ.500 బోనస్, రైతు రుణమాఫీతో పాటుఉ సాగు పెట్టుబడి కోసం రైతు భరోసా ఎకరా రూ.12వేలు అందచేస్తుందన్నారు. రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## మీనాక్షి నటరాజన్‌ను కలిసిన కట్ల రంగారావు



**ప్రజాపక్షం/వైరా :** హైదరాబాద్‌లో ఎంఎల్‌ఎ క్వార్టర్స్‌లో ఎఐసిసి తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షుడు బొమ్మా మహేష్‌కుమార్‌గౌడ్, ఉమ్మడి 10 జిల్లాల కాంగ్రెస్ వ్యవహారాలపై సమీక్షా సమావేశాలు నిర్వహించారు. నల్లగొండ జిల్లా సమీక్షా సమావేశంలో పాల్గొని ఎఐసిసి తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ని, టిపిసిసి అధ్యక్షుడు ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ని నల్గొండ జిల్లా కోఆర్డినేటర్ టిపిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు మర్యాదపూర్వకంగా కలిశారు.

## ఖమ్మంలో రేపు జాబ్‌మేళా

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లాలోని నిరుద్యోగ, యువతీ, యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించుటకు జులై 31న జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి ఎన్.మాధవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు మోడల్ కెరీర్ సెంటర్ (ప్రభుత్వ ఐటిఐ, ఐటిఐ ఖమ్మం నందు జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఒయాసిస్ ఫర్టిలిటీ కంపెనీ హైదరాబాద్‌లో ఒక ఫ్లోర్ కో ఆర్డినేటర్ పోస్ట్, ఆర్ట్ కోఆర్డినేటర్ ఒక పోస్టు, పేషెంట్ రిలేషన్ ఎగ్జిక్యూటీవ్ రెండు పోస్టులు (మహిళలు), బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటీవ్ (మెల్) రెండు పోస్టులు, అడ్మిన్ ఎగ్జిక్యూటీవ్ (మెల్) ఒక పోస్టు, పేషంట్ కౌన్సలర్ (మహిళలు) ఒక పోస్టు కు ఏదైనా డిగ్రీ విద్యార్హతతో, రెండు స్టాఫ్ నర్సు పోస్టులు ఎఎన్‌ఎం, జిఎన్‌ఎం, బిఎస్సీ నర్సింగ్ విద్యార్హతతో, రెండు ఫార్మసిస్టు పోస్టులు డిప్లోమా, డిగ్రీ ఇన్ ఫార్మసీ విద్యార్హత ఉండాలన్నారు. ఎంపికైన వారికి వేతనం రూ.25వేల నుండి రూ.30వేల వరకు ఉంటుందన్నారు. మధుకాన్ షుగర్ పవర్ ఇండస్ట్రీలో ట్రైనీ అసిస్టెంట్ (బిఎ, బికాం), ట్రైనీ (ఐటిఐ ఫిట్టర్), ట్రైనీ కెమిస్ట్ (బిఎస్సి కెమిస్ట్రి), బిఇటి (బిటెక్) విద్యార్హతతో 24 పోస్టులు ఖాళీగా ఉన్నాయని వీటికి దరఖాస్తు చేసుకునేందుకు అభ్యర్థులకు 18 నుండి 30 సంవత్సరాల వయస్సు ఉండాలని ప్రభుత్వ నిబంధనల ప్రకారం వేతనం ఉంటుందన్నారు. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థలో 50 బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటీవ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వీటికి 20 నుంచి 35 సంవత్సరాల వయస్సు గల పురుషులు మాత్రమే దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ఏదైనా డిగ్రీ విద్యార్హత ఉండాలని వేతనం రూ.20,688 వేతనంతో పాటు పిఎఫ్, ఇఎస్ఐ లభిస్తాయన్నారు. మొత్తం 56 ఉద్యోగాల భర్తీకి గాను జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్హతల సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో జాబ్‌మేళాకు హాజరు కావాలని ఆమె తెలిపారు.


## బేసిక్ ఫౌండేషన్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి : పురంధర్

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** గ్రూప్స్, రైల్వే రిక్రూట్మెంట్ బోర్డ్, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, బ్యాంకింగ్ మొదలైన వివిధ పోటీ పరీక్షలకు సంబంధించి బేసిక్ ఫౌండేషన్ శిక్షణకు అర్హులైన మైనార్టీ అభ్యర్థులకు తెలంగాణ రాష్ట్ర మైనార్టీస్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నాలుగు నెలల పాటు ఉచితంగా అందిస్తున్నామని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి డా.బి.పురంధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బేసిక్ ఫౌండేషన్ శిక్షణకు ఆగస్టు 21లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఆఫ్‌లైన్ ద్వారా డిగ్రీ పూర్తి చేసుకున్న అర్హులైన మైనార్టీ (ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్సికులు) అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. అర్హత గల మైనార్టీ అభ్యర్థులు సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో ఆగస్టు 21లోపు దరఖాస్తులను సమర్పించాలన్నారు. దరఖాస్తుతో పాటు విద్యార్హతల సర్టిఫికెట్ జతపర్చాలని పురందర్ తెలిపారు.

## పెట్ షాపులు నిబంధనలు పాటించాలి

పశు వైద్యాధికారి క్రాంతికుమార్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** పెట్ షాప్‌లు, డాగ్ బ్రీడింగ్ కేంద్రాలు నిర్వహించే యజమానులు తప్పనిసరిగా నిబంధనలు పాటిస్తూ లైసెన్స్‌లు పొందాలని పశు వైద్యాధికారి కె.క్రాంతికుమార్ తెలిపారు. మంగళవారం పశువైద్యాధికారి క్రాంతికుమార్ ఆధ్వర్యంలో అనుమతిలేని పెట్ షాపులు, డాగ్ బ్రీడింగ్, మార్కెటింగ్ కేంద్రాలను తనిఖీ చేసి కుందేలు, కుక్కలు, పిల్లులు, పక్షులు, తాబేలు తదితర పెంపుడు జంతువులకు తగిన ఆహారం, శుభ్రమైన నీరు, నివాస వాతావరణం, వైద్య సేవలు తదితర వాటిని పరిశీలించారు. పలువురికి నోటీసులు జారీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్ షాప్ యజమానులు, డాగ్ బ్రీడింగ్ కేంద్రాలను నిర్వహించే వారు తప్పనిసరిగా లైసెన్స్‌లు పొందాలని, తెలంగాణ యానిమల్ వెల్ఫేర్ బోర్డ్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. జంతువుల ఆరోగ్యానికి సంబంధించిన రికార్డులు, రిజిస్టర్లు నిర్వహించాలన్నారు. సమయానికి టీకాలు వేయించాలన్నారు. తనిఖీలలో జెవిఒటి.కృష్ణ పాల్గొన్నారు.



## పదిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

జిల్లా విద్యాశాఖాధికారి సామినేని సత్యనారాయణ

**ప్రజాపక్షం/కొణిజర్ల :** పదోతరగతిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి సామినేని సత్యనారాయణ అన్నారు. మండల పరిధిలోని సింగరాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నతాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను మంగళవారం ఆయన ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు విద్యార్థులు ప్రస్తుత కంప్యూటర్ యుగంలో ఎప్పటికప్పుడు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని అన్నారు. అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను ఉపయోగించుకోవాలని తెలిపారు. ల్యాబ్‌లో విద్యార్థులు ప్రదర్శించిన ప్రయోగాలు చూసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలని తెలిపారు. ప్రతిరోజు పాఠశాలకు హాజరు కావాలని అన్నారు. గ్రామంలోని విద్యార్థులంతా ఈ పాఠశాలలో చేరాలని అన్నారు. విద్యార్థులంతా క్రమశిక్షణతో ఉన్నారని సంతృప్తిని వ్యక్తపరిచారు. పాఠశాల వాతావరణం చాలా బాగుందని కితాబిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.లక్ష్మీనారాయణ, మండల విద్యాశాఖాధికారి డి అబ్రహాం, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుని సుజాత, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ జహేదా, పాఠశాల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండా

వైభవంగా ముగిసిన భద్రాద్రి జిల్లా మహాసభలు

సభల్లో పలు తీర్మానాలు ఆమోదం

సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజా సమస్యల పరిష్కారమే భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ప్రధాన ఎజెండా అని, ఆ సమస్యల పరిష్కారం కోసం ఎందాకైనా, ఎవ్వరితోనైనా పోరాటం చేసేందుకు సిద్ధం అని ఆ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా తెలిపారు. మంగళవారం శేషగిరి భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రంగా ఈనెల 26, 27 తేదీల్లో సిపిఐ జిల్లా 3వ మహాసభలు అత్యంత ఘనంగా జరిగాయని, ఆ మహాసభల్లో 30 మందితో జిల్లా కార్యవర్గాన్ని, 79 మందితో కౌన్సిల్ ఏర్పాటు చేసుకున్నట్లు చెప్పారు. మహాసభల కంటే ముందే 22 రెవెన్యూ మండలాలు, 3 మున్సిపాలిటీలు, 1 నగరపాలక సంస్థ పరిధిలో 713 గ్రామశాఖల మహాసభలు జరిపామని, జిల్లా వ్యాప్తంగా సిపిఐలో 13474 మంది శాశ్వత ప్రాథమిక సభ్యత్వం కలిగిన వారు ఉన్నట్లు జాతీయ నాయకత్వ సూచనల మేరకు కమిటీలో 10 శాతం యువతకు, మరో 10 శాతం మహిళలకు ప్రధాన్యత కల్పించామని, మహాసభ వేదికగా 49 తీర్మానాలు ఆమోదం పొందాయన్నారు. ఇందులో ప్రధానంగా సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి నదీ జలాలు జిల్లాలోని ప్రతీ ఎకరాకు అందించాలని, కొత్తగూడెం, ఇల్లెందుల్లో ఓపెన్ కాస్టు బొగ్గ గనులను తక్షణమే ప్రారంభించాలని, అన్ని జిల్లా కేంద్రాల్లో కళాక్షేత్రాలు నిర్మించాలని, నూతన విద్యావిధానాన్ని ఉపసంహరించుకోవాలని, విద్యారంగానికి కేంద్ర బడ్జెట్‌లో 10 శాతం, రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలని, విద్యాహక్కు చట్టాన్ని అమలు చేస్తూ బకాయిలు విడుదల చేయాలని, ఆంధ్రాలో కలిసిన ఐదు పంచాయితీలను తిరిగి తెలంగాణలోని భద్రాచలంలో కలపాలని, పేదల సాగులో ఉన్న మిగులు పోడు భూములకు పట్టాలివ్వాలని, జాతీయ ఉపాధిహామీ పథకంలో 200 పనిదినాలు, రోజుకు రూ.600 చెల్లించాలని, జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, జర్నలిస్టులు, అడ్వకేట్లకు నామినల్ ధరకే ఇండ్ల స్థలాలు అందించి ప్రభుత్వం ద్వారా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, స్వామినాథన్ కమిషన్ మేరకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, మహిళలకు విద్యా, వైద్య రంగాల్లో ప్రత్యేక అవకాశాలు కల్పించాలని, మహిళా రక్షణ చట్టాలు, సంక్షేమ చట్టాలు అమలుచేయాలని, అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, తెలంగాణ ఉద్యమకారులకు 200గజాల ఇల్లు, ఇంటి నిర్మాణానికి రూ.10లక్షలు మంజూరీ చేయాలని, అశ్వారావుపేట కేంద్రంగా రెవెన్యూ డివిజన్, ఆర్టీసి డిపో, హార్టీకల్చర్ యూనివర్సిటీ, పోలీస్ సబ్ డివిజన్ ఏర్పాటు చేయాలని, పాల్వంచ కేంద్రంగా ఎరువుల కర్మాగారం, కెటిపిఎస్‌లో 800 మెగా వాట్ల పవర్ ప్లాంట్ ఏర్పాటుచేయాలని, జిల్లాలో పెండింగ్‌లో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణానికి నిధులు కేటాయించాలని, భద్రాచలం గోదావరి కరకట్ట నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి వరద ముంపు నుండి గ్రామీణ ప్రాంతాలకు రక్షణ కల్పించాలనే తిర్మానాలతో పాటు పలు తీర్మానాలు ఆమోదం పొందాయన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం నూతన నాయకత్వం ముందుకు సాగుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని నిలుపుకోవాలని, హామీల అమలు కాకుంటే ప్రశ్నించేందుకు, సాధనకు వెనుకడుగు వేసేదిలేదన్నారు.



## డెంగీ కేసులు నమోదైన గ్రామాల్లో.. ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు

జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ

**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** డెంగీ కేసులు నమోదైన ప్రాంతాల్లో తప్పనిసరిగా ప్రత్యేక హెల్త్ క్యాంప్ నిర్వహించాలని, డెంగీ కేసులను నివారించడంలో ఆలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ అన్నారు. మంగళవారం మండలంలోని చంద్రుతండా, మహమ్మదాపురం, సుబ్లేడు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఆయా గ్రామాల్లో నమోదైన డెంగీ బాధితుల వివరాలను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ డెంగ్యూ కేసులు నమోదైన గ్రామాల్లో తప్పనిసరిగా వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. గ్రామాల్లో క్రమం తప్పకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టడమే కాకుండా డెంగీ కేసులు నమోదైన ప్రాంతాల్లో డీ వార్మింగ్ చేయాలని తెలిపారు. సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్న తరుణంలో పంచాయతీ కార్యదర్శులు, ఎఎన్‌ఎంలు, ఆశాలు సమన్వయంతో పనిచేసి గ్రామ పెద్దలు, యువత భాగస్వామ్యంతో గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి టి.రాంబాబు, జిల్లా వైద్యాధికారి వి.సుబ్బారావు, ఎంపిడిఒ ఎస్కే సిలార్ సాహెబ్, ఎంపిఒ పి.సూర్యనారాయణ, పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ వసుంధర, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## ఎటిసి కోర్సుల గురించి విస్తృత ప్రచారం కల్పించాలి

సమీక్షలో అదనపు కలెక్టర్ శ్రీజ

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఐటిఐ, ఎటిసి సెంటర్లలో ఉన్న కోర్సుల గురించి జిల్లాలో విస్తృత ప్రచారం కల్పించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజ తెలిపారు. ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో అదనపు కలెక్టర్ పి.శ్రీజ మంగళవారం ఐటిఐ ప్రవేశాలు, అక్షరాస్యత, పారిశుధ్య నిర్వహణ, పెట్రోల్ పంప్ ఏర్పాటు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బిపిసిఎల్, ఐఒసిఎల్ ప్రతినిధులతో కలిసి గుర్తించిన స్థలాలను పరిశీలించి పెట్రోల్ బంక్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, అనుకూలంగా ఉన్న స్థలాలకు సంబంధించి ప్రతిపాదనలు పంపాలని అధికారులకు సూచించారు. ఖమ్మం జిల్లాలో ఏదులాపురం, రఘునాథపాలెం, మధిర, సత్తుపల్లి పరిసర ప్రాంతాల్లో ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ల ఏర్పాటుకు అనువైన స్థలం ఎంపిక చేయాలన్నారు. ఐటిఐ, ఎటిసి కేంద్రాల్లో మొత్తం 255 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ప్రతి మండలంలోని గ్రామాలు, పట్టణ ప్రాంతాలను కవర్ చేస్తూ ఐటిఐ, ఎటిసి కోర్సుల పట్ల అవగాహన కల్పించాలని వీటికి జెడ్పి సిఇఒ, మున్సిపల్ కమిషనర్ పూర్తి సహకారం అందించాలన్నారు. అందుబాటులో ఉన్న కోర్సులు, సీట్ల గురించి చిన్న చిన్న వీడియోలు చేసి సామాజిక మాధ్యమాల్లో ప్రసారం చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.సత్యనారాయణ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, ఆర్డీఒ నర్సింహారావు, అడిషనల్ డిఆర్‌డిఒ జయశ్రీ, ఖమ్మం కార్పొరేషన్ సహాయ కమిషనర్ అనిల్‌కుమార్, మున్సిపల్ కమిషనర్లు శ్రీనివాసరెడ్డి, సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

ప్రతి వారం ఇందిరమ్మ ఇండ్ల బిల్లులు జమ

అర్హులందరికీ విడతల వారీగా మంజూరు

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను తనిఖీ చేసిన కలెక్టర్



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు చేపట్టేలా వారికి అన్నివిధాలుగా అధికారులు సహకరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. రఘునాథపాలెం మండలం పువ్వాడనగర్ గ్రామంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద మంజూరైన లబ్ధిదారులు చేపట్టిన ఇండ్ల నిర్మాణాలను మంగళవారం తనిఖీ చేశారు. ఇంటి నిర్మాణం, పనుల్లో నాణ్యతను పరిశీలించారు. గ్రామంలో ఎన్ని కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులు సత్వరమే ఇండ్ల నిర్మాణాలను పూర్తిచేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. వివిధ కారణాల వల్ల ఇండ్ల నిర్మాణాలు ప్రారంభించలేక పోయిన లబ్ధిదారులను కలిసి వారు నిర్మాణం కోసం ప్రభుత్వం అందించే ఆర్థిక తోడ్పాటు గురించి వివరించి అవగాహన కల్పించారు. నిబంధనలకు అనుగుణంగా ఇండ్ల నిర్మాణాలు జరిగేలా అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఉచితంగా ఇసుకను అందిస్తుందని కూలీ, రవాణా ఛార్జీలు మాత్రమే లబ్ధిదారులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిసిఇఒ దీక్షారైనా, తహసీల్దార్ శ్వేత, ఎంపిడిఒ అశోక్ కుమార్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



**వన మహోత్సవంలో ఆరోగ్యకరమైన మొక్కలు పెంచాలి**

వన మహోత్సవంలో ఆరోగ్యకరమైన మొక్కలు పెంచడమే లక్ష్యంగా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. భావితరాలకు పచ్చదనం ఇచ్చే మొక్కలు పెంచే వన మహోత్సవ కార్యక్రమ విజయవంతానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. రఘునాథపాలెం మండలం జింకలతండా గుట్ట వద్ద వనమహోత్సవం వంటి ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలు కోసం మెగా బ్లాక్ ప్లాంటేషన్ మొక్కల పెంపకానికి అనువైన స్థలాన్ని మంగళవారం కలెక్టర్ పరిశీలించారు. గుర్తించిన స్థలాన్ని ఎర్రమట్టితో చదును చేసి మంత్రులతో, విఐపిలతో మెగా ప్లాంటేషన్‌లో మొక్కలు నాటే కార్యక్రమానికి తగు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నాటిన మొక్కలకు నీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిసిఇఒ దీక్షారైనా, డిఆర్‌డిఒ సన్యాసయ్య, రఘునాథపాలెం తహసీల్దార్ శ్వేత, ఎంపిడిఒ అశోక్‌కుమార్, అటవీ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రోగుల పట్ల వైద్యులు ప్రత్యేక శ్రద్ధ

ఏరియా ఆస్పత్రిని పరిశీలించిన పిఒ



**ప్రజాపక్షం/భద్రాచలం :** ఏరియాఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల వైద్యులు అప్రమత్తంగా ఉండాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు. మంగళవారం ఆయన భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి లేబొరేటరీ, ఆపరేషన్ థియేటర్, గర్భిణీల కాన్పుగది, కంటి ఆపరేషన్ల వార్డు, అల్ట్రాసౌండ్ స్కానింగ్ గది, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ వర్షాకాలంలో వైరల్ ఫీవర్లు, డెంగీ, మలేరియా వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రధానంగా గర్భిణీల పట్ల శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. గిరిబిడ్డలకు సరైన వైద్యం చేసి మందులు అందించాలని, గర్భిణీలు ఇబ్బందులు పడకుండా అంబులెన్సుల్లో తీసుకుని రావాలని, తల్లితో పాటు బిడ్డకు కూడా సరైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. అనంతరం వివిధ వార్డుల్లోని రోగుల వద్దకు వెళ్లిన ఆయన వారితో స్వయంగా మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రిలో ఏవైనా మైనర్ రిపేర్లు ఉంటే ప్రతిపాదనలు పంపాలని సూచించారు. అంతకు ముందు ఐటిడిఎ ఆవరణలోని వైటిసి పక్కన గల గిరిజన మహిళా ఆరోగ్య కార్యకర్తల శిక్షణా కేంద్రాన్ని సందర్శించిన ఆయన శిక్షణ తీసుకుంటున్న మహిళలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించాలని సూచించారు. మరమ్మతులు ఉంటే చేయాలని ఇంజనీరింగ్ అధికారులతో చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎడిఒ హెచ్‌ఒ సైదులు, ఎటిడిఒ అశోక్, ఇఇ హరీష్, ఎడిఎంహెచ్‌ఒ చైతన్య, టిఎ శ్రీనివాస్, హెచ్‌ఇఒలు కృష్ణయ్య, లింగానాయక్, ట్యూటర్లు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

**కీటక జనిత వ్యాధులపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలి – ఐటిడిఎ పిఒ :** కీటక జనిత వ్యాధుల పట్ల సంబంధిత వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలని ఐటిడిఎ పిఒ అన్నారు. మంగళవారం తన ఛాంబర్లో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. వర్షాకాలం సీజన్ పోయేంత వరకు మలేరియా అధికారులు, సిబ్బంది గ్రామాల్లో పర్యటించాలని, ప్రతీ నెల 7 నుండి 17వ తేది వరకు గ్రామాల్లో ర్యాపిడి ఫివర్ సర్వేలు చేయాలని, దోమలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పారిశుధ్యంపై అవగాహన కల్పించాలని, మలేరియా సిబ్బంది మంగళ, శుక్రవారం డ్రై డే నిర్వహించాలని అన్నారు. ప్రతీ పదిహేను రోజులకోసారి పాఠశాలల్లో మెడికల్ క్యాంపులు పెట్టి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యాధికారులు, మలేరియా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## సర్వజ్ఞలో ఉచిత దంత సంరక్షణ శిబిరం

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని వీడియోస్ కాలనీలో గల సర్వజ్ఞ పాఠశాలలో మంగళవారం ఉచిత దంత సంరక్షణ శిబిరాన్ని నిర్వహించారు. దంత వైద్య నిపుణులు విద్యార్థులు, సిబ్బందికి దంత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మమత దంత వైద్య కళాశాల నిపుణులు ప్రొ. డాక్టర్ బి.వెంగళరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దంతాల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నోటి పరిశుభ్రత ప్రాముఖ్యత, దంత సమస్యల గురించి వివరించారు. దంతాలను ఆరోగ్యంగా ఉంచుకోవడం ద్వారా మొత్తం శారీరక ఆరోగ్యానికి ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. పాఠశాల డైరెక్టర్లు ఆర్‌వి.నాగేంద్రకుమార్, నీలిమలు మాట్లాడుతూ దంత సంరక్షణ ఆవశ్యకతను, దంత ఆరోగ్యం యొక్క ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. దంతాలను శుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచుకోవడం ద్వారా సంపూర్ణ శారీరక శ్రేయస్సును ఎలా పెంపొందించుకోవచ్చో వారు తెలియజేశారు. ఈ ఉచిత దంత సంరక్షణ శిబిరం ద్వారా విద్యార్థులు, సిబ్బంది తమ దంత సమస్యలపై అవగాహన పెంచుకోవడంతో పాటు సకాలంలో పరీక్షలు చేయించుకునే అవకాశం లభించిందని నిర్వాహకులు తెలిపారు.

## సబ్‌రిజిస్ట్రార్‌గా యామిని బాధ్యతల స్వీకరణ



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని కోదాడ క్రాస్‌రోడ్డులో గల ఖమ్మంరూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నూతన సబ్ రిజిస్ట్రార్‌గా యామిని మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ సీనియర్ అసిస్టెంట్ భూపాల్ నుంచి ఆమె బాధ్యతలు తీసుకున్నారు. యామిని గతంలో కూసుమంచిలో సబ్‌రిజిస్ట్రార్‌గా సైతం పనిచేశారు. తాజాగా వరంగల్ నుంచి బదిలీపై ఇక్కడికి డిప్యూటేషన్‌పై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన యామినిని కార్యాలయ ఉద్యోగులు, డాక్యుమెంట్ రైటర్లు మార్యదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

# దండి సురేష్ ఎన్నిక హర్షణీయం

మున్నూరు కాపు రాష్ట్ర నాయకుడు శెట్టి రంగారావు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** సిపిఐ జిల్లా కార్యదర్శిగా దండి సురేష్‌ను ఎన్నిక చేయడం బిసిలకు గర్వకారణమని మున్నూరుకాపు రాష్ట్ర నాయకులు శెట్టి రంగారావు అన్నారు. మంగళవారం ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని ఏదులాపురంలో గల ఆయన నివాసంలో మున్నూరు సంఘం ఆధ్వర్యంలో కలిశారు. ఈ సందర్భంగా బొకేలు అందజేసి శాలేవాలతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...ఆనాడు పట్టణ కార్యదర్శిగా మున్నూరు కాపులైన కీర్తి శేషులు మేకల సంగయ్య, బొమ్మిశెట్టి నారాయణ, ఇప్పుడు దండి సురేష్‌ని ఎంపిక చేసిన సిపిఐ జిల్లా నాయకత్వంకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే మద్దులపల్లి మున్నూరు కాంపు సంఘం ఆధ్వర్యంలో కలిసి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు రాష్ట్ర జిల్లా నాయకులు పసుపులేటి దేవేందర్, నగర అధ్యక్షులు మదారి పూర్ణచంద్రరావు, జి.శ్రీదేవి, 55వ డివిజన్ అధ్యక్షులు కాసిన్ని శ్రీనివాసరావు, బీరెడ్డి రమేష్, మేకల రవికుమార్, మద్దులపల్లి మున్నూరు కాపు సభ్యులు శీలం వెంకటేశ్వర్లు, సతీష్, శ్రీకాంత్, జయమ్మ, చెరుకూరి మురళి, రంగా నాగేశ్వరరావు, రంగా రమేష్, దండి ఉపేందర్, దండి శేఖర్ పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## క్లస్టర్ల అధికారుల నియామకం : కలెక్టర్



ప్రజాపక్షం/భూపాలపల్లి : జిల్లాలో జరిగే ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యకలాపాలు, ప్రజాసేవల అమలుపై సమగ్ర పర్యవేక్షణకు క్లస్టర్ అధికారులను నియమించినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.మండలాల్లో ప్రభుత్వ సేవల అమలు, రెగ్యులేటరీ చర్యలు, సంక్షేమ కార్యక్రమాల అమలుపై పటిష్టమైన పర్యవేక్షణ చేయాలన్నారు. క్లస్టర్ అధికారులుగా నియమితులైన వారు మండల ప్రత్యేక అధికారులతో సమన్వయంతో పనిచేసి, అన్ని కార్యక్రమాలను పర్యవేక్షించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

## పిసిసి మీనాక్షి నటరాజన్‌తో ఎమ్మెల్యే నాయిని భేటీ



ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : హైదరాబాద్ లోని ఎమ్మెల్యే క్వార్టర్స్ లో మంగళవారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,వరంగల్ పశ్చిమ నియోజవకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి టీపీసీసీ అధ్యక్షులు, ఎంఎల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ను, తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ నేతృత్వంలో జరిగిన సమావేశంలో కరీంనగర్ జిల్లా ఇంచార్జ్ ఎంఎల్సి అద్దంకి దయాకర్,ఎమ్మెల్యేలలతో కలసి మర్యాదపూర్వకంగా కలిశారు.కరీంనగర్ జిల్లా ఇంచార్జ్ లుగా నియమితులైన సందర్భంగా పార్టీ సంస్థాగత నిర్మాణం, పదవుల కేటాయింపు తదితర అంశాలను వివరించారు.వరంగల్ జిల్లా, కరీంనగర్ జిల్లాల సంస్థాగత నిర్మాణం,పార్టీ పదవులు,డీసీసీ కమిటీ ఏర్పాటు అంశాలపై సమావేశం జరిగింది. ఉమ్మడి జిల్లా అధ్యక్షులు,నాయకులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దు

**గూడూరు సిఐ సూర్యప్రకాష్**

ప్రజాపక్షం/గూడూరు: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం లైన్ తండా గ్రామపంచామతీ పరిదిలో గుడుంబా స్తావరాలపై గూడూరు సర్కిల్ పోలీసు అధికారులు ఆధ్వర్యంలో కార్టన్‌సెర్చ్ నిర్వహించారు. తయారీకి ఉపయోగించిన క్వింటా పట్టిక 50 కేజీల నల్ల బెల్లాన్ని గొలుసు దుకాణాల్లో అక్రమంగా విక్రయించే మద్యం బాటిల్ స్వాధీనం చేసుకోవడం జరిగింది. వివరాల్లోకి వెళితే మహబూబాబాద్ జిల్లా గూడూరు సర్కిల్ పరిధిలో గూడూరు సీఐ సూర్యప్రకాష్ ఎస్సై గిరిధర్‌రెడ్డి గంగారం ఎస్సై స్పెషల్ ఫోర్స్ టీఎస్ ఎస్పీ జో కలిపి 48మంది సిబ్బంది గూడూరు మండలంలోని లైన్‌తండా గ్రామంలో కార్టన్‌సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. సిఐ సూర్యప్రకాష్ మాట్లాడుతూ లైన్‌తండా గ్రామ ప్రజలకు చైతన్యం కలిగించారు.

## ఇందిరమ్మ ఇళ్ల పనులు పరిశీలన



ప్రజాపక్షం/వేలేరు: వేలేరు మండలం మల్లికుదుర్ల, సోడశపల్లి, వేలేరు, పీచరలలో హనుమకొండ జడ్‌పి సిఇఒ విద్యాలత మంగళవారం పర్యటించారు.ఇందిరమ్మ ఇండ్ల పనులు, ఇంకుడు గుంతలు, వివిధ ప్రభుత్వ పాఠశాలలలో మధ్యాహ్నభోజనం,మల్లికుదుర్లలోని ఎల్లమ్మ దేవాలయ ప్రాంగణంలో నాటిన మొక్కలను పరిశీలించారు. ట్రీ గార్డులను ఏర్పాటు చేయించాలని ఎపిఒ విజయను కోరారు. అనంతరం వివిధ గ్రామాల నర్సరీలను పరిశీలించారు. విద్యాలత మాట్లాడుతూ విద్యార్థులకు మెనూప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. ఎంపిడిఒ లక్ష్మీ ప్రసన్న,మండలవిద్యాశాఖ అధికారి మొగిలిచెర్ల చంద్రమౌళి,ఎంపిఒ భాస్కర్,ఎపిఒ విజయ, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు,వివిధగ్రామపంచాయితీల కార్యదర్శులు ఫీల్డ్ అసిస్టెంట్లు,తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త!



ప్రజాపక్షం / వేలేరు : వేలేరు మండలకేంద్రం శివారులోని గురుకుల పాఠశాలలో సైబర్ క్రైమ్ నేరాల గురించి పాఠశాల ప్రిన్సిపల్ అజయ్‌కుమార్ అధ్వర్యంలో విధ్యార్థులకు వేలేరు ఎసై ఎ సురేష్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈసంధర్భంగా సురేష్ మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో మానవులు వింతైన జీవితాలను గడుపుతున్నారని నాటికాలంలో ధనవంతులనే దొంగలు దోచుకోవడం వలన భయంతో ఏమౌతుందోనని భయపడి జీవించేవారు కాని నేటి ఆధునిక సమాజంలో పేద ధనిక అనే బేధం లేకుండా సైబర్ క్రైమ్ నేరగాల్లు ఏరూపంలో మనఖాతాలలోని డబ్బులను కాజేస్తున్నారో తెలియని పరిస్థితి ఉన్నందున వివిధ సోషల్ మీడియాలలో రకరకాల లింకులతో ఆశ చూపించి సెల్ ఫోన్లను హ్యాక్ చేసి తక్షణమే మనఖాతాలోని డబ్బులను కాజేస్తున్నందున విధ్యార్థులు అప్రమత్తంగా ఉండాలని కోరుతూ సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ కోసం 1930,జాతీయ హెల్ప్ లైన్ కోసం 112 నెంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది,పోలీస్ సిబ్బంది, విధ్యార్థులు పాల్గొన్నారు.

## లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం : రిజ్వాన్ బాషా




ప్రజాపక్షం/జనగామ : గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు నేరమని జనగామ జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గర్భస్త పిండ లింగ నిర్ధారణ పరీక్షల నియంత్రణ చట్టం 1994పై సమీక్ష జరిగింది. కలెక్టర్ రిజ్వాన్ బాషా, డీసీపీ రాజమహేంద్ర నాయక్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 30 స్కానింగ్ సెంటర్‌లు ఉన్నాయని,వాటిని నిరంతరం పర్యవేక్షించాలన్నారు. గర్భస్త లింగ నిర్ధారణ చట్టం రీత్యా నేరమైనప్పటికీ కొందరు ఆ నిబంధనలు పాటించడం లేదని మండిపడ్డారు. స్కానింగ్ సెంటర్లు మొదటి సారి తప్పు చేస్తే రూ.10వేలు, జరిమానాతోపాటు ఒక సంవత్సరం జైలు శిక్ష, రెండవ సారి తప్పు చేస్తే రూ.50వేల జరిమానా, 3 సంవత్సరాల జైలు శిక్ష ఉంటుందన్నారు. వైద్యాధికారులు స్కానింగ్ సెంటర్లపై పర్యవేక్షణ చేయాలని, పోలీసు అధికారులు నిఘా పెంచాలని, పాలకుర్తి లాంటి మారుమూల ప్రాంతాలపై పర్యవేక్షణ పెంచాలని అధికారులను ఆదేశించారు.ఈ సమీక్షలో ఎంసీహెచ్ ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ అశోక్, బేబి ప్రాజెక్ట్ ఆఫీసర్ కమలహాసన్, ఇమ్యునేషన్ ఆఫీసర్ స్వర్ణ కుమారి, ఉమెన్స్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ బాలకృష్ణ పాల్గొన్నారు.

## ఎరువుల కొరత సృష్టించొద్దు

**కలెక్టర్ దివాకర టి.ఎస్**



ప్రజాపక్షం/వెంకటపూర్ : ఎరువుల దుకాణాదారులు కృత్తిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ హెచ్చరించారు. మంగళవారం వెంకటాపూర్ మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంగోడౌన్‌ను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఎరువుల నిల్వలు, కొనుగోళ్ల రిజిస్టర్‌ను పరిశీలించారు. దుకాణాల్లోని ఎరువుల నిల్వలను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ సబ్సిడీ ఎరువులను దారి మళ్లించినా, బ్లాక్‌మార్కెట్టుకు తరలించిన వారిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. పురుగు మందులు రైతులకు సరిపడ అందుబాటులో ఉంచాలని అన్నారు. ప్రతిరోజూ స్టాక్ వివరాలను వ్యవసాయ శాఖ వారికి తెలపాలని,రిజిస్టర్‌లు సక్రమంగా పాటించాలని సూచిం చారు. దుకాణదారులు ఏ రైతుకు ఎంత పరిమాణంలో ఎరువులు ఇస్తున్నారనే వివరాలు నమోదు చేయాలన్నారు. ఎరువులు, విత్తనాల స్టాక్ బోర్డును ఖచ్చితంగా ఏర్పాటు చేయాలని, రైతు సమస్యను ఫిర్యాదు చేసేందుకు టోల్ ఫ్రీ నెంబర్ డిస్ ప్లే చే యాలని ఆదేశించారు. వ్యవసాయ అధికారులు నిరంతరం ఫెర్టిలైజర్ దుకాణాలలో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఎరువులను ఎక్కువగా వాడడం వల్ల నేల స్వభావం దెబ్బతింటుందని,ఈ విషయాల పట్ల రైతులకు అవగాహన కల్పించాలన్నా రు. తక్కువ పరిమాణంలో ఎరువులు వాడాలన్నారు.నానో యూరియా వినియోగించాలన్నారు.మండల వ్యవసాయ అధికారి ఎం. శైలజ, ఏఈఓలు సుకుమార్, మహిపవన్, పిఏఎస్ సీఈఓ శంకరయ్య, రమేష్, రైతులు ఐలయ్య, రజినీకర్, సురేష్ ఉన్నారు.

## విద్యా బోధనపై ప్రత్యేక శ్రద్ధ

**మహబూబాబాద్ కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్**




ప్రజాపక్షం/మహబూబాబాద్ : విద్యార్థులకు అకడమిక్ షెడ్యూల్ ప్రకారం సిలబస్ పూర్తి చేయాలని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కె.జి.బి.వి, మండలపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. శ్రద్ధతో చదువు నేర్పించాలన్నారు. నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదుల యొక్క పనులను పరిశీలించి వెంటనే పూర్తి చేయాలన్నారు. వంటశాలను, స్టోర్ గది ని పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారాన్ని అందించాలని, వేడి వేడిగా పరిశుభ్రమమైన భోజనాన్ని అందించాలని అన్నారు. అనంతరం ఇందిరానగర్ లోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాటశాలను, అంగన్ వాడీ సెంటర్ ను తనిఖీ చేసి విద్యార్థుల భోజనాన్ని స్వయంగా రుచి చూసి పరిశీలించారు. డిఇఒ డా. రవీందర్‌రెడ్డి, కె.జి.బి.వి ప్రిన్సిపాల్, అంగన్ వాడీ టీచర్ తదితరులు ఉన్నారు.

## విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు బాటలు

**ఉత్తమ పాఠశాలగా బాలికల పాఠశాల ఎన్నికవ్వడం సంతోషకరం**

**ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు**




ప్రజాపక్షం/హసన్‌పర్తి: భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ విద్యా విధానం 2020 విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులకు బాటలు వేస్తుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. పీఎంశ్రీకి హసన్‌పర్తి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు ఎన్నంశెట్టి సుమాదేవి అధ్యక్షతన జరిగిన జాతీయ విద్యా విధానం వార్షికోత్సవ సమావేశంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థుల సమగ్రాభివృద్ధి, నైపుణ్యపరంగా మెరుగులు, భవిష్యత్ అవసరాలకు అనుగునంగా విద్యను మల్చడమే ఈ విద్యా విధానం ముఖ్య లక్షణమన్నారు. తాను దత్తత తీసుకున్న ఈ పాఠశాల పీఎంశ్రీ జిల్లా పరిషత్ బాలికల పాఠశాల జిల్లాలోనే అత్యుత్తమ పీఎంశ్రీ పాఠశాలగా ఎంపిక కావడం చాలా గర్వ కారణం అన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్, అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను పరిశీలించారు. పాఠశాలలోని కంప్యూటర్ ల్యాబ్‌కు ఫాల్ సీలింగ్, ఏసీల ఏర్పాటు, పాఠశాల డయాస్ పైకప్పు ఏర్పాటు అతి త్వరలోనే చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామస్థులు ఇన్ని సౌకర్యాలు ఉన్న ఈ పాటశాలలో తమ పిల్లలను చేర్పించాలన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో విద్యా వ్యవస్థ మొత్తం వెనుకబడి పోయిందన్నారు. నేడు మన ప్రజా ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో విద్యా వ్యవస్థనుగాడిలో పెడుతూ ఎక్కడా లేని నూతన టెక్నాలజీతోవిద్యనుఅందించాలనే సంకల్పంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ప్రతీ నియోజకవర్గానికి రూ. 200 కోట్లతో మంజూరు చేసిన విషయం అందరికీ తెలిసిందే. విద్య పట్ల మక్కువ స్పోర్ట్స్ స్కూల్ మంజూరు చేశారని ఆగస్టు 15న సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. అనంతరం అండర్ 14 బాక్సింగ్‌లో బ్రాంజ్ మెడల్ సాధించిన విద్యార్థిని వైష్ణవిని శాలువాతో సత్కరించి అభినందించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో హసన్‌పర్తి ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ చేరాలు, ఎస్సై దేవేందర్, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కిరణ్, ఆత్మకూరు మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ తంగళ్లపల్లి తిరుపతి, మాజీ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి, అనంతసాగర్ మాజీ సర్పంచ్ బండ చంటిరెడ్డి, మాజీ జడ్పీటీసీ వింజమూరి వెంకటేశ్వర్లు, పెద్దమ్మ నర్సింహరాములు, పీఈటీ బాలకిషన్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**కలెక్టర్ సత్య శారద**



ప్రజాపక్షం/నెక్కొండ: అధికారులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భారీగా కురుస్తున్న వర్షాల వల్ల చెరువులు, కుంటలు, గండ్లు పడే అవకాశం ఉందని పాత గృహాలు కూలిపోయే అవకాశం ఉన్నందున అధికారులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సత్య శారద అన్నారు. జిల్లాలోని నెక్కొండ మండలాన్ని మంగళవారం ఆమె సందర్శించిన సందర్భంగా అప్పలరావుపేట చెరువు కట్టను, రోడ్డుపై పడ్డ గం డ్లను, ఆమె పరిశీలించారు.మండల కేంద్రం లోని హై స్కూల్ సెంటర్ ను ఆమె సందర్శించారు. హైస్కూల్ సెంటర్లో మధ్యాహ్న భోజనం నిబంధన ప్రకారం చేయడం లేదని బాధ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 8, 9, 10 తరగతి విద్యార్థుల చదువుకున్న విధానాన్ని తెలుసుకొని అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు హెల్త్ కార్డులు వచ్చాయా అని తెలుసుకొని జిల్లా వైద్య అధికారితో మాట్లాడారు. ప్రభుత్వం విద్య వైద్యంపై, ప్రత్యేక దృష్టి సారించిందని జిల్లా పరిషత్ సీఈవో రామిరెడ్డి అన్నారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, మండల విద్యాధికారి రత్నమాల, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ హంస నరేందర్, హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు రంగారావు, నెక్కొండ పంచాయతీ సెక్రెటరీ దయ్యాల రవీందర్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలో విద్యకు ప్రాధాన్యత

**భూపాలపల్లి ఎమ్మెల్యే జిఎస్ఆర్**

ప్రజాపక్షం/చిట్యాల: కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ పాలనలో విద్యార్థులే రాబోయే భావితరాలకు పునాదులు అని విద్యకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నామని భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మండలంలోని శాంతినగర్ లో సోమవారం చిట్యాల ఎంఈఓ కోడిపాక రఘుపతి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పాఠశాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరై తాత్కాలిక పాఠశాల భవనాన్ని ఐదవ తరగతి వరకు చదివే విధంగా 20 మంది విద్యార్థులతో ప్రారంభించారు. పిల్లలకు పలకలు బలపాలు పుస్తకాలు పంపిణీ చేసి విద్యార్థులకు అక్షరాభ్యాసం చేశారు. అనంతరం జి ఎస్ ఆర్ మాట్లాడుతూ గత పాలకులు 10 సంవత్సరాలు పాలించినప్పటికీ శాంతినగర్లో పిల్లలకు నాలుగు అక్షరాలు నేర్చుకుందామంటే పాఠశాల కు దూరమైనారని త్వరలోనే పాఠశాల భవనాన్ని ఏర్పాటు చేయిస్తామని తెలుపుతూ, కాంగ్రెస్ పాలనలో అన్ని రంగాల్లో అభివృద్ధి పరుగులు పెడుతుందని తెలిపారు. బిఆర్ఎస్ నాయకులు ఇప్పుడు అభివృద్ధి అంటూ ప్రగల్బాల్ పలుకుతున్నారని ఎద్దేవా చేశారు. శాంతినగర్లో గతంలో ఇండ్లు కాలిపోయిన వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు పట్టాల పంపిణీ చేశారు. ఏఎంసి చైర్ పర్సన్ గుమ్మడి శ్రీదేవి సత్యనారాయణ,కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్, స్థానిక ఎంపీడీవో జయ శ్రీ, ఎంపీఓ రామకృష్ణ, మాజీ జెడ్పిటిసి పులి తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

## ఓసి క్లబ్‌ను తక్షణమే స్వాధీనం చేసుకోవాలి




ప్రజాపక్షం/మహబూబాబాద్ : ఓసి క్లబ్ గా చలామణి అవుతున్న ప్రభుత్వ క్లబ్ తక్షణ స్వాధీనంకై సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళనలు 3 మూడు రోజులపాటు దీక్షలు ఆగస్టు 4న కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారధిరెడ్డి పిలుపునిచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మహబూబాబాద్ పట్టణంలోని శాఖ కార్యదర్శి, సహాయ కార్యదర్శుల సమావేశం నాగిలి యాకమ్మ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా అజయ్ సారధి రెడ్డి మాట్లాడారు. 50 కోట్లు విలువచేసే పట్టణంలోని నడిబొడ్డున ఉన్న ప్రభుత్వక్లబ్‌ను గత బిఆర్ఎస్ హయాంలో అక్రమంగా కబ్జా చేయాలని కొంతమంది ప్రజాప్రతినిధులు చూశారన్నారు.2014లో కౌన్సిలర్లుగా గెలిచి వాటికి సంబంధించిన వివరాలు అన్నింటిని బయటికి తీసి కబ్జా కాకుండా నాటి నుండి నేటి వరకు మున్సిపాలిటీ సమావేశంలో మరియు ప్రజాక్షేత్రంలో పెద్ద ఎత్తున ఉద్యమించామన్నారు. కరపత్రం ద్వారా పట్టణ ప్రజలందరినీ అది ముమ్మాటికి ప్రభుత్వ క్లబ్ అని తెలిసే విధంగా ఉద్యమాలు నిర్వహించామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే ప్రభుత్వ క్లబ్‌ను స్వాధీనం చేసుకొని ప్రజల కోసం బహుళ అవసరాలకు వినియోగించాలని డిమాండ్ చేశారు.పెరుగు కుమార్, రేశపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి ,వెలుగుశ్రావణ్,నర్రా శ్రావణ్, నాగెల్లి యాకమ్మ, ఆబోతు అశోక్, జలగం ప్రవీణ్, వంకాయలపాటి చిరంజీవి,మందశంకర్, ఎర్రోజు పద్మ, ఆలేటి మహేష్, నాంచారి దాసు, అల్లి వేణుగోపాల్ రెడ్డి, చిలువేరు వికాస్, తోట రమేష్, మెతుకు కుమార్, గార రవిచంద్రబోస్, ఐలయ్య, బోల్ల భద్రయ్య, పద్మ, బొమ్మెనలాలు, తండా శ్రీనాథ్, బల్లెం శ్రీకాంత్, నటరాజ్ , ఎండి రఫీ ఎండి, షంషీర్, వీరేందర్, నునావత్ బాలు, డి రమేష్, ఉప్పలయ్య, కూరాకుల పాల్ పాల్గొన్నారు.

**మిన్నుకు సిపిఐ నివాళి**

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కట్లోజు పాండురంగాచారి మనవడు మిన్ను ఇటీవల అకాల మరణం చెందగా నేడు దశదినకర్మకు హాజరై అజయ్ సారధిరెడ్డి నివాళులర్పించారు.

## విద్యార్థుల సృజనాత్మకతతోనే అద్భుతాలు : కలెక్టర్

**కలెక్టర్ రాహుల్ శర్మ**

ప్రజాపక్షం/కాళేశ్వరం: విద్యార్థుల్లో సృజనాత్మకత ప్రతిభను వెలికితీసి అభివృద్ధి చేస్తే చదువులో అద్భుతాలు సృష్టిస్తారని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం 9వ తరగతి విద్యార్థిని అక్షయ భౌతిక శాస్త్రంలో న్యూటన్ సిద్ధాంతాలకు సంబంధించిన దశావతారంపై నిర్వహించిన వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు కార్యక్రమంలో పాల్గొన్నారు. 9వ తరగతి విద్యార్థిని అక్షయ భౌతికశాస్త్రంలో ప్రతిభ చాటిన దశావతారం ప్రదర్శన ఆకట్టుకుందని కలెక్టర్ అభినందించారు. భౌతికశాస్త్రంలో 10 మంది విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు మధ్యలో ఇతర అంశాలతో మిళితంగా సమాధానాలు ఇవ్వడమేకాక,శాస్త్రవేత్తల పేర్లు, చిత్రాలను గుర్తుపెట్టుకొని అద్భుతంగా వివరించడం పట్ల కలెక్టర్ ప్రశంసించారు. కలెక్టర్ మాట్లాడుతూ పట్టుదలతో చదవాలన్నారు. అనంతరం కను బొమ్మలతో మహాదేవపూర్ 8వ తరగతి విద్యార్థులు చేసిన కోడింగ్ వీక్షించారు. వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ ఇండియా చీఫ్ కోఆర్డినేటర్ బింగి నరేందర్ గౌడ్, రాష్ట్ర కోఆర్డినేటర్ సిద్ధం అరుణ్ కుమార్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజేందర్, పిఏసీఎస్ చైర్మన్ చల్ల తిరుపతి రెడ్డి, తహసీల్దార్ రామారావు, ఎంఈఓ ప్రకాష్ బాబు, మధు తదితర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 59వ డివిజన్‌లో శానిటేషన్ పరిశీలన

ప్రజాపక్షం/ఖిలా వరంగల్ : ప్లాస్టిక్ సంచులకు ప్రత్యామ్నాయంగా బయోడిగ్రేబుల్ సంచులను వినియోగించాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలులో భాగం గా హన్మకొండ పరిధి 59వ డివిజన్ లో మంగళవారం శానిటేషన్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీలో కమిషనర్ పాల్గొన్నారు. కమిషనర్ మాట్లాడుతూ, 59వ డివిజన్ లో గల ఎక్సైజ్ కాలనీ రైతు బజార్ మార్కెట్‌ను ప్లాస్టిక్ రహిత మార్కెట్ గా తీర్చిదిద్దాలని, వర్నరెబుల్ పాయింట్ల లో చెత్త కనిపిస్తే జవాన్లకు పెనాల్టీలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఇంటి నుండి వంద శాతం, చెత్త సేకరణ చేయాలని ప్లాస్టిక్ సంచులకు ప్రత్యామ్నాయంగా బయో డిగ్రేబుల్ సంచులను వినియోగించేలా చూడాలని తెలిపారు.స్థానిక డివిజన్ కార్పొరేటర్ గుజ్జుల వసంత, మహేందర్, సిఎంహెచ్‌ఓ డా॥ రాజారెడ్డి ఉన్నారు.

## 'స్వచ్ఛ పరకాల' భాగస్వాములు కావాలి

**ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి, కలెక్టర్ స్నేహ శభరీష్**




ప్రజాపక్షం/పరకాల:ప్రజల భాగస్వామ్యం లేకు ండా అభివృద్ధి జరగదని అందుకుగాను ప్రజలు పరకాల పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో భాగస్వాములు కావాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మున్సిపల్ పరిధిలో వనమహోత్సవం, ఫుడ్‌స్టాల్స్ ఏర్పాటు, మున్సిపల్ సిబ్బందికి బట్టల పంపిణీ, స్వచ్ఛ ఆటోలను ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, కలెక్టర్ స్నేహ శబరీష్ తో కలిసి ప్రారంభించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ కొడారి సుష్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత జిల్లా కేంద్రం కావడానికి అనేక అవకాశాలు ఉన్నప్పటికీ భూపాలపల్లి జిల్లా చేయడంతో పరకాలకు అన్యాయం జరిగిందన్నారు. అయినప్పటికీ వాటిని అధిగమిస్తూ పరకాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయడం జరుగుతుందన్నారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాల పరకాల కేంద్రంగా 200 కోట్ల రూపాయలతో 22 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

**ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పన**

నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ఉద్యోగ, వ్యాపార, స్వయం ఉపాధి అవకాశాలు పెంపొందించడం కోసం కృషి చేస్తున్నామన్నారు.కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ ధ్యేయమని ముఖ్యమంత్రి ఇప్పటికే ప్రకటించడం జరిగిందన్నారు. సంగం మండలంతో పాటు దామెర మండలం ల్యాదల్లలో ఇప్పటికే స్కిల్ డెవలప్మెంట్ సెంటర్సు ఏర్పాటు చేశా మన్నారు.

**డిప్యూటేషన్ మీద వెళ్లిన సిబ్బంది వెనక్కు:**

సిబ్బంది కొరతను దృష్టిలో పెట్టుకొని మున్సిపల్ కమిషనర్ సుష్మ సూచన మేరకు పరకాల నుండి వరంగల్ మున్సిపాలిటీ డిప్యూటీషన్‌పై వెళ్లిన 32 మంది మున్సిపల్ ఉద్యోగులను వెనక్కు తీసుకురావడం జరుగుతుందన్నారు. ఆగస్టు ఒకటో తేదీ నుంచి వారందరూ ఇక్కడే విధులు నిర్వహించనున్నట్లు హామీ ఇచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ కా లనీలలో ప్రజల భాగస్వామ్యంతో కంపోస్ట్ యూ నిట్స్ ఏర్పాటు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ పిలుపునిచ్చారు. అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ఆర్డీవో డాక్టర్ కే నారాయణ, తహసిల్దార్ తోట విజయలక్ష్మి , ఎంపిడిఓ పెద్ది ఆంజనేయులు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు కొయ్యడ శ్రీనివాస్, సమన్వయ కమిటీ నాయకులు సోదా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ పులుల దినోత్సవం

ప్రజాపక్షం/మహాదేవపూర్:మండలకేంద్రంలోని గ్రీన్‌వుడ్ పాఠశాలలో అటవీ శాఖాధికారి రవి ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రకృతి రక్షణలో పులుల ప్రాముఖ్యత,మొక్కలు నాటి వాటి సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం అటవీ శాఖాధికారి రవి మాట్లాడుతూ అడవులను రక్షించడం వల్ల పర్యావరణ సమతుల్యత సాధ్యమౌతుందన్నారు. అడవులను రక్షించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు.అడవులను కాపాడి జంతు పరిరక్షణకు తమవంతు బాధ్యతగా ఉండాలని,వన్యప్రాణులకు హాని తలపెట్టొద్దని అన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి రాజేశ్వర్,సెక్షన్ అధికారులు ఆనంద్,వరుణ్, తిరుపతి,బీట్ అధికారులు సదానందం, శ్యామ్, అంజయ్య, పాఠశాల కరస్పాండెంట చీర్ల శ్రీనివాస్‌రెడ్డి,ప్రధానోపాద్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

# రీల్


## ఉస్తాద్ భగత్ సింగ్ క్లైమాక్స్ పూర్తి



పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. 'గబ్బర్ సింగ్' వంటి సంచలన విజయం తరువాత పవన్ కళ్యాణ్‌హరీష్ శంకర్ కలయికలో వస్తున్న చిత్రం ఇది. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ సినిమా క్లైమాక్స్ చిత్రీకరణ పూర్తయింది. దర్శకుడు హరీష్ శంకర్ భావోద్వేగాలతో నిండిన, యాక్షన్ తో కూడిన అద్భుతమైన క్లైమాక్స్‌ను రూపొందించారు. ఈ చిత్రానికి నబకాంత మాస్టర్ కొరియోగ్రఫీ అందించారు. చిత్రీకరణ పూర్తయిన తర్వాత, నబకాంత మాస్టర్, ఫైటర్ల బృందంతో పవన్ కళ్యాణ్ ఫోటోలు దిగారు. ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవి శంకర్ భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో శ్రీలీల, రాశి ఖన్నా కథానాయికలుగా నటిస్తున్నారు.

## 'వార్ 2' పాట కోసం రంగంలోకి బ్రహ్మాస్త్ర 'కేసరియా' టీం

అయాన్ ముఖర్జీ తెరకెక్కించిన 'బ్రహ్మాస్త్ర' సినిమాలోని కేసరియా అనే పాట దేశాన్ని ఊపేసింది. మరోసారి అయాన్ తన టీంను 'వార్ 2' కోసం రంగంలోకి దించారు. అయాన్ ప్రస్తుతం 'వార్ 2' పనుల్లో బిజీగా ఉన్నారు. ఇండియన్ ఐకానిక్ స్టార్లైన హృతిక్ రోషన్, ఎన్టీఆర్, కియారా అద్వానీ కాంబోలో 'వార్ 2' సినిమాని యష్ రాజ్ ఫిలమ్స్ భారీ ఎత్తున నిర్మించింది. ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్ ఇప్పటికే సోషల్ మీడియాలో సునామీని సృష్టిస్తోంది. హృతిక్, కియారా మీద చిత్రీకరించే ఈ డ్యుయేట్ పాట కోసం తన బ్లాక్ బస్టర్ కేసరియా సంగీత బృందాన్ని రంగంలోకి దించారు. 'వార్ 2'లోని ఈ యుగళ గీతం కోసం ప్రీతమ్, అరిజిత్ సింగ్, అమితాబ్ భట్టాచార్య మళ్ళీ ఒకే చోటకు చేరారు. త్వరలోనే ఈ పాటను సోషల్ మీడియాలో



రిలీజ్ చేసి మరింత హైప్ పెంచాలని చిత్ర యూనిట్ భావిస్తోంది. 'వార్ 2'లో హృతిక్, కియారా పాత్ర మధ్య ప్రేమను చూపించే అందమైన ట్రాక్‌గా ఈ పాటను కంపోజ్ చేస్తున్నారు. యాక్షన్ నేపథ్యంలో తెరకెక్కిన 'వార్ 2' ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా హిందీ, తెలుగు, తమిళ భాషలలో థియేటర్లలో విడుదల కానుంది.

## గోవాలో నైంటీస్ తారల సందడి

### సౌత్ ఇండియా స్టార్స్ ఆత్మీయ కలయిక



పాత జ్ఞాపకాలను నెమరు వేసుకోవడం అంటే ప్రతి ఒక్కరు గొప్ప అనుభూతిగా భావిస్తుంటారు. పదవ తరగతిలో కలిసి చదువుకున్న కొందరు మిత్రులు కలుసుకుంటుంటారు. ఇంటర్, డిగ్రీ, పీజీ ఇలా చాలా మంది తమ తమ స్నేహితులతో అపూర్వ కలయిక వేడుకలు జరుపుకుంటుంటారు. మామూలు క్లాస్‌మేట్స్ కలిసినప్పుడే ఎంతో అందనంగా గడిపే క్షణాలు జీవితాల్లో మరచిపోలేరు. అలాంటిది ఒక వెండితెరను ఏలిన హీరోలు, హీరోయిన్లు, దర్శకులు ఒకేచోట కలిస్తే ఆ వేడుక ఎంత సందడిగా మారిపోతుందో మనం ఊహించుకోవచ్చు. సరిగ్గా గోవాలో ఇదే జరిగింది. 90 నాటి సౌత్ ఇండియా స్టార్స్ అందరూ కాల్సియారు. హీరోలు, హీరోయిన్లు, దర్శకులు కలిసి తమ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. యోగక్షమాల గురించి ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. తమ పిల్లలు ఏం చేస్తున్నారు? ప్రస్తుతం తాము ఏం చేస్తున్నాము వంటి అనేక విషయాలను మాట్లాడుకున్నారు. అందరూ కలిసి తమకు ఇష్టమైన భోజనాలు చేశారు. అందరికీ కలకాలం గుర్తుండిపోయేలా డ్రెస్ కోడ్ తో ఫోటోలు దిగారు. ఆ ఫోటోలే ఇప్పుడు అందరిని ఆకట్టుకుంటున్నాయి. నైంటీస్ నాటి తారలు ఇప్పుడు ఎలా ఉన్నారో ఈ ఫోటోల్లో చూడొచ్చు. తెల్ల గడ్డలు, తెల్ల వెంట్రులతో వయసు మీద పడినా అందం మాత్రం చెక్కు చెదరకుండా ఉన్న హీరోయిన్‌లను చూడొచ్చు. అందరూ కలసి మనసు నిండా మాట్లాడుకున్నారు. అనేక చిత్రాల్లో నటించి ప్రేక్షకులను రంజింపజేసిన తారామనులు, నటులు, దర్శకులు ఈ ఫోటోల్లో ఉన్నారు.

ప్రముఖ దర్శకులు కె.ఎస్. రవికుమార్, శంకర్, లింగుసామి, మోహన్ రాజా, దర్శకుడు కొరియోగ్రాఫర్ ప్రభుదేవా ఉన్నారు. ప్రముఖ నటులు జగపతి బాబు , మేకా శ్రీకాంత్ లను ఇక్కడ చూడొచ్చు. 90వ దశకంలో వెండితెరను ఏలిన ప్రముఖ నటీమణులు సిమ్రాన్, మీనా, సంఘవి, మాళవిక, సంగీత, రీమా సేన్, మహేశ్వరి, శివరంజని, ఊహ, వంటి ప్రముఖ నటీమణులను కూడా ఈ ఫోటోల్లో ఉన్నారు. క్యాజువల్ డ్రెస్‌లో ఒక ఫోటో, వైట్ డ్రెస్ కోడ్‌తో ఒక ఫోటో ఇలా రకకరాలుగా ఫోటోలు దిగారు.

## రాజాసాబ్‌లో సంజయ్ లుక్




ప్రభాస్ హీరోగా మారుతీ దర్శకత్వంలో నిర్మిస్తున్న రాజాసాబ్ సినిమాలోని సంజయ్ దత్ పోస్టర్‌ను విడుదల చేశారు. బాలివుడు నటుడు సంజయ్ దత్ రాజాసాబ్ సినిమాలో విలన్‌గా నటిస్తున్నారు. సంజయ్ దత్ జన్మదినం సందర్భంగా ఈ పోస్టర్‌ను విడుదల చేశారు. హరిహర వీరమల్లులో నటించిన నిధి అగర్వాల్ ఇందులో హీరోయిన్‌గా నటిస్తోంది. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యాన్స నిర్మిస్తున్న ఈ సినిమాకు థమన్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమాలో మరో ముఖ్యమైన పాత్రలో మాళవిక మోహన్ నటిస్తోంది. కార్తిక్ పళని సినిమాటోగ్రాఫర్‌గా, రామ్ లక్ష్మ ణ్, సోలమన్ ఫైట్ మస్టర్లుగా పని చేస్తున్నారు. టిజీ విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ ఈ సినిమాకు నిర్మాతలు.

## ఆగష్టు 2న 'కూలీ' ట్రైలర్




సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా నటించిహిన 'కూలీ' సినిమా విడుదలకు ముస్తాబవుతోంది. లోకేష్ కనగరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. సన్ పిక్చర్స్ బ్యానర్ పై నిర్మించిన కూలీలో నాగార్జున పవర్ ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. అలాగే బాలీవుడ్ సూపర్ స్టార్ అమీర్‌ఖాన్ మరో ముఖ్యమైన పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమా ట్రైలర్ ఆగస్ట్ 2న రిలీజ్ చేస్తున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. రజనీకాంత్, నాగార్జున, అమీర్ ఖాన్, ఉపేంద్ర.. స్టార్స్ అందరూ పవర్ ఫుల్ లుక్స్‌లో కనిపించిన ట్రైలర్ ఎనౌన్స్ మెంట్ పోస్టర్ అదిరిపోయింది. డి.సురేష్ బాబు, దిల్ రాజు, సునీల్ నారంగ్, భరత్ నారంగ్ యాజమాన్యంలోని ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ఏషియన్ మల్టీప్లెక్సెస్ ప్రైవేట్ లిమిటేడ కూలీ మూవీ తెలుగు థియేట్రికల్ హక్కులను భారీ ధరకు సొంతం చేసుకుంది. ఈ చిత్రంలో సత్యరాజ్, సౌబిన్ షాహిర్, ఉపేంద్ర, శ్రుతీ హాసన్, మహేంద్రన్ వంటి ప్రముఖులు కూడా కీలక పాత్రల్లో నటిస్తున్నారు.ఇప్పటికే విడుదలైన ఫస్ట్‌లుక్ పోస్టర్లు, టీజర్లు, సాంగ్స్ సినిమాపై భారీ క్రేజ్‌ను నెలకొల్పాయి.

## థ్యాంక్యూ డియర్ ట్రైలర్ విడుదల

మహాలక్ష్మి ప్రొడక్షన్స్ బ్యానర్‌పై పప్పు బాలాజీ రెడ్డి నిర్మాతగా తోట శ్రీకాంత్ రచన దర్శకత్వంలో ఆగస్టు 1వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం థ్యాంక్యూ డియర్. ధనుష్ రఘుముద్రి, హెబ్బా పటేల్, రేఖా నిరోషా ముఖ్యపాత్రలు పోషించగా వీర శంకర్ నాగ మహేష్ రవి



ప్రకాష్ చత్రపతి శేఖర్ బలగం సుజాత సంక్రాంతి శ్రీనివాస్ నాయుడు తదితరులు ఈ చిత్రంలో కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి పి.ఎల్.కె రెడ్డి డిఓపిగా పని చేయగా సుభాష్ ఆనంద్ సంగీతాన్ని అందించారు. ఇప్పటికే ఈ చిత్రం నుండి ఒక పాటను రాకింగ్ స్టార్ మంచు మనోజ్ లాంచ్ చేయగా చిత్ర టీజర్‌ను సెన్సేషనల్ డైరెక్టర్ వివి వినాయక్ లాంచ్ చేశారు.

## కింగ్డమ్ ప్రీ రిలీజ్

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే, సత్యదేవ్, వెంకటేష్ ముఖ్య పాత్రలు పోషిస్తున్న 'కింగ్డమ్' సినిమా ప్రీ రిలీజ్ వేడుక ఘనంగా జరిగింది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. జూలై 31న ప్రేక్షకుల ముందుకు రానుంది. హైదరాబాద్‌లోని యూసఫ్‌గూడ పోలీస్ గ్రౌండ్స్‌లో 'కింగ్‌డమ్' ప్రీ రిలీజ్ వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. అభిమానుల కోలాహలం నడుమ అతిరథ మహారథుల సమక్షంలో వైభవంగా జరిగిన ఈ వేడుకలో అనిరుధ్ సంగీత ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అయితే ఈ వేడుకకు దర్శకుడు గౌతమ్ హాజరు కాలేదు. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ మాట్లాడుతూ '31న మిమ్మల్ని థియేటర్లలో కలవబోతున్నాం. మనసులో కొంచెం భయం ఉంది, అదే సమయంలో ఓ మంచి సినిమా చేశామనే సంతృప్తి ఉంది. 'కింగ్డమ్' అవుట్ పుట్ పట్ల టీమ్ అందరం సంతోషంగా ఉన్నాము. మీరు నాకు దేవుడిచ్చిన వరం. సినిమాలు హిట్ అయినా, ఫ్లాప్ అయినా అదే ప్రేమ, అదే నమ్మకం నాపై చూపిస్తున్నారు అని అభిమానులనుద్దేశించి అన్నారు.



కథానాయిక భాగ్యశ్రీ బోర్సే మాట్లాడుతూ.. 31న విడుదల కానున్న 'కింగ్డమ్' కోసం మీతో పాటు నేను కూడా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం. గౌతమ్ గారు ఈ సినిమాని అద్భుతంగా రూపొందించారు అని తెలిపారు.

## 'తెలుసు కదా' నుంచి మల్లికా గంధ పాట విడుదల

స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ రొమాంటిక్ డ్రామా 'తెలుసు కదా'. ప్రముఖ స్టైలిస్ట్ నీరజా కోన దర్శకత్వంలో, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. థమన్ ఎస్ ఈ చిత్రానికి సంగీతం అందించారు. మేకర్స్ ఫస్ట్ సింగిల్ మల్లికా గంధను లాంచ్ చేయడం ద్వారా మ్యూజిక్ ప్రమోషన్‌లను ప్రారంభించారు. మల్లికా గంధ లవ్ అండ్ మ్యూజికల్ మ్యాజిక్ తో మనసును తాకే అద్భుతమైన పాట. ట్యూన్, విజువల్స్ ప్రతీదీ ప్రేమ భావోద్వేగాలను బ్యూటీఫుల్ గా ప్రజెంట్ చేస్తోంది. థమన్ కంపోజిషన్ బ్రిలియంట్ గా వుంది. తంబురా, ఫ్లూట్ లాంటి ట్రెడిషనల్ వాయిద్యాల్ని మోడరన్ టచ్ లో వినిపించడం అదిరిపోయింది.



## సినారె ఫోటో లేదని ఫిలిం ఛాంబర్‌లో పాశం యాదగిరి నిరసన



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలుగు ఫిలిం ఛాంబర్‌లో పాశం యాదగిరి నాయకత్వంలో తెలంగాణ వాదులు ఆందోళన చేశారు. తెలుగు ఫిలిం నిర్మాతల మండలిలో అనేక మంది సినిమా ప్రముఖుల ఫోటోలను పెట్టినప్పుడు అనేక పాటలు రాసిన సి.నారాయణ రెడ్డి ఫోటో లేదని తెలంగాణ వాదులు నిరసనకు దిగారు. అంతేకాకుండా ప్రముఖ నటుడు పైడి జయరాజ్ ఫోటో చాలా చిన్నగా ఉందని వాగ్విదానికి దిగారు. నిర్మాతల మండలి కార్యాలయం లోపలి చొచ్చుకుని పోయేందుకు పాశం యాదగిరి మరికొంతమంది ప్రయత్నించారు. దీంతో నిర్మాతల మండలి కార్యదర్శి ప్రసన్న కుమార్‌తో గొడవకు దిగారు. ఇద్దరి మధ్య వాగ్వివాదం జరిగింది. ఆంధ్ర గో బ్యాక్ అంటూ అక్కడున్న కార్యకర్తలు నినాదాలు చేశారు. ఛాంబర్‌లో జరుగుతున్న గొడవ సమాచారం అందుకున్న ఫిలింనగర్ పోలీసులు రంగంలో దిగారు. పోలీస్‌స్టేషన్‌కు సిఐ రమ్మంటున్నారని కానిస్టేబుల్ వచ్చి చెప్పడంతో పాశం యాదగిరి కానిస్టేబుల్ మీద తిరగబడ్డారు. ఏం తప్పు చేశామని పోలీస్ స్టేషన్‌కు రావాలని, సీఐనే ఇక్కడికి రమ్మను అంటూ కానిస్టేబుల్‌పై పాశం యాదగిరి కేకలు పెట్టారు. దీంతో సిఐకు పోలీసులు ఫోన్ చేసి చెప్పడంతో సిఐ సంతోష్ రంగంలో దిగారు. పాశం యాదగిరితో పాటు అక్కడున్న వారిని సిఐ శాంతిప చేశారు. గొడవ సద్దుమణిగేలా చేశారు. సిఐ రంగప్రవేశంతో ఫిలిం ఛాంబర్‌లో గొడవ సద్దు మణిగింది. జ్ఞానపీఠ అవార్డు గ్రహీత సి.నారాయణ రెడ్డి జయంతి కార్యక్రమం నిర్మాతల మండలి హాలులో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మాతల మండలి కార్యాలయంలో సి.నారాయణ రెడ్డి ఫోటో లేదని గొడవకు దిగారు.

మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గొడవలు సృటించుకుంటే సమస్యలు పరిస్కారం కావని అన్నారు. సామరస్యంగా మాట్లాడి పరిష్కరించుకోవాలని చెప్పారు.



## బలోపేతమవుదాం

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ ప్రశ్నిస్తుందని తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సిపిఐ అనేక సమస్యలపై రాజీ లేని పోరాటాలు నిర్వహించిన చరిత్ర ఉందని, నాడు నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నడిపిన మహోత్తరమైన చరిత్ర జిల్లాకే దక్కిందన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను ప్రభుత్వం పూర్తి చేయకుంటే జిల్లాలో దిగ్బంధం చేసేందుకు పార్టీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ దోపిడీదారులకు, బడా బాబులకు దారాదత్తం చేస్తున్నారని, కార్మిక హక్కులను బిజెపి ప్రభుత్వం కాలరాస్తున్నదని విమర్శించారు. దేశంలో కమ్యూనిస్టులకు మంచి రోజులు రాబోతున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు మాట్లాడుతూ జిల్లాలోని బునాదిగాని, పిల్లాయిపల్లి, గంధమల్ల రిజర్వాయర్ పూర్తయ్యే వరకు ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. ఫార్మా పరిశ్రమలతో వెలువడుతున్న కాలుష్యం వల్ల చౌటుప్పల్ ప్రాంతంలో ప్రజలు అనారోగ్యాలకు గురై ఇబ్బందులు పడుతున్నారని, ఫార్మా కంపెనీలు రాకుండా అడ్డుకోవలసిన అవసరం ఉందన్నారు.

మహాసభకు జిల్లా కార్యవర్గ సభ్యులు బోడ సుదర్శన్, బండి జంగమ్మ, చేదే చంద్రయ్య, అధ్యక్ష వర్గంగా వ్యవహరించగా, మహసభలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు యానాల దామోదర్ రెడ్డి, బోలగాని సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, కొల్లూరి రాజయ్య, ఎండిఇమ్రాన్, బచ్చనగోని గాలయ్య, ఉప్పల ముత్యాలు, చెక్క వెంకటేష్, కుసుమని హరిచంద్ర, ఏశాల అశోక్, ప్రజానాట్యమండలి రాష్ట్రఅధ్యక్షులు కురిమిద్ద శ్రీనివాస్, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పాశికంటి లక్ష్మీ నరసయ్య, స్వాతంత్ర సమరయోధులు బత్తిని యాదగిరి, వలిగొండ మండల కార్యదర్శి సలిగంజి వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

## క్రస్ట్ గేట్లు ఓపెన్

(మొదటి పేజీ తరువాయి)

తీస్తాం అన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు ద్వారా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల లోని 22లక్షల ఎకరాలకు సాగునీరుతుందని చెప్పారు. జవహర్ కుడి కాలువ ద్వారా 11.74 లక్షల ఎకరాలు, లాల్ బహదూర్ ఎడమ కాలువ ద్వారా 10.38 లక్షల ఎకరాలకు నీరు అందిస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణలో మొత్తం 6లక్షల 50వేల ఎకరాలకు సాగు నీరు అందుతుండగా, నల్లగొండ జిల్లాలో 1,50,000 ఎకరాలు, సూర్యాపేట జిల్లాలో రెండు లక్షల 30వేల ఎకరాలు, ఖమ్మం జిల్లాలో రెండున్నర లక్ష ఎకరాలకు ఆయకట్టుకు నాగార్జునసాగర్ ప్రాజెక్టు ద్వారా సాగునీరందుతున్నదని తెలిపారు. 2005 సంవత్సరంలో నాగార్జున సాగర్ ప్రాజెక్టు స్వర్ణోత్సవాలు. నిర్వహించడం జరిగిందని చెప్పారు. తను ఆరుసార్లు శాసనసభ్యుడిగా,



ఒకసారి పార్లమెంటు సభ్యునిగా ఉంటూ ఇప్పుడు ఇరిగేషన్ ప్రాజెక్టు మంత్రిగా నాగార్జున సాగర్ ద్వారా నీటిని వదలడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో తమ ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత గత వానాకాలం, యాసంగి, వానాకాలం కలిసి రెండు లక్షల 81వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని. పండించడం జరిగిందని, ఇందులో నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ పాత్ర ముఖ్యమని అన్నారు.సాగునీటితో పాటు నాగార్జునసాగర్ పవర్ ప్రాజెక్ట్ ద్వారా గడచిన 4 రోజులుగా 30000 క్యూసెక్కుల నీటినితో పూర్తిస్థాయిలో, 700 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి చేశామన్నారు. కార్యక్రమంలో నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జైవీర్ రెడ్డి, మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, రాష్ట్ర పౌరసరఫరాల ప్రిన్సిపల్ సెక్రెటరీ డిఎస్ చౌహాన్,జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్‌పి శరత్ చంద్ర పవర్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, జిల్లా ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్ అజయ్ కుమార్, నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎస్ఈ మల్లికార్జునరావు, నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు. కాగా నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ ద్వారా మంత్రులు 6 క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువకు వదిలిన తర్వాత అధికారులు 14 గేట్ల ద్వారా 10932 క్యూసెక్కుల నీరు వదిలారు. మంగళవారం సాయంత్రం వరకు 20 గేట్ల ద్వారా 2లక్షల క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతానికి వదలనున్నట్లు ప్రాజక్ట్ అధికారులు తెలిపారు. అనంతరం మంత్రులు, అధికారులు నాగార్జున సాగర్ ఎడమ కాలువ ను సందర్శించి కృష్ణ జలాలకు పుష్పాభిషేకం చేశారు.

## 'మా జోక్యం తథ్యం'

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించింది. సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, న్యాయవాది ప్రశాంత్ భూషణ్ పిటిషన్‌దార్ల తరపున తమ వాదనలు వినిపిస్తూ, ఎన్నికల సంఘం ఆగస్టు 1న ప్రచురించిన ముసాయిదా జాబితా నుండి ప్రజలను అధికసంఖ్యలో మినహాయించారని, వారు కీలకమైన వారి ఓటు హక్కును కోల్పోతారని ధర్మాసనానికి విన్నవించారు. ప్రశాంత్ భూషణ్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం జారీచేసిన ఒక ప్రకటనలో ప్రత్యేక ముమ్మర సవరణ ప్రక్రియ సమయంలో 65లక్షల మంది వారి ఎన్యుమరేషన్‌ను సమర్పించలేదని వెల్లడించిందన్నారు. ఎందుకంటే వారు చనిపోయారని, వేరే చోటికి వెళ్లిపోయారని ఎన్నికల సంఘం జారీచేసిన ప్రకటనలో తెలియజేశారని న్యాయవాది ప్రశాంత్‌భూషణ్ ధర్మాసనానికి విన్నవించారు. ఈ వ్యక్తులు జాబితాలో చేరడానికి కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని ఆయన సమర్పించారు. జస్టిస్ సూర్యకాంత్ దీనిపై స్పందిస్తూ భారత ఎన్నికల సంఘం ఒక రాజ్యాంగ సంస్థగా ఉన్నది. అది చట్టప్రకారం నడుచుకోవాల్సి ఉంటుంది. అది ఏమైన తప్పు చేసినట్లయితే మీరు ఆ అంశాన్ని కోర్టు దృష్టికి తీసుకురావొచ్చు. మేం దానిని వింటాం' అని తెలియజేశారు. జస్టిస్ బాగ్చి ప్రశాంత్‌భూషణ్‌తో మాట్లాడుతూ '65లక్షల మంది ఓటర్లు ముసాయిదా జాబితాలో ఉండరని మీ ఆందోళన. ఇప్పుడు భారత ఎన్నిక్ల సంఘం ఓటర్ల జాబితాను సవరిస్తామని కోరుతోంది. మేము ఒక న్యాయసంస్థగా ఈ అంశాన్ని పరిశీలిస్తున్నాం. ఏమైనా సామూహిక మినహాయింపు ఉంటే మేం తక్షణమే జోక్యం చేసుకుంటాం. చనిపోయినవారి గురించి, బతికి ఉన్నవారి గురించి మీరు 15మంది (పిటిషనర్లు) కోర్టు దృష్టికి తీసుకురావచ్చు' అని చెప్పారు. ఆర్‌జెడి ఎంపి మనోజ్ ఝూ తరపున ప్రాతినిధ్యం వహించిన కపిల్ సిబల్ మాట్లాడుతూ ఈ 65లక్షల మంది ఎవరన్న విషయం ఎన్నికల సంఘానికి తెలుసు. వారు ఎవరనే విషయమై వారి పేర్లను ముసాయిదా జాబితాలో ప్రస్తావించినట్లయితే ఏ ఒక్కరికీ ఈ సమస్యే వచ్చేది కాదన్నారు. ఎన్నికల సంఘం తరపున హాజరైన సీనియర్ న్యాయవాది రాకేష్ ద్వివేదీ మాట్లాడుతూ ముసాయిదా జాబితా ప్రచురణ తర్వాత కూడా ఎన్యూమరేషన్ ఫారాలను దాఖలు చేయవచ్చని చెప్పారు. ఆగస్టు 8లోగా లిఖితపూర్వక వాదనలు దాఖలు చేయాలని ధర్మాసనం పిటిషనర్లను, ఎన్నికల సంఘాన్ని కోరింది.

## వరంగల్‌లో కలపండి

(మొదటి పేజీ తరువాయి)

సమస్యలు తీవ్రతరం అయ్యే అవకాశం ఉందని, హన్మకొండ జిల్లాను రద్దుచేసి వరంగల్ జిల్లాలో విలీనం చేయాలని సాధారణ ప్రజలు, మేధావులు, వ్యాపారులు, విద్యార్థులు, ఉద్యోగుల నుంచి డిమాండ్ వస్తోంది.

**నగర విభజనతో అభివృద్ధికి విఘాతం**

ఎవరో కొందరు రాజకీయ అవకాశవాదులు, స్వార్థపరులు జిల్లా ముక్కలైతే పదవులు వస్తాయని కోరుకోగానే వరంగల్ నగరాన్ని రెండు ముక్కలుగా విభజించి అభివృద్ధికి విఘాతం కలిగించారని పలువురు ఆరోపిస్తున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోని రాజకీయ అవకాశవాదులు తమ పదవుల కోసం చేసే కుట్రకోణాన్ని పక్కకు పెట్టి హనుమకొండ జిల్లాను రద్దుచేసి వరంగల్ మహా నగరాన్ని ఒకే జిల్లాగా ఉంచడం సరియైనదంటున్నారు. గీసుకొండ మండలంలో టెక్స్ టైల్ పార్క్, మామునూరు ఎయిర్ పోర్ట్, మడికొండలో ఐటీ పార్కులు, రైల్వే వాగన్ కోచ్ ఫ్యాక్టరీలు, హన్మకొండలో ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూట్ లు ఇలా మూడు ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నాయని, కాబట్టి వరంగల్, హన్మకొండ, కాజీపేట మూడు ప్రాంతాలను ఒకే జిల్లాలో ఉంచాలని కోరుతున్నారు.

**ఆరు ముక్కలు చేయడంపై అప్పట్లోనే అసంతృప్తి**

వరంగల్ జిల్లాను ఆరు ముక్కలు చేయడంపై అప్పట్లోనే చరిత్రకారులు, తెలంగాణ ఉద్యమకారుల్లో అసంతృప్తి వ్యక్తమైంది. ప్రధానంగా వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్ జిల్లాల విభజనపై ప్రజల్లో నిరసనలు వ్యక్తమయ్యాయి. వరంగల్ రూరల్ జిల్లాకు కనీసం పరిపాలన సాగించేందుకు హెడ్‌క్వార్టర్ లేకుండాపోయింది. పాలనాపరమైన కార్యకలాపాలన్నిటికీ ప్రజలు హనుమకొండకు రావాల్సి వస్తోంది. గత ప్రభుత్వ నిర్వాకంతోనే చరిత్రాత్మక ఏకశిలా నగరం రెండు ముక్కలైందనే వాదన ఉంది.

**మద్దతుగా పార్టీలు, ప్రజాసంఘాల ఉద్యమాలు**

వరంగల్ నగరాన్ని రెండు ముక్కలు చేయడంపై మొదటి నుంచీ కాంగ్రెస్, బిజెపి, సిపిఐ, సిపిఎం, న్యూ డెమోక్రసీతోపాటు ఓ వర్గం, ఇతర సంఘాలు వ్యతిరేకిస్తూ వచ్చాయి. జిల్లాల విభజన గత ప్రభుత్వంలోనే జరిగినందున ఒక్క బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు మాత్రమే తమ అభిప్రాయాన్ని బయటికి చెప్పలేక పోతున్నారు. కాగా మొదటి నుండి కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సైతం ఈ రెండు జిల్లాల విలీనానికి మద్దతు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్లు, తెలంగాణవాదులు, వివిధ సంఘాల నేతృత్వంలో రెండు వారాలుగా ఉద్యమాన్ని మొదలు పెట్టారు. రెండు జిల్లాల్లోని అన్ని ప్రాంతాల ప్రజల మద్దతును కూడా కట్టి త్వరలోనే సిఎం రేవంత్ రెడ్డిని కలుస్తామని వారు చెబుతున్నారు. ప్రధానంగా వీరు హనుమకొండ జిల్లాను రద్దు చేసి వరంగల్‌లో కలపాలని, గ్రేటర్ వరంగల్ నగరాన్ని విడగొట్టరాదని కోరుతున్నారు. వరంగల్, హనుమకొండ, కాజీపేట పట్టణాలు ట్రైసిటీస్‌గా ఒకే జిల్లా పరిధిలో ఉంటే అభివృద్ధికి ఎక్కువ అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com